www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నేడే మహానిమజ్జనం



- ఏర్పాట్లన్నీ పూర్తి.. 20 నిమజ్జన కేంద్రాలు.. 74 కృత్రిమ కొలనులు
- మధ్యాహ్నం 1:30లోపు ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం
- హుస్సేన్‌సాగర్‌కు 600 బస్సులు
- అర్ధరాత్రి 1 వరకు మెట్రో రైళ్లు
- మహాగణపతిని దర్శించుకున్న సీఎం

3

శనివారం | 6-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 159
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా.1.41 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ధనిష్ఠ రా.10.56 తదుపరి శతభిషం; వర్జ్యం: తె.5.45-7.16; దుర్ముహూర్తం: ఉ.6.05-7.43; అమృతఘడియలు: మ.12.50-2.23; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.21 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రాష్ట్ర విద్యాశాఖ హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి, కేకే తదితరులు

పల్లెలకూ డ్రగ్స్

గతంలో పట్టణాలకే పరిమితం.. నేడు ఊళ్లకూ వెళ్తున్నాయ్..

- పిల్లలను కనిపెట్టుకుని ఉండండి
- తప్పుదారి పట్టిన విద్యార్థులను సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత మీదే
- పిల్లలతో కలిసి మీరూ భోజనం చేయండి
- కార్పొరేట్ కంటే నాణ్యమైన విద్య అందిద్దాం
- ఇందుకు ఏం చేయాలో చెప్పండి.. చేస్తా
- మనమంతా బలమైన తెలంగాణను నిర్మిద్దాం
- గురు పూజోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తాము చేసిన పనులతో ప్రభుత్వ స్కూళ్లలో 3 లక్షల మంది విద్యార్థులు పెరిగారని వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పట్టణాలు, పెద్ద పెద్ద యూనివర్సిటీల్లోనే ఉంటుందనుకునే గంజాయి, డ్రగ్స్ ఇప్పుడు గ్రామాల వరకూ చేరాయని, పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ కనిపెట్టాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యార్థులూ గంజాయి విక్రయదారులుగా ఉంటున్నారని, వారిని చూస్తే చాలా బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుదారి పట్టిన పిల్లల తల్లిదండ్రుల శోకం భరించలేనిదని, ఆ విద్యార్థులను దారి మళ్లించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శిల్పకళా వేదికలో విద్యా శాఖ నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. ఉపాధ్యాయులకు గురు పూజోత్సవ

మిగతా 13వ పేజీలో...

గత పాలకుల భూ దోపిడీని
బయటపెట్టండి

- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవండి
- గ్రామ పాలనాధికారులతో సీఎం
- 5000 మందికి నియామక పత్రాల అందజేత

12

భారత్, రష్యాను చైనాకు
కోల్పోయాం!

- 'ట్రూత్ సోషల్‌'లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోస్ట్
- మూడు దేశాలూ చిరకాలం వర్ధిల్లాలని వ్యంగ్యవ్యాఖ్య
- టెక్ లీడర్స్‌తో భేటీ.. సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌పై ప్రశంసలు
- అమెరికాలో ఎంత పెట్టుబడులు పెడుతున్నారంటూ ప్రశ్న
- భారత్ మాకు సారీ చెప్పి.. ఒప్పందం కుదుర్చుకుంటుంది
- అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్



న్యూయార్క్/వాషింగ్టన్, సెప్టెంబరు 5: ఇటీవల జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలిసి మాట్లాడుకోవడంపై.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొద్దిగా ఆలస్యంగా అయినా తనదైన శైలిలో స్పందించారు! ఆ ముగ్గురు దేశాధినేతలూ కలిసి ఉన్న ఫొటోను తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్‌'లో పోస్ట్ చేసి.. "చూడబోతే మనం (అమెరికా).. ఇండియాను, రష్యాను చీకటి దేశమైన చైనాకు కోల్పోయినట్టు కనిపిస్తోంది" అని పేర్కొన్నారు. అంతటితో ఆపలేదు.. 'ఆ మూడు దేశాలూ చిరకాలం వర్ధిల్లుగాక' అంటూ వ్యంగ్యాన్ని ఆ పోస్టుకు జోడించారు. ట్రంప్ వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ

మిగతా 10వ పేజీలో...



టార్గెట్ తెలంగాణ!

- తాజా పరిణామాల్ని అనుకూలంగా మల్చుకొనే దిశగా బీజేపీ అధిష్ఠానం
- బీఆర్ఎస్ బలహీనపడితే బీజేపీ బలం పుంజుకుంటుందనే అభిప్రాయం
- 10, 11 తేదీల్లో రాష్ట్ర నేతలతో భేటీ.. పార్టీ బలోపేతానికి వ్యూహరచన
- ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం.. బీఆర్ఎస్ నేతలను చేర్చుకోవాలని యోచన
- ఢిల్లీ కనుసన్నల్లోనే రాష్ట్రంలో మొదలుకానున్న రాజకీయ కార్యాచరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాన్ని రూపొందించాలని బీజేపీ అధిష్ఠానం పావులు కదుపుతోంది. అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్రంలో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని భావిస్తున్న పార్టీ.. తాజా పరిణామాలను తమకు అనుకూలంగా మలచుకోవాలని భావిస్తోంది. బీఆర్ఎస్‌లో ప్రజా బలం ఉన్న నాయకులను చేర్చుకోవడమే కాకుండా.. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులతో సమన్వయానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈనెల తొమ్మిదిన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించాలని భావిస్తోంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న పార్టీ అగ్ర నేతలు.. 10, 11 తేదీల్లో రాష్ట్ర నాయకులతో ఢిల్లీలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతోపాటు ఇతర సీనియర్ నాయకులూ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా, బీఆర్ఎస్‌లో తాజా పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో బలోపేతం అయ్యేందుకు వ్యూహాన్ని రూపొందించనున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించిన

మిగతా 12వ పేజీలో...

పన్ను తగ్గింపు ఫలాలు
ప్రజలకు అందుతాయి



- ఈ నెల 22 తర్వాత మాకు చాలా పనుంది
- పకడ్బందీగా పర్యవేక్షణ కొనసాగుతుంది
- ప్రయోజనాలను ప్రజలకు చేరుస్తామని కంపెనీలు ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి
- అలా చేయని వాటితో మాట్లాడి తేలుస్తాం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ సంస్కరణలు, పన్ను రేట్ల తగ్గింపు ప్రయోజనాలు సాధారణ ప్రజలకు పూర్తిస్థాయిలో కచ్చితంగా అందుతాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందుకోసం తగిన చర్యలు చేపడతామని చెప్పారు. సంస్కరణలు అమల్లోకి వచ్చే ఈ నెల 22వ తేదీ తర్వాత ప్రభుత్వానికి చాలా పని ఉందని, అదో పకడ్బందీ నిఘా కార్యక్రమమని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల అమల్లో సహకరిస్తామని, ప్రయోజనాలను ప్రజలకు అందిస్తామని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ హామీ ఇచ్చాయని.. ఒకవేళ ఏదైనా కంపెనీ భిన్నంగా వ్యవహరిస్తే వారితో మాట్లాడి తేలుస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఇండియా టుడే టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలా సీతారామన్

మిగతా 2వ పేజీలో...

కార్ల ధరలు.. తగ్గింపు షురూ!

- తగ్గబోయే ధరలను ప్రకటించిన టాటా 2
- 65 వేల నుంచి 1.55 లక్షల వరకు మిగులు

జీఎస్టీ తగ్గినా.. రోగులకు ఊరట దక్కేనా?

- ప్రైవేటు ఆస్పత్రులపై అనుమానాలు 14



సైనిక శక్తి బలోపేతానికి
మెగా డిఫెన్స్ ప్లాన్

- అణుశక్తి యుద్ధనౌకలు, లేజర్ ఆయుధాలు
- సాయుధ దళాలకు హైపర్ సానిక్ క్షిపణులు
- 15 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బదులిచ్చిన భారత్.. ఇప్పుడు తన సైనిక శక్తిని మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, నెక్స్ట్ జనరేషన్ యుద్ధ ట్యాంకులు, హైపర్ సానిక్ క్షిపణులు, లేజర్, ఏఐ ఆధారిత ఆయుధాలు,

మిగతా 2వ పేజీలో...

సీఎస్ కార్యాలయం
అంధకారంలో ఉన్నట్లుంది!



- ప్రధాన కార్యదర్శి నుంచి ఇలాంటి ప్రవర్తనను ఊహించలేదు
- ప్రమాణపత్రం దాఖలు చేయలేదు.. ప్రత్యక్షంగా హాజరు కాలేదు!
- 'నిషేధిత జాబితా భూముల'పై ఇంత నిర్లక్ష్యమా?
- సీఎస్‌పై హైకోర్టు ఆగ్రహం.. చివరి అవకాశంగా వారం గడువు
- తదుపరి విచారణ ఈ నెల 10కి వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితా భూముల వివరాలు సేకరించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్న హైకోర్టు ఆదేశాలు అమలు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ప్రమాణపత్రం దాఖలు చేయకపోవడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిషేధిత జాబితా భూముల వివరాల సేకరణను 9 వారాల్లో పూర్తిచేయాలని.. ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినట్లు 10 రోజుల్లో ప్రమాణపత్రం దాఖలు చేయాలని, అలా చేయకపోతే సీఎస్ ప్రత్యక్షంగా హాజరుకావాలని జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం ఆగస్టు 25న ఆదేశాలు జారీచేసింది. తాజాగా ఈ పిటిషన్లు మరోసారి విచారణకు వచ్చాయి. ప్రభుత్వం తరఫున న్యాయవాది మురళీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు ఆదేశించిన విధంగా రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ) భూముల వివాదాలను పరిష్కరించడానికి సీసీఎల్ఏ చైర్మన్‌గా, రిటైర్డ్ జిల్లా జడ్జి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సభ్యులుగా ఉన్నతస్థాయి కమిటీని

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో సీబీఐ డైరెక్టర్

- జోన్ అధికారులతో రెండు గంటలకు పైగా భేటీ
- కాళేశ్వరం కేసు నేపథ్యంలో ఆకస్మిక పర్యటన?

హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శుక్రవారం హైదరాబాద్ వచ్చారు. హైదరాబాద్ జోన్ సీబీఐ అధికారులతో రెండు గంటలకు పైగా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ఈ నెల 1న రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే ప్రవీణ్ సూద్ ఆకస్మికంగా హైదరాబాద్‌లో పర్యటించారు. అయితే, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కేసీఆర్, హరీశ్‌రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో, ప్రవీణ్ సూద్ ఏ విషయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారనే విషయంలో స్పష్టత లేదు.

స్థానిక ఎన్నికలు
మరింత ఆలస్యం?



- గవర్నర్ వద్ద పెండింగ్‌లో 2 బీసీ బిల్లులు
- రాష్ట్రపతి దగ్గర కూడా మరో రెండు..
- కేంద్రం వద్ద అపరిష్కృతంగా 2 ఆర్డినెన్స్‌లు
- బీసీలకు చట్టబద్ధంగా 42% ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు
- 30కల్లా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు
- గవర్నర్ సానుకూల నిర్ణయంతోనే సాధ్యం
- లేని పక్షంలో కోర్టును మరింత గడువు కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్న నేపథ్యంలో.. పంచాయతీ, పరిషత్ ఎన్నికలు మరి కొంత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్‌ల వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులపై ఈ నెల 30లోపు ఏమీ తేల్చకుంటే.. హైకోర్టుకు ఇదే కారణం చూపి ఎన్నికల నిర్వహణకు మరి కొంత గడువు కోరే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులూ.. గత 5 నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఆ బిల్లులపై రాష్ట్రపతి ఏమీ తేల్చక పోవడంతో.. స్థానిక ఎన్నికల్లో

మిగతా 12వ పేజీలో...

అమెరికాలో తొలిసారిగా
జనాభా తగ్గుముఖం

- వలసలు, జననాల రేటు తగ్గడమే కారణం
- వెల్లడిస్తున్న సర్వేలు 2



గుండె గుభేల్..

- దేశంలో అత్యధిక మరణాలు ఇవే
- మొత్తం మరణాల్లో 31 శాతం
- తరువాతి స్థానాల్లో ఊపిరితిత్తుల అంటువ్యాధులు, క్యాన్సర్ 2
- భారత రిజిస్ట్రార్ జనరల్ తాజా సర్వే



వయో వృద్ధ భారతం

- దేశంలో తగ్గుతున్న జననాలు.. పెరుగుతున్న వృద్ధుల సంఖ్య
- జనాభాలో 10% వయోధికులే.. త్వరలోనే జపాన్, చైనా సరసన భారత్
- పింఛన్లు, ఆరోగ్య సంరక్షణకు అధిక ఖర్చు.. నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: మన దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రతి పది మందిలో ఒకరు 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. నమూనా నమోదు సిస్టం (ఎస్ఆర్ఎస్)- 2023 నివేదిక ఇటీవల ఆ గణాంకాలను వెల్లడించింది. పడిపోతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయంతో వయో వృద్ధ భారతంగా దేశం మారుతోందని నిపుణులు చెబుతున్నారు. వయోధికుల ఆరోగ్య సంరక్షణ, పింఛన్లు, సామాజిక భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదిక ప్రకారం దేశ జనాభాలో ప్రస్తుతం 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు 9.7 శాతంగా ఉన్నారు. 2011లో అది 8.6గా మాత్రమే ఉంది. 65 ఏళ్ల పైబడ్డ వారిలో పెరుగుదల 6.4 శాతంగా నమోదైంది. 60 ఏళ్ల పైబడిన వయోధికుల జనాభాలో కేరళ 15 శాతంతో అన్ని రాష్ట్రాల కంటే ముందు

మిగతా 2వ పేజీలో...

కార్ల ధరలు తగ్గింపు షురూ!

» వివిధ మోడళ్ల కార్లపై తగ్గబోయే ధరలను ప్రకటించిన టాటా మోటార్స్

» రూ.65వేల నుంచి రూ.1.55 లక్షల వరకు మిగులు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించేందుకు ఆటోమొబైల్ కంపెనీలు సిద్ధమయ్యాయి. ఈ నెల 22వ తేదీ నుంచి ఏయే మోడళ్ల ధరలు ఎంత వరకు తగ్గుతాయో చెబుతూ.. ముందస్తుగా బుకింగ్స్ రాబట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించాయి. ముందుగా ధరల తగ్గింపునకు టాటా మోటార్స్ శ్రీకారం చుట్టింది. తమ కార్ల ధరలు మోడల్‌ను బట్టి రూ.65,000 నుంచి రూ.1.55 లక్షల వరకు తగ్గుతాయని ప్రకటించింది. జీఎస్టీ పన్ను ప్రయోజనాన్ని పూర్తిగా కొనుగోలుదారులకు బదిలీ చేయాలనే ప్రభుత్వ ఉద్దేశానికి తాము కట్టుబడి ఉన్నట్టు టాటా మోటార్స్ (పాసింజర్ వెహికల్స్) ఎండీ శైలేశ్ చంద్ర తెలిపారు. కర్వ్ మోడల్‌పై రూ.65 వేల వరకు, టియాగోపై రూ.75 వేలు, టిగోర్‌పై రూ.80 వేలు, పంచ్‌పై రూ.85 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ.1.10 లక్షలు, హారియర్‌పై రూ.1.40 లక్షలు, సఫారీపై రూ.1.45 లక్షలు, నెక్సాన్‌పై రూ.1.55 లక్షల వరకు ధరల తగ్గింపు ఉంటుందని వెల్లడించారు. మరోవైపు టాటా మోటార్స్ బాటలోనే మిగతా కార్ల కంపెనీలు, ద్విచక్ర వాహనాల కంపెనీలు కూడా ధరల తగ్గింపును ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. త్వరలోనే మోడళ్ల వారీగా తగ్గింపు ప్రయోజనం ఎంత ఉంటుందనేది వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం. దీనితో పండుగకు కొత్త కారు, ద్విచక్ర వాహనం కొనాలని భావిస్తున్న వారికి.. ఏయే వాహనాలు ఎంతెంత ధరకు వస్తాయనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నవజాత శిశువు బరువు 5.2 కిలోలు

» మధ్యప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాలభీముడు

» ఈస్థాయి బరువుతో జననం అరుదు అంటున్న వైద్యులు



జబల్‌పూర్, సెప్టెంబరు 5: అప్పుడే పుట్టిన శిశువు ఎంత బరువు ఉంటాడు? రెండున్నర.. మహా అయితే మూడున్నర కిలోలు! మధ్యప్రదేశ్ జబల్‌పూర్ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం బాల భీముడిని తలపించేలా పుట్టిన మగ శిశువును చూసి వైద్యులే ఆశ్చర్యపోయారు. తూస్తే ఆ బిడ్డ 5.2 కిలోలున్నాడు. తల్లి శుభాంగి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఇంత బరువుతో బిడ్డ పుట్టడం అరుదైన విషయమని సిజేరియన్ చేసిన గైనకాలజిస్టు డాక్టర్ భావనా మిశ్రా చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డల్లో మగ శిశువులైతే సగటున 2.8-3.2 కిలోలు, ఆడ శిశువులైతే 2.7-3.1 కిలోల వరకు బరువు ఉంటారని ఆమె పేర్కొన్నారు. ఈస్థాయి బరువుతో పుట్టిన బిడ్డను తాను చూడలేదన్నారు.

లోకం తీరు



సైనిక శక్తి బలోపేతానికి మెగా డిఫెన్స్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

స్టెల్త్ బాంబర్ డ్రోన్‌లు వంటి అత్యాధునిక ఆయుధాలను సైనిక దళాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రచించింది. వచ్చే 15 ఏళ్లలో ఈ లక్ష్యాన్ని పూర్తిచేసేలా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ చేపట్టిన అతిపెద్ద డిఫెన్స్ అప్‌గ్రేడ్ ప్లాన్ ఇదే కావడం విశేషం. ఈ రోడ్‌మ్యాప్ ప్రకారం పాత టీ-72 యుద్ధ ట్యాంకులను 1,800 ఫ్యూచర్ ట్యాంకులతో భర్తీ చేయనున్నారు. వీటితో పాటు మరో 400 తేలికపాటి యుద్ధ ట్యాంకులను కూడా సైన్యానికి అందిస్తారు. యుద్ధట్యాంకులపై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, 700 రోబోటిక్ కౌంటర్ ఐఈడీ వ్యవస్థలను అందించనుంది. వీటితోపాటు 6 లక్షల శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను కూడా సైన్యానికి అందించనున్నారు.

నేవీ కోసం తర్వాతి తరం యుద్ధ నౌకలు

నౌకాదళం కోసం సరికొత్త విమానవాహక యుద్ధ నౌక, పది తర్వాతి తరం యుద్ధ నౌకలు, ఏడు అధునాతన కార్వెట్‌లు, నాలుగు ల్యాండింగ్ డాక్ ప్లాట్‌ఫారమ్‌లు సమకూర్చనున్నారు. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రో మాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్ కూడా అందించనున్నారు. ఇక భారత వైమానిక దళం కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్స్, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, రిమోట్ సాయంతో పనిచేసే 100 విమానాలు, గైడెడ్ ఆయుధాలను అందిస్తారు. ఇవి కాకుండా యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, ఏఐతో పనిచేసే ఆయుధాలు, మానవరహిత విమానాల కోసం గగనతలం నుంచి భూమిపై ఉన్న లక్ష్యాలపైకి ప్రయోగించే క్షిపణి, అత్యాధునిక టార్గెటింగ్ ప్యాడ్స్ కూడా సమకూర్చనున్నారు.

ఖరీదైన వాహనాలతో కాన్వాయ్.. బాడీగార్డులకు పోలీసు డ్రెస్

» యూపీలో నకిలీ ఐఏఎస్ హల్‌చల్

» ప్రభుత్వ భేటీలకూ సౌరభ్ హాజరు



లఖ్‌నవూ, సెప్టెంబరు 5: యువ ఐఏఎస్ ముసుగులో దందాలు చేసిన ఫేక్ అధికారి సౌరభ్ త్రిపాఠిని ఉత్తరప్రదేశ్ పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వస్థాయిలో జరిగే అతి ముఖ్యమైన భేటీల నుంచి ఉన్నతాధికారులు ఇచ్చే పార్టీలవరకు..అన్నింటికీ రాచబాటలో త్రిపాఠి హాజరయిన వైనం దర్యాప్తు అధికారులనే నివ్వెరపరుస్తోంది. చివరకు అంతర్గత సమావేశాలకూ ఐఏఎస్ దర్జాతో వెళ్లివచ్చేవాడని, మంత్రులను కలుసుకుని సెల్ఫీలు దిగేవాడని తెలుసుకుని ప్రభుత్వ వర్గాలు విస్మయం చెందుతున్నారు. వ్యవస్థలోని లొసుగులను వాడుకుని హైసెక్యూరిటీ జోన్లను సైతం ఛేదించుకుని ప్రభుత్వాన్ని, పోలీసులను, వ్యాపారులను ఓ 36 ఏళ్ల వ్యక్తి కొన్నేళ్లపాటు బురిడీ కొట్టించిన తీరు ఐఏఎస్ వర్గాలను దిగ్భ్రమకు గురిచేసింది. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ కేబినెట్ స్పెషల్ అధికారి ఐడీతో త్రిపాఠి చలామణి అయ్యాడు. యూపీ దాటి బయటకు వెళితే కేంద్ర ప్రభుత్వ అధికారిని అని చెప్పుకొనేవాడు. ఎక్కడకు వెళ్లినా ఆరేడు వాహనాలతో కాన్వాయ్ ఏర్పాటుచేసుకునేవాడు. ప్రైవేటు బాడీగార్డులను పోషించేవాడు. వారిలో ఒకరికి పోలీస్ యూనిఫాం వేసి.. వారందరితోకలిసి ప్రభుత్వ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు.. సెక్యూరిటీ సిబ్బంది ఆటోమెటిక్‌గా పక్కకు తప్పుకొని దారి ఇచ్చేవారు. అత్యంత సంపన్నులు, పారిశ్రామికవేత్తలు ఉండే విలాసవంతమైన భవనాల్లో నివసించేవాడు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల కోసం రేంజ్ రోవర్ వాడితే, దందాల కోసం మెర్సిడెస్ బెంజ్ సీ 220 లేక డిఫెండర్‌ను బయటకుతీసేవాడు. లఖ్‌నవూలో ఇటీవల వాహనాల తనిఖీ సందర్భంగా త్రిపాఠి అసలు రంగు బయటపడింది. కాన్వాయ్‌ల నుంచి బాడీగార్డులు, ఐడీ కార్డుల వరకు.. అంతా ఫేకేనని గుర్తించి, ఆయనను అరెస్టు చేసి, జైలుకు పంపించారు. ఈయన ఫేక్ అని త్రిపాఠి దగ్గర పనిచేసిన అసిస్టెంట్ కూడా తెలుసుకోలేకపోయాడని, అంతగా అందరినీ ఆయన నమ్మించగలిగాడని లఖ్‌నవూ డీసీపీ (క్రైమ్) కమలేశ్ దీక్షిత్ తెలిపారు. సౌరభ్ ఐఏఎస్ కాదని తెలిసి అతని మిత్రులు కూడా షాక్ అయ్యారు.

మానవబాంబుల బెదిరింపు..ముంబైలో హైఅలెర్ట్

» లష్కరే పేరిట ట్రాఫిక్ పోలీసు హెల్ప్‌లైన్‌కు మెసేజ్

ముంబై, సెప్టెంబరు 5: వినాయక నిమజ్జన ఉత్సవానికి ముంబై నగరం సిద్ధమవుతున్న వేళ మానవబాంబుల బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. ముంబైలోకి ప్రవేశించిన 14 మంది ఉగ్రవాదులు 400 కిలోల ఆర్డీఎక్స్‌ను వేర్వేరు వాహనాల్లో పెట్టి పేలుళ్లకు సిద్ధంగా ఉన్నారని పేర్కొంటూ పోలీసులకు వచ్చిన సందేశంతో ముంబైలో హైఅలెర్ట్ ప్రకటించారు. ముంబైలో శనివారం నిమజ్జన ఉత్సవం జరగనుండగా ముంబై ట్రాఫిక్ పోలీసు వాట్సాప్ హెల్ప్‌లైన్ నెంబరుకు గురువారం ఈ బెదిరింపు సందేశం వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బెదిరింపు సందేశం పంపిన వ్యక్తి తనని తాను లష్కరే తాయిబాకు చెందిన వ్యక్తిగా పేర్కొన్నాడు. తమ వాళ్లు 14 మంది ముంబైలో అడుగుపెట్టారని 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌ను అమర్చారని, ముంబైలో జరిగే ఈ పేలుళ్లతో భారతదేశాన్నే వణికిస్తామని ఆ సందేశంలో హెచ్చరించాడు. ఈ బెదిరింపు సందేశంతో అప్రమత్తమైన పోలీసు వర్గాలు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశాయి. కీలకమైన, సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను పెంచడమే కాక సోదాలు చేస్తున్నాయి.

గుండె గుభేల్..!

» దేశంలో 31% మరణాలు గుండె సంబంధిత వ్యాధులతోనే

» రిజిస్ట్రార్ జనరల్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: దేశంలో ఇప్పటికీ గుండె, రక్తనాళాల సంబంధిత వ్యాధులతో మరణిస్తున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం మరణాల్లో 31% ఇవే ఉన్నాయి. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో తాజా నమూనా నమోదు సర్వే నివేదిక దీన్ని స్పష్టంచేసింది. 2021-2023 సంవత్సరాల మధ్య మరణ కారణాలపై నివేదిక బుధవారం విడుదలైంది. దీని ప్రకారం దేశంలో అంటువ్యాధులు కాని వ్యాధుల వల్ల సంభవిస్తున్న మరణాల శాతం 56.7గా ఉంది. అంటువ్యాధులు, గర్భిణి సంబంధిత వ్యాధులు, నవజాత శిశువులకు కలిగే ఇబ్బందులు, పౌష్టికాహార లోపం వల్ల సంభవించే మరణాల శాతం 23.4గా ఉంది. 2020-2022 సంవత్సరాలలో కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో పైన పేర్కొన్న వరుసలో ఈ శాతాల సంఖ్య 55.7, 24.0గా ఉంది. గుండె, రక్తనాళాల సంబంధిత(కార్డియోవాస్కులర్) మరణాల తర్వాత ఊపిరితిత్తుల అంటువ్యాధుల మరణాలు 9.3% తో 2వ స్థానంలో ఉండగా..తర్వాతి స్థానాల్లో 6.4%తో క్యాన్సర్ మరణాలు, 5.7%తో ఊపిరితిత్తుల వ్యాధులున్నాయి. 30ఏళ్లు దాటిన వారిలో జీవనశైలి ప్రధానంగా కార్డియోవాస్కులర్ జబ్బులకు కారణంగా కనిపిస్తోంది. 15-29 మధ్య వయస్సు వారిలో కావాలని తగిలించుకొనే దెబ్బలు, ఆత్మహత్యలు మరణాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. 5.3% మరణాలు జీర్ణకోశ వ్యాధులతో, 4.9% మరణాలు జ్వరాల వల్ల, 3.5% మరణాలు మధుమేహ వ్యాధితో సంభవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

నీకెంత ధైర్యం?

నన్నే వీడియో కాల్ చేయమంటావా?

» మహిళా ఐపీఎస్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం వాగ్వాదం

» ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు ఆపేయాలని ఆదేశం



ముంబై, సెప్టెంబరు 5: ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకున్న ఐపీఎస్ అధికారిణితో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వాగ్వాదానికి దిగారు. వీరిద్దరి మధ్య సాగిన సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రోడ్డు నిర్మాణం కోసం సోలాపూర్ జిల్లా కుర్దు గ్రామంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో సబ్ డివిజనల్ పోలీసు అధికారిణి అంజనా కృష్ణ ఆగస్టు 31న పోలీసు బలగాలు, రెవెన్యూ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తవ్వకాలు సాగిస్తున్న వారిని అధికారులు అడ్డుకున్నారు. దీంతో స్థానిక ఎన్సీపీ కార్యకర్త ఒకరు నేరుగా అజిత్ పవార్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. తర్వాత ఆ ఫోన్‌ను అంజనా చేతికి అందించారు. తాను డిప్యూటీ సీఎంను మాట్లాడుతున్నానని, వెంటనే అక్కడి చర్యలను ఆపేయాలని ఆదేశించారు. దీనికి ఆమె స్పందిస్తూ... "ఫోన్‌లో మాట్లాడుతున్నదెవరో నాకెలా తెలుస్తుంది? నా నంబరుకు వీడియో కాల్ చేయగలరా?" అని కోరారు. దీంతో పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీకు అంత ధైర్యం ఉందా? మీపై చర్యలు తీసుకుంటా... నన్నే వీడియో కాల్ చేయమంటారా? నన్ను చూడాలనుకుంటున్నారా... మీ నంబరు ఇవ్వండి లేకపోతే నా నంబరుకు వాట్సాప్ కాల్ చేయండి.. నీకెంత ధైర్యం" అంటూ కేకలు వేశారు. అనంతరం పవార్‌కు వీడియో కాల్ చేసిన అధికారిణి... ఆయన గొంతును గుర్తించలేకపోయినట్లు వివరణ ఇచ్చారు. అక్కడ తీసుకుంటున్న చర్యలను వెంటనే ఆపేయాలని పవార్ ఆమెను ఆదేశించారు. ఈ వీడియో వైరల్ కావడంతో పాటు పవార్ తీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్సీపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆ వీడియోను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారని ఎన్సీపీ ఎంపీ సునీల్ తట్కరే ఆరోపించారు. కార్యకర్తలను శాంతింపజేయడానికే అధికారిణిని పవార్ మందలించి ఉండొచ్చని, ఆమె విధులను అడ్డుకోవాలనేది ఆయన ఉద్దేశం కాదని చెప్పుకొచ్చారు. కాగా, కేరళకు చెందిన అంజనా కృష్ణ 2022-23 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి. సోలాపూర్ జిల్లా కర్మాలా డీఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. నిజాయితీ, అంకితభావానికి మారుపేరుగా గుర్తింపు పొందిన ఆమె సివిల్స్ పరీక్షల్లో 355వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి తిరువనంతపురంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు.

జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదు: పవార్

చట్టపరమైన అంశాల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం తనకు లేదని, అక్కడ నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంతో పాటు, అవి మరింత తీవ్రతరం కాకూడదనే ఆమెకు ఫోన్ చేశానని అజిత్ పవార్ శుక్రవారం వివరణ ఇచ్చారు. పోలీసు విభాగంపైనా, మహిళా అధికారులపైనా తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. పారదర్శక పాలనకు కట్టుబడి ఉన్నామని, ఇసుక తవ్వకాలతో సహా చట్ట విరుద్ధమైన అన్ని కార్యకలాపాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పవార్ స్పష్టం చేశారు. కాగా, ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన అంజనా కృష్ణతో పాటు రెవెన్యూ అధికారులను విధులు నిర్వర్తించకుండా నిరోధించారనే ఆరోపణలపై పోలీసులు ఎన్సీపీ కార్యకర్తలు సహా పలువురిపై కేసు నమోదు చేశారు.

పవార్‌కు ప్రభుత్వంలో కొనసాగే హక్కు లేదు: రౌత్

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దొంగలను కాపాడుతున్నారని శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. ఆయనకు ప్రభుత్వంలో కొనసాగే హక్కు లేదన్నారు. "చట్ట విరుద్ధ కార్యకలాపాలకు మద్దతివ్వమని ఒక ఐపీఎస్ అధికారిని అడుగుతున్న పవార్... ఇతరులకు మాత్రం చట్టాన్ని పాటించాలని ఉపదేశాలిస్తుంటారు. తన పార్టీ దొంగలకు రక్షణ కల్పించమని ఆమెను తిడుతున్నారు. ఇదేనా మీ క్రమశిక్షణ..? ఇసుకను అక్రమంగా తవ్వడమంటే ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడమే. మీరు మొత్తం రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. మంత్రులు సిగ్గుపడాలి. గతంలో ఇలాంటి ఘటనల కారణంగా చాలామంది నాయకులు నైతిక కారణాలతో రాజీనామా చేయాల్సి వచ్చింది" అని రౌత్ గుర్తుచేశారు.

కేరళ యూట్యూబర్ మునాఫ్‌కు సిట్ నోటీసు

ధర్మస్థల వివాదంపై ముగ్గురిని విచారించిన సిట్ చీఫ్



బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు కేరళకు చెందిన యూట్యూబర్ మునాఫ్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 11న ధర్మస్థల అటవీ ప్రాంతం నుంచి ఓ పుర్రెను తీసుకొస్తున్న వీడియోనూ మునాఫ్ తన యూట్యూబ్ చానెల్‌లో పోస్టు చేశారు. ఈ వీడియోలో మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్య ఓ కత్తితో పుర్రెను ఎత్తుకొస్తున్న దృశ్యాలు ఉన్నాయి. కాగా, ఇదంతా కల్పితమని, అటవీ ప్రాంతంలో పుర్రె లభించలేదని చన్నయ్య సిట్ ఎదుట తెలిపారు. జయంత్, గిరీశ్ ఇచ్చిన పుర్రెను కత్తితో తీసుకొచ్చానని వివరించారు. దీంతో కుట్రలో మునాఫ్ పాత్ర గురించి తెలుసుకునేందుకు విచారణకు రావాలని సిట్ నోటీసులు జారీ చేసింది. ధర్మస్థల వివాదానికి సూత్రధారులుగా భావిస్తున్న జయంత్, గిరీశ్ మట్టణ్ణవర్, అభిషేక్‌ను సిట్ శుక్రవారం విచారించింది. వారిని సిట్ కార్యాలయానికి పిలిపించి, వేర్వేరుగా సుదీర్ఘ సమయంపాటు విచారించారు. మరోవైపు మండ్యకు చెందిన 'గోల్డెన్ కన్నడిగ' యూట్యూబర్ సుమంత్ బాంబు పేల్చారు. ధర్మస్థల వివాదంపై యూట్యూబ్‌లో పోస్టు పెట్టాలని 'యునైటెడ్ మీడియా' యూట్యూబర్ అభిషేక్ తనకు సూచించారని సుమంత్ తెలిపారు. పోస్టు పెడితే ఫండింగ్ సాధ్యమవుతుందని అభిషేక్ చెప్పారని అన్నారు. ఫండింగ్ చేసేవారు ఎవరని అడిగానని, మహేశ్ తిమరోడి, గిరీశ్ మట్టణ్ణవర్ తమ బాస్‌లని, అంతా వారే చూసుకుంటారని ఆయన తెలిపారని అన్నారు.

వయో వృద్ధ భారతం!

(మొదటి పేజీ తరువాయి)



ఉంది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర వృద్ధుల జనాభా జాతీయ సగటు 9.7 శాతం కంటే ఎక్కువ ఉంది. ఇక బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఆ వయోధిక జనాభా 7 నుంచి 8 శాతం మధ్యే ఉంది. అంటే ఈ రాష్ట్రాల్లో జనాభా వృద్ధి బాగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో జనాభా తగ్గుముఖం పట్టింది.

పెరుగుదలకు కారణాలు, సవాళ్లు

- వృద్ధుల జనాభా పెరుగుదలకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, మొత్తం పునరుత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) జనాభా భర్తీ స్థాయి 2.1 కంటే తగ్గిపోవడం, రెండు.. ఆయర్దాయం పురుషులకు 68.5 ఏళ్లకు, మహిళలకు 72.5 ఏళ్లకు పెరగడం.
- టీఎఫ్ఆర్ తగ్గడం వల్ల జనాభాలో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆయుర్దాయం పెరగడం వల్ల వృద్ధుల జనాభా పెరుగుతూపోతోంది.
- వయోధికులు పెరగడం వల్ల ఆరోగ్య సంరక్షణ భారం ప్రభుత్వంపై పెరుగుతుంది. మధుమేహం, హృద్రోగ సంబంధిత జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి వృద్ధుల వ్యాధులకు వైద్యంపై అధికంగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.
- వృద్ధులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. ప్రభుత్వంపై పింఛన్ల భారం పడుతుంది. సామాజిక భద్రత కూడా సవాల్‌గా మారుతుంది.
- దేశంలో తక్కువ మంది ప్రజలు మాత్రమే శ్రామిక శక్తిగా ఉంటారు. యువత ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయి. వృద్ధ జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో శ్రామిక శక్తి తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి.
- సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. వృద్ధులు ఒంటరిగా మిగిలిపోయి ప్రభుత్వంపైనో, సేవా సంస్థలపైనో ఆధారపడాల్సి వస్తోంది.

భవిష్యత్ కోసం చర్యలు తీసుకోవాలి

ఇప్పటికీ దేశంలో యువ జనాభా ఎక్కువగానే ఉన్నా.. వృద్ధ జనాభాలో పెరుగుదల, పిల్లల జనాభా తగ్గుదల ఓ హెచ్చరికగా నిపుణులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వృద్ధుల జనాభా అధికంగా ఉన్న చైనా, జపాన్, యూరప్ దేశాల సరసన భారత్ కూడా చేరడానికి ఎంతో సమయం పట్టదంటున్నారు. వృద్ధులకు సదుపాయాలు కల్పిస్తూనే, యువ జనాభా పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

అమెరికాలో జనాభా తగ్గుముఖం!

వాషింగ్టన్, సెప్టెంబరు 5 : అమెరికాకు వలస వచ్చే వారి సంఖ్య తగ్గిపోవడం, జననాల రేటు తక్కువగా ఉండడంతో తొలిసారిగా 2025లో ఆ దేశ జనాభా తగ్గనున్నట్లు అమెరికన్ ఎంటర్‌ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్(ఏఈఐ) అంచనా వేస్తోంది. ఈ సంవత్సరం ఆ దేశానికి వలస వచ్చే వారి సంఖ్య 5,25,000కన్నా తక్కువగా ఉండవచ్చని ఏఈఐ తెలిపింది. దీనికితోడు గత ఏడాది జనాభా లెక్కల ప్రకారం 5,19,000 జననాలు మాత్రమే నమోదయ్యాయి. దీంతో అమెరికా జనాభా సంఖ్యలో 6000 మంది తగ్గిపోతారని అంచనా. 250 ఏళ్ల అమెరికా చరిత్రలో ఇటువంటి పరిస్థితి ఇదే తొలిసారి. ఈమేరకు పలు అమెరికన్ మీడియా సంస్థలు వివరాలు వెల్లడించాయి. ఈ ఏడాది అమెరికాకు వలస వచ్చే వారి సంఖ్య 28 లక్షల నుంచి నికరంగా 5,25,000కన్నా తక్కువకు పడిపోయే అవకాశం ఉందని ఏఈఐ అంచనా వేస్తోంది. ఇది భారీ తగ్గుదల. కాగా అమెరికా జనాభా గతంలో ఎప్పుడూ తగ్గుముఖం పట్టలేదు. అమెరికన్ సివిల్ వార్‌లో 7,00,000 మంది మరణించినప్పుడు గానీ, కోవిడ్-19 పెండెమిక్ సమయంలో గానీ అమెరికన్ జనాభా తగ్గుముఖం పట్టకుండా ఏటా పెరుగుతూనే వచ్చింది. జనాభా తగ్గడానికి జననాల రేటు తక్కువగా ఉండడం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. అమెరికాలో రాబోయే 30 ఏళ్ల వరకు జననాల రేటు 1.6గానే ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫ్యామిలీ స్టడీస్(ఐఎఫ్ఎస్) సంస్థ సర్వే తెలియజేస్తోంది. ఇది జనాభా సంఖ్య నిలకడగా కొనసాగడానికి ప్రతి మహిళకు ఉండాల్సిన పిల్లల సంఖ్య 2.1కన్నా తక్కువ.

స్మార్ట్ ఉపాధ్యాయులు కావాలి

» స్మార్ట్ తరగతి గదులకంటే దేశానికి వీరివల్లే ఉపయోగం: రాష్ట్రపతి ముర్ము

» ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 60మంది టీచర్లకు అవార్డుల ప్రదానం



రాష్ట్రపతి నుంచి అవార్డును స్వీకరిస్తున్న స్నేహలత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ తరగతి గదులు, స్మార్ట్ నల్లబల్లల కంటే స్మార్ట్ టీచర్లే ముఖ్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. "సమాజ అవసరాలను, దేశ ప్రయోజనాలను నెరవేర్చేలా విద్యార్థులను తీర్చిదిద్దే సత్తా వారికి మాత్రమే ఉంది" అని తెలిపారు. ప్రపంచంలోనే సుసంపన్న జ్ఞానం కలిగిన సూపర్‌పవర్‌గా...భారత్‌ను జాతీయ విద్యావిధానం తయారుచేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన కాలం తన జీవితంలో అతి మధురమైనదంటూ..అప్పటి రోజులను ఆమె గుర్తుచేసుకున్నారు. భావోద్వేగం..తెలివితేటలు.. రెండూ కలిగినవారే ఉత్తమ ఉపాధ్యాయులని తెలిపారు. అనంతరం 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను రాష్ట్రపతి అవార్డులతో సత్కరించారు. టీచర్లకు అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. పిల్లలకు ఇచ్చే హోంవర్క్‌లో స్వదేశీ ఉత్పత్తులకు ప్రచారం, మేకిన్ ఇండియా వంటి అంశాలు ఉంటే బాగుంటుందని సూచించారు.

వీరే మన ఉత్తమ టీచర్లు..

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాల కేటగిరిలో.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులు అవార్డులను తీసుకున్నారు. వీరిలో ఏపీ నుంచి ప్రొఫెసర్ జె. విజయలక్ష్మి (స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), మెండా దేవానందకుమార్ (డాక్టర్ లాకిరెడ్డి హన్మిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం) ఉన్నారు.. తెలంగాణ నుంచి ప్రొఫెసర్ సాంకేత్ గోయల్ (బిట్స్ పిలాని, హైదరాబాద్), ప్రొఫెసర్ వినీత్ ఎన్‌బీ (ఐఐటీ, హైదరాబాద్), స్నేహలత నాక (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఉన్నారు. పాఠశాలల కేటగిరిలో.. ఏపీ నుంచి భీమునిపట్నంలో పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీదేవి, తెలంగాణ నుంచి పెన్‌పహాడ్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపు లబ్ధి కచ్చితంగా ప్రజలకు అందాల్సిందే!

» కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ హేతుబద్ధీకరణ ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా అందించాల్సిందేనని, ఈ అంశంపై నిఘా పెడతామని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. వివిధ రకాల వస్తువులపై తగ్గిన పన్నుల ప్రకారం వాటి ధరలను తగ్గిస్తామని పరిశ్రమవర్గాలు తనకు హామీ ఇచ్చాయని తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50% సుంకాలు విధించడంతోనే మోదీ సర్కారు జీఎస్టీ సంస్కరణల నిర్ణయం తీసుకుందన్న వ్యాఖ్యలను గోయల్ తిరస్కరించారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, కార్యదర్శులు, కేంద్ర ఆర్థిక మంత్రి ఏడాదిపాటు సంప్రదింపులు జరిపాక ఈ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. ఏదో దేశం తీసుకున్న నిర్ణయానికి, జీఎస్టీ హేతుబద్ధీకరణకు సంబంధం లేదన్నారు. కాగా పన్నుల తగ్గింపు ఫలాలు వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందాల్సిందేనని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిఘా పెడుతుందని గోయల్ తెలిపారు. రాష్ట్రాలూ తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. కాంగ్రెస్‌పాలిత కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు జీఎస్టీమండలి సమావేశంలో అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించాయని, చివరికి ఏకాభిప్రాయంతోనే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పన్ను తగ్గింపు ఫలాలు ప్రజలకు అందుతాయి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. "దేశంలో సాధారణ, మధ్య తరగతి వారి కనీస అవసరాలు, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకునే జీఎస్టీ సంస్కరణలు తెచ్చాం. ప్రస్తుతం 90 శాతానికిపైగా వస్తువులు 5శాతం పన్ను పరిధిలోకి వచ్చాయి. ఒకశాతం వస్తుసేవలపై మాత్రమే 40% పన్ను ఉంది" అని చెప్పారు. పన్ను తగ్గింపు ఫలాలు సాధారణ ప్రజలకు కచ్చితంగా చేరుతాయన్న విశ్వాసంతో ఉన్నామని, ఇందు కోసం కొన్ని నెలలు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ధరల తగ్గింపును క్షేత్రస్థాయిలో ఎంపీలు పర్యవేక్షిస్తారన్నారు. పన్ను తగ్గింపుతో కేంద్ర, రాష్ట్రాలకు ప్రస్తుతం ఆదాయం తగ్గుతుందని.. అయితే వినియోగం పెరగడం వల్ల తిరిగి ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

ఆ రెండు తప్ప.. ప్రాజెక్టులన్నీ నిండాయి!

- కృష్ణా, గోదావరిలో నిండుకుండల్లా జలాశయాలు
- సింగూరు, తుంగభద్రల్లో నిల్వను తగ్గించిన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల కింద ఉన్న జలాశయాల్లోకి నిలకడగా నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. సింగూరు, తుంగభద్ర రిజర్వాయర్లు తప్ప మిగిలినవన్నీ నిండిపోయాయి. కృష్ణా బేసిన్‌లో జూరాల ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల వరద రాగా.. 70 వేల క్యూసెక్కులను వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 1.84 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నాగార్జునసాగర్‌కు 1.34 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 52 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్‌కు 70 వేల క్యూసెక్కులు వస్తుండగా.. 51 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ఎల్లంపల్లికి 1.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.13 లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. సింగూరు కట్ట ప్రమాదంలో ఉందన్న డ్యామ్ సేఫ్టీ సంస్థ హెచ్చరికలతో నీటి నిల్వను కుదించారు. భారీ వరద వస్తున్నా.. నిల్వను గణనీయంగా తగ్గించుకున్నారు. సింగూరు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా.. 16.64 టీఎంసీలే నిల్వ చేశారు. కట్టకు మరమ్మతుల కోసం సర్కారు నిధులు మంజూరు చేసింది. ఇక తుంగభద్ర రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 105.79 టీఎంసీలు కాగా.. ఈ రిజర్వాయర్ గేట్లు సురక్షితంగా లేవని గుర్తించి, 79.53 టీఎంసీల నిల్వ మాత్రమే చేశారు.

3 వేల మిలియన్ యూనిట్లకు చేరువలో జల విద్యుత్తు ఉత్పత్తి

ఈ సీజన్‌లో ప్రాజెక్టులకు భారీగా వరద చేరడంతో జల విద్యుదుత్పత్తి ఆశాజనకంగా జరిగింది. గురువారం వరకు 2903 మిలియన్ యూనిట్ల జలవిద్యుదుత్పత్తి చేశారు. అత్యధికంగా శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్కేంద్రంలో 1199 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగా.. నాగార్జునసాగర్‌లో 946, జూరాలలో 285, లోయర్ జూరాలలో 312, సాగర్ ఎడమ కాల్వపై 32, పులిచింతలలో 100, శ్రీరాంసాగర్‌లో 19.55 మి.యూ. విద్యుత్తు ఉత్పత్తి అయింది. సగటున రోజూ 49 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి అవుతోంది.

నేడే గణేష్ మహా నిమజ్జనం

హైదరాబాద్‌లో 20 నిమజ్జన కేంద్రాలు.. అదనంగా 74 కృత్రిమ కొలనులు కూడా

- 1.30లోపు గంగఒడికి ఖైరతాబాద్ గణపతి
- నేడు అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు
- ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలతో రాష్ట్రానికి పేరు: రేవంత్ రెడ్డి
- మహాగణపతికి సీఎం పూజలు





ఖైరతాబాద్ మహా గణపతికి హారతి ఇస్తున్న రేవంత్
నిమజ్జనానికి సిద్ధమైన శ్రీ విశ్వ శాంతి మహా గణపతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొజ్జగణపయ్య గంగమ్మ ఒడికి చేరే సమయం వచ్చేసింది. నగరంలో గల్లీ గల్లీన వెలిసి.. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణపయ్య "మహా నిమజ్జనం" కోసం శోభయాత్రగా బయలుదేరేందుకు సిద్ధమయ్యాడు. శనివారం జరిగే ఈ వేడుకకు ప్రభుత్వ విభాగాలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, సఫిల్‌గూడ, ఐడీఎల్ తదితర 20 ప్రధాన నిమజ్జన కేంద్రాలు, మరో 74 కృత్రిమ కొలనుల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిమజ్జనం కోసం 134 స్టాటిక్, 259 మొబైల్ క్రేన్లను జీహెచ్ఎంసీ సిద్ధం చేసింది. హుస్సేన్‌సాగర్ వద్ద ఖైరతాబాద్ విశ్వమహాగణపతి నిమజ్జనం మధ్యాహ్నం 1.30 గంటల్లోపు పూర్తి చేయనున్నారు. ఇందుకు ఉదయం 6.30కే మహా గణపతి శోభాయాత్ర మొదలుపెట్టాలని నిర్ణయించారు. బాలాపూర్ గణపతి సాయంత్రం 5 గంటల్లోపు ట్యాంక్‌బండ్‌కు చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హుస్సేన్‌సాగర్‌కు వచ్చే భక్తుల సౌకర్యార్థం శనివారం ఆర్టీసీ 600 ప్రత్యేక బస్సులను నడపనుంది. శోభాయాత్ర మార్గాల్లో 35 లక్షల మంచినీటి ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు 160 గణేశ్ యాక్షన్ బృందాలు, 14,486 పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉంటారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా 104 ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచారు. 101 ప్రత్యేక బృందాలతోపాటు విద్యుత్తు శాఖకు చెందిన 2 వేల మంది విధుల్లో ఉంటారు. 30వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అశ్వదళం, జాగిలాలతో గస్తీ నిర్వహించనున్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద బోట్లు, 200 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. నిమజ్జనం సందర్భంగా అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు నడుపుతామని అధికారులు ప్రకటించారు.

మతసామరస్యానికి హైదరాబాద్ ప్రతీక

ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు తెలంగాణకు మంచి పేరు తెచ్చి పెట్టాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఖైరతాబాద్ శ్రీవిశ్వశాంతి మహా గణపతిని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఆ విఘ్నేశ్వరుడి కృప ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులనుద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 71 ఏళ్ల క్రితం ఒక్క అడుగుతో గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ఈ రోజు 69 అడుగుల ఎత్తుకు ఎదిగిందని, 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా దేశంలోనే ఈ గణేష్ ఉత్సవాలను చర్చించుకునే విధంగా జరుపుతున్నారంటూ నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్‌లో 1.4 లక్షల విగ్రహాలను ప్రతిష్ఠించుకొని అత్యంత వైభవంగా ఉత్సవాలు జరుపుకొంటున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని, కాగా ఖైరతాబాద్ గణనాథుడిని బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచంద్రరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రంలో యూరియా లభ్యత పెరిగింది

- రైతులు ఆందోళన చెందొద్దు : మంత్రి తుమ్మల
- రైతు వేదికల వద్ద అదనపు కౌంటర్ల ఏర్పాటుకు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా లభ్యత పెరిగిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గడిచిన నాలుగు రోజుల్లో రాష్ట్రానికి 28 వేల టన్నుల యూరియా వచ్చిందని, ఈ లెక్కన వచ్చే 20 రోజుల పాటు రోజుకు 10 వేల టన్నుల చొప్పున 2 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. శుక్రవారం 11,181 టన్నుల యూరియా రాష్ట్రానికి చేరిందని, శనివారం మరో 9,039 టన్నులు వస్తుందని చెప్పారు. సచివాలయంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల శుక్రవారం సమీక్ష నిర్వహించారు. యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో రైతువేదికల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూరియా దిగుమతి కాకపోవటం, ఆర్ఎఫ్‌సీఎల్ మూతపడటంతో అదనంగా 30 వేల టన్నులు రాష్ట్రానికి కేటాయించటానికి కేంద్రం అంగీకరించినట్లు తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8,20,112 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, గత సంవత్సరం ఇదే సమయానికి 7,75,157 టన్నుల అమ్మకాలు మాత్రమే జరిగాయని తెలిపారు.

బయ్యారంలో బస్తాపై రూ.200 అదనంగా వసూలు

బయ్యారం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిలా బయ్యారం మండలంలోని రెండు ఫర్టిలైజర్ దుకాణాలకు 400 బస్తాల యూరియా దిగుమతి అయింది. ఆ దుకాణాల వ్యాపారులు టోకెన్ పద్ధతిలో గురువారం సాయంత్రం వరకు ఒక్కో బస్తాను రూ.300కు విక్రయించారు. అయితే, రాత్రికి ఆ ధరను రూ.500కు పెంచినట్లు రైతులు ఆరోపించారు. ధర పెంచడంపై ప్రశ్నించగా పంపిణీ నిలిపివేసినట్లు తెలిసింది. తమ దుకాణాల వద్ద పురుగు మందులు కొనుగోలు చేసిన ఖాతాదారులకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి యూరియా సరఫరా చేశారని రైతులు మండిపడుతున్నారు.

చోరీ సొత్తు ఆలయంలో ప్రత్యక్షం

- అమ్మవారికి క్షమాపణ కోరుతూ దొంగల లేఖ



సొమ్ము లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో హుండీ చోరీలు జరగడం చూస్తుంటాం. కానీ చోరీ చేసిన సొత్తును తిరిగి ఆలయంలోనే వదిలిపెట్టిన ఘటనలు ఎక్కడా చూసి ఉండం! కానీ.. ఏపీలోని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మునలమ్మ కట్ట ఆలయంలో జూలై 21న చోరీ చేసిన హుండీ సొమ్మును దొంగలు 45రోజుల తర్వాత అక్కడే పడేసి వెళ్లారు. డబ్బు మూటతోపాటు అమ్మవారిని క్షమాపణ కోరుతూ ఓ లేఖను రాసిపెట్టారు. పూజారి రాఘవయ్య శుక్రవారం తెల్లవారు జామున ఆలయం తలుపులు తెరిచాక ఈ డబ్బుమూటను గుర్తించారు. పోలీసుల సమక్షంలో సొమ్మును లెక్కించారు. ఆ మూటలో రూ.1,86,400 ఉన్నట్లు గుర్తించారు. లేఖలో.. 'క్షమించు తల్లీ.. నలుగురం కలిసి దొంగతనం చేశాం. అప్పటి నుంచి నా కొడుకు ఆరోగ్యం బాగాలేదు. పరిస్థితి విషమంగా ఉంది. దొంగతనం చేసిన సొమ్ములో కొంత ఆస్పత్రి ఖర్చులకు వాడుకున్నాం..' అని వచ్చీ రాని తెలుగులో రాసిన ఓ లేఖను మూటలో ఉంచారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. దీంతో ప్రహరీ బయటి నుంచి ఆలయం లోపలికి డబ్బు మూటను విసిరేశారు. గురువారం అర్ధరాత్రి, లేదా శుక్రవారం తెల్లవారు జామున విసిరేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

కొందుర్గు గురుకుల పాఠశాలలో ర్యాగింగ్!

- నోట్లో పేపర్ కుక్కి.. శరీరానికి గాట్లు

కొందుర్గు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొందుర్గు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిపై కొందరు సహచర విద్యార్థులు గురువారం రాత్రి దాడికి పాల్పడ్డారు. తాము చెప్పినట్లు వినకపోతే బాగుండదని బెదిరింపులకు దిగారని విద్యార్థి తెలిపాడు. అందుకు నిరాకరించడంతో.. హాస్టల్ గదిలో కరెంట్ బంద్ చేసి, నోట్లో పేపరు ముక్కలు కుక్కి. ఒంటిపై గాట్లు పెట్టినట్లు వాపోయాడు. మర్నాడు తనపై జరిగిన దాడిని ప్రిన్సిపాల్ కుర్షీద్‌కు వివరించాడు. కాగా, ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జెన్కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు సహా.. 8 మంది అధికారులకు లోకాయుక్త నోటీసు

- కేటీపీపీ పరిహారం విషయంలో నిర్వాసితుల ఫిర్యాదు

భూపాలపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ) భూసేకరణలో అవకతవకలు జరిగాయని నిర్వాసితులు చేసిన ఫిర్యాదుపై లోకాయుక్త స్పందించింది. ఈ విషయంపై బాధితులు ఆగస్టు 4న లోకాయుక్తను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసిన సంస్థ.. వివరణ ఇవ్వాలని సెప్టెంబరు 1న అధికారులకు నోటీసు జారీ చేసింది. ఇందులో జెన్కో మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, ప్రస్తుత కలెక్టర్ రాహుల్ శర్మ, జెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.అజయ్, మాజీ చీఫ్ ఇంజనీర్ సిద్ధయ్య, ప్రస్తుత చీఫ్ ఇంజనీర్ ప్రకాశ్, భూపాలపల్లి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అప్పటి ఆర్డీవోలు శ్రీనివాస్, మాధవి ఉన్నారు. భూపాలపల్లి సమీపంలోని చెల్పూర్ రెవెన్యూలో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ నిర్మాణం కోసం 2019లో సర్కారు నోటిఫికేషన్ జారీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు.. ఆ తర్వాత తమకు చెప్పకుండానే 2017 తెలంగాణ భూసేకరణ చట్టాన్ని అనుసరించి స్థలాల సేకరణకు అంగీకరిస్తున్నట్లు తమ నుంచి సంతకాలు తీసుకున్నారని దుబ్బపల్లి గ్రామస్థులు చెబుతున్నారు. ప్రాథమిక ప్రకటనలో ఇచ్చిన బాధితుల పేర్లను డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ప్రకటించినప్పటికీ.. అవార్డుల జారీలో చాలామంది పేర్లను తొలగించారని అంటున్నారు. 2017 చట్టం ప్రకారం ప్రకటించిన అవార్డులో పునరావాసానికి సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో బాధితులు అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. పరిహారం విషయంలోనూ సంప్రదింపుల సందర్భంగా నిర్ణయించిన మొత్తాన్ని కాకుండా అవార్డు తగ్గించి ప్రకటించడం పట్ల మండిపడుతున్నారు. ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ జాబితాలో మైనర్లను చేర్చాల్సి ఉన్నా.. వారి ప్రస్తావనే లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

నిమజ్జనానికి వెళ్లివస్తుండగా రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి



సాయితేజ, మండ్ల శంకర్

పెబ్బేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఇంటికి తిరిగివస్తున్న ఇద్దరు యువకులను డీసీఎం వాహనం రూపంలో వచ్చిన మృత్యువు బలిగొంది. ఈ సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరులో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా నాచహళ్లి గ్రామానికి చెందిన 11 మంది యువకులు జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి పుణ్య క్షేత్రం దగ్గర కృష్ణానదిలో వినాయకుడిని నిమజ్జనం చేశారు. అనంతరం ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామ సమీపంలో హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం వాహనం వెనక వైపు నుంచి ట్రాక్టర్‌ను అతివేగంతో ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టరులో ఉన్న డ్రైవర్‌తో పాటు నలుగురు కిందపడగా.. ట్రాక్టర్ జాతీయ రహదారిపై దాదాపు అర కిలోమీటరు వరకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంజన్ పక్కన కూర్చున్న మండ్ల శంకర్(21), గుప్త సాయితేజ(23) అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి.

కన్నతల్లి కడచూపూ కరువాయె!

- ముగ్గురు పిల్లల మృతదేహాలను చూసేందుకు రాని దీపిక
- అంత్యక్రియలు నిర్వహించిన మునిసిపాలిటీ

నాగర్‌కర్నూలు/త్రిపురాంతకం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కన్నతండ్రిది రాతిగుండె అని తేలిపోతే, తానూ నిర్దయురాలినేనని కన్నతల్లీ చాటుకుంది. భార్యతో గొడవపడిన భర్త, అభంశుభం తెలియని పదేళ్లలోపు వయసున్న ముగ్గురు పిల్లల ప్రాణాలను బలిగొంటే.. ఆ భార్యేమో తన పిల్లలను కడసారి చూసేందుకు కూడా రాలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఎర్రగొండుపాలెం మండలం పెద్దబోయినిపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు, దీపిక దంపతులు. వీరికి మోక్షిత (8), వర్షిణి (6), శివధర్మ (4) సంతానం. భార్యతో గొడవ పడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకొని నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండకొచ్చాడు. అక్కడ పిల్లలతో పురుగుల మందు తాగించి.. వారి ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించి చంపాడు. తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వరు మృతదేహం బుధవారమే లభ్యమైంది. అంత్యక్రియలు పూర్తయ్యాయి. వర్షిణి, శివధర్మ మృతదేహాలను శుక్రవారం అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారుల బాబాయి మల్లికార్జున, తండ్రి తరఫు బంధువులు అక్కడికొచ్చి మృతదేహాలను మునిసిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. వారు పట్టణంలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. మోక్షిత మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ మృతురాలి చిన్నాన్న మల్లికార్జున, బంధువులు తాము మృతదేహాన్ని సొంతూరుకు తీసుకెళ్లలేమని చెప్పడంతో సిబ్బంది స్థానిక స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వెంకటేశ్వర్లు.. తాను చనిపోతే, పిల్లలు ఇబ్బందులు పడతారని భావించే వారిని చంపేసి ఉంటాడని చర్చించుకుంటున్నారు.

డయాలసిస్‌కు వెళితే హెచ్ఐవీ!

ఏడు నెలల చికిత్స అనంతరం ఓ వృద్ధుడిలో గుర్తింపు

- మణుగూరు డయాలసిస్ కేంద్రంలో ఘటన

మణుగూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల్లో సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్న ఓ రోగికి ఏడు నెలల చికిత్స అనంతరం హెచ్ఐవీ పాజటివ్ అని తేలింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని డయాలసిస్ కేంద్రంలో ఈ ఘటన వెలుగు చూసింది. డయాలసిస్ కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే తాను హెచ్ఐవీ బారిన పడ్డానంటూ లబోదిబోమంటున్న ఆ రోగి శుక్రవారం మణుగూరు డయాలసిస్ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన గిరిజన వృద్ధుడు(60) 2024లో కిడ్నీ సంబంధ సమస్యల బారిన పడ్డాడు. డయాలసిస్ చేయించుకునేందుకు ఈ ఏడాది జనవరిలో మణుగూరు ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి వచ్చాడు. డయాలసిస్‌కు ముందు చేసిన రక్తపరీక్షల ద్వారా సదరు రోగి రక్తహీనతతో బాధపడుతున్నట్టు గుర్తించారు. దీంతో భద్రాచలం బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం తెప్పించి జనవరి 15న తొలిసారి ఎక్కించారు. అప్పట్నించి ఆగస్టు 15 వరకు ప్రతి నెలా వారానికి మూడుసార్లు ఆ వృద్ధుడికి డయాలసిస్ చేశారు. అయితే, ఆగస్టు 15న చేసిన రక్త పరీక్షల్లో ఆ వృద్ధుడికి హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. ఈ విషయాన్ని రోగి, అతడి కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు ఓ ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్‌లో పరీక్షలు చేయించగా అదే ఫలితం వచ్చింది. హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలడంతో మణుగూరు డయాలసిస్ కేంద్రంలో ఆ వృద్ధుడికి సేవలు ఆపేశారు. భద్రాచలంలోని హెచ్ఐవీ కేంద్రం ద్వారా మందులు అందిస్తున్నారు. హెచ్ఐవీ బాధితులకు ప్రత్యేకంగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందిస్తారు. దాంతో బాధిత వృద్ధుడు ఇటీవల హైదరాబాద్ వచ్చి డయాలసిస్ చేయించుకున్నాడు. అయితే, తన బంధువులతో కలిసి శుక్రవారం మణుగూరు డయాలసిస్ కేంద్రానికి వచ్చిన బాధిత వృద్ధుడు కేంద్రం నిర్వాహకులను నిలదీశాడు. జనవరి వరకు తనకు కిడ్నీ సమస్య మాత్రమే ఉందని హఠాత్తుగా హెచ్ఐవీ ఎలా వచ్చిందో చెప్పాలని పట్టుబట్టాడు. కాగా, ఈ అంశంపై మణుగూరు డయాలసిస్ సెంటర్ నిర్వాహకుడు సంతోష్ రెడ్డిని వివరణ కోరగా సదరు రోగి మణుగూరు ఆస్పత్రికి రాక ముందు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడని, అక్కడెక్కడైనా పొరపాటు జరిగి ఉండవచ్చన్నారు.

భద్రాచలంలో ప్రేమజంట ఆత్మహత్య

- మైనర్‌తో ముగ్గురు పిల్లల తండ్రి ప్రేమాయణం
- మృతుడిది ఏపీ.. బాలిక భద్రాద్రి జిల్లా వాసి

భద్రాచలం/కుక్కునూరు,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్యా ముగ్గురు పిల్లలున్నా.. సభ్యత మరిచి దూరపు బంధువైన మైనర్‌తో ప్రేమాయణం నడిపిన యువకుడు.. ఇరు కుటుంబాలు ఆగ్రహించడంతో ఆ బాలికతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శుక్రవారం జరిగింది. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరావిపాడు వాసి నడిపింటి రవి(34) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)తో ప్రేమలో పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు వారించినా వినకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఫిబ్రవరి 5న అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రవిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. బెయిల్‌పై వచ్చాక కూడా ప్రవర్తన మార్చుకోకపోవడంతో వారి తీరుపై ఇరు కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో మనస్తాపానికి గురైన రవి, బాలికతో కలిసి 2 రోజుల క్రితం భద్రాచలం వచ్చి.. కరకట్ట సమీపంలోని ప్రైవేటు లాడ్జిలో దిగాడు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆ గదిలో నుంచి వస్తువులు పడిన శబ్దాలు రావడంతో లాడ్జి సిబ్బంది తలుపులు తెరిచి వారిద్దరినీ భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికెళ్లేలోపు రవి మృతి చెందగా, బాలిక చికిత్స పొందుతూ మరణించింది. మనస్తాపంతోనే ఆ బాలికతో కలిసి రవి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

న్యాయం దక్కేనా?

దేశరాజధానిలో ఐదేళ్ళనాటి అల్లర్లకేసులో నిందితులుగా ఉన్న ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ ఇత్యాదులకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలు హింసాత్మకంగా మారి, యాభైమందికి పైగా మరణించిన ఘటన విస్మరించలేనిది. వీరిలో అధికులు ముస్లింలేనన్న విషయాన్ని అటుంచితే, ఈ అల్లర్లకు బాధ్యులుగా, కుట్రదారులుగా 15మంది మీద చట్టవ్యతిరేక కార్యకలాపాలచట్టం (ఊపా) కింద కేసు నమోదైంది. ఖలీద్, షర్జీల్ బెయిల్ పిటిషన్లు మూడేళ్ళనుంచీ పెండింగ్‌లో ఉండగా, తాజావిచారణలో ధర్మాసనం వాటిని తోసిపుచ్చింది. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిమీద ఏ మాత్రం జాలిపడనక్కరలేదంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్య సముచితమైనది. కుట్రలు చేసినవారిని వదిలిపెట్టమని ఎవరూ అనరు. వారిని శిక్షించవలసిందే. అయితే, ప్రభుత్వమూ, శక్తిమంతమైన దాని యంత్రాంగమూ, దాని న్యాయవాదులు, చివరకు న్యాయమూర్తులు ఏకరీతిగా, ఏకమాటగా నిందితులందరూ సంఘవిద్రోహ శక్తులని అంతగట్టిగా నమ్ముతున్నా కూడా ఆ నిరూపణ ప్రక్రియ ఇప్పటి వరకూ ఆరంభం కాకపోవడం మరింత ఆశ్చర్యపరుస్తోంది. బెయిల్ పొందడానికి కూడా అనర్హులనీ, నిర్దోషులుగా తేలేవరకూ జైల్లో మగ్గడమే సరైనదంటూ అంత ఆగ్రహంగా ఊగిపోతున్న సొలిసిటర్ జనరల్ ఈ నిందితులందరినీ దోషులుగా నిరూపించేందుకు ఇంతవరకూ ఎందుకు ప్రయత్నించలేదో తెలియదు. ఐదేళ్ళుగా విచారణ జరపకుండా, బెయిల్ మంజూరు చేయకుండా నేరనిర్ధారణకు ముందే వారంతా శిక్షలు అనుభవించేట్టుగా చేయడం సామాన్యులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

ఇక సర్వోన్నత న్యాయస్థానమే దిక్కు అంటున్నారు ఉమర్ జీవిత భాగస్వామి బనోజ్యోత్స్న లాహిరి. విచారణ మొదలు కాకుండా ఐదేళ్లపాటు జైల్లో ఉంచడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించి బెయిల్ ఇస్తుందని ఆమె ఆశించారు. బెయిల్‌కు అర్హతగా ఈ ఐదేళ్ళ అనధికారిక జైలుశిక్ష చాలదా? అంటున్నారామె. దిగువ కోర్టులు బెయిల్ ఇవ్వకపోవడం సరే, సర్వోన్నత న్యాయస్థానంలోనే గతంలో బెయిల్ పిటిషన్ రికార్డుస్థాయిలో వాయిదా పడింది. దాదాపు ఏడాదిన్నర జైలు జీవితం తరువాత, కర్కడుమా కోర్టు 2022 మార్చిలో తొలిసారిగా బెయిల్ నిరాకరించాక, అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టు కూడా కాదన్నాక, ఉమర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయవాదుల గైర్హాజరు, ప్రాసిక్యూషన్ అభ్యర్థన మేరకు వాయిదా, సమయం లేకపోవడం, సీనియర్ న్యాయవాదులు అందుబాటులోకి రాకపోవడం ఇత్యాది కారణాలతో ఒకే ఏడాదిలో పదిహేనుసార్లు ఉమర్ బెయిల్ పిటిషన్ పరిశీలనకు దూరంగా ఉండిపోయిన చరిత్ర ఉంది. చివరకు, గత ఏడాది ఫిబ్రవరిలో ఆయన దానిని ఉపసంహరించుకొని, ఇతరత్రా వాదనలతో, కారణాలతో మళ్ళీ దిగువస్థాయి నుంచి పోరాటం మొదలుపెట్టాడు.

బెయిల్ నియమం, జైలు మినహాయింపు అనే సూత్రం ఊపా వంటి కరుడుగట్టిన చట్టాలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసి, తదనుగుణంగా నిందితులకు బెయిల్ కూడా ఇచ్చి ఉన్నతంగా వ్యవహరించింది. నేర స్వభావంతో నిమిత్తం లేకుండా నిందితుడి బెయిల్ హక్కును కాపాడవలసిందేనని కూడా వ్యాఖ్యానించింది. సమీపకాలంలో విచారణ పూర్తికాబోదన్న సత్యం తెలిసికూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నవారి విషయంలో న్యాయస్థానాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఎలా వ్యవహరించగలుగుతున్నాయో తెలియదు.

ఉమర్‌ఖలీద్ అరెస్టులో రాజకీయకుట్ర ఉందని ఆయన అభిమానులు, న్యాయవాదులు అంటారు. ఆయన శాంతియుతంగానే నిరసనలు వ్యక్తం చేశాడని, పౌరసత్వ చట్టానికే కాదు, పాలకులు భవిష్యత్తులో చేపట్టబోయే ఏకపక్ష, మైనారిటీవ్యతిరేక నిర్ణయాలపై ఎవరి గొంతూ లేవకుండా చేయడానికే ఈశాన్యఢిల్లీ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా విరుచుకుపడిందని వారి వాదన. ఇక, జేఎన్‌యూ విద్యార్థిసంఘం నాయకుడుగా ఉన్నప్పటి నుంచీ ఆయనమీద పాలకులు కక్షకట్టారని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. సీఏఏ, ఎన్ఆర్సీ, ట్రిపుల్ తలాఖ్, కశ్మీర్ ఇత్యాది అంశాల్లో ఉమర్, ఆయన మిత్రబృందం తీవ్రమైన భాషతో ప్రభుత్వాన్ని నిలదీసిన మాట నిజం. ఘాటైన ప్రసంగాలు చేసినంతమాత్రాన దేశద్రోహులు అయిపోరు. ఉమర్ ఖలీద్ దీర్ఘకాల అక్రమ నిర్బంధం ద్వారా ప్రశ్నించడం దేశద్రోహం, విమర్శించడం విప్లవం, నిరసించడం నేరం అని ప్రజలను అదుపాజ్ఞల్లో ఉంచడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో నిందితులందరికీ బెయిల్ ఇవ్వడంతో పాటు, నిర్దిష్టకాలపరిమితిలోగా విచారణ ముగిసేట్టుగా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకోవాలి.

వాణిజ్య మైత్రితో సరిహద్దు వైరం తీరేనా?

ఇద్దరు వ్యక్తులు నాట్యం చేయడానికి సిద్ధమవుతున్నారు. సంగీతం అస్ఫుటంగా వినిపిస్తోంది. గాయకుడు ఎవరైందీ ఇంకా కనిపించడం లేదు. అయితే ఆ గాయకుడు భారత ప్రధానమంత్రి మాత్రం కాదు. ఇది స్పష్టాతి స్పష్టం. మహాబలిపురంలో చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్‌తో కలిసి ఊయల ఊగిన రోజుల నుంచి నరేంద్ర మోదీ చాలా దూరం వచ్చారు. జూన్ 15, 2020న గల్వాన్ లోయలో చైనా, భారత్ సైనిక దళాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు మరణించారు. ఆ ఘటన నాలుగురోజుల అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశంలో 'బయటివారెవ్వరూ భారత భూ భాగాల్లోకి చొరబడలేదు, ఏ బయటి వ్యక్తీ భారత భూభాగంలో లేడు' అని మోదీ గంభీరంగా ఉద్ఘాటించారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే కొద్ది వారాలలోనే రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి మోదీ మాటకు విరుద్ధమైన ప్రకటనలు చేశారు. సైనికాధికారుల స్థాయి చర్చల్లో సరిహద్దుల్లో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు భారత్ త్రివిధ చర్యలను ప్రతిపాదించింది. అవి: ఉపసంహరణ, ఉద్రిక్తతల సడలింపు, నిస్సైనికీకరణ. భారత్‌తో చర్చలలో చైనా పాల్గొన్నది. తన సైనిక దళాలను వెనక్కి తీసుకువెళ్లింది. అయితే ఉద్రిక్తతల సడలింపునకు, నిస్సైనికీకరణకు నిరాకరించింది. గల్వాన్ సరిహద్దు ప్రాంతంలో చైనా సైనిక దళాలను పెద్ద ఎత్తున సమీకరిస్తున్నట్టు, సైనిక శకటాలను మోహరిస్తున్నట్టు, 5జి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్టు, కొత్త రహదారులు నిర్మించినట్టు, తన సైనిక దళాలకు కొత్త ఆవాసాలను నిర్మిస్తున్నట్టు ఉపగ్రహాలు తీసిన ఛాయా చిత్రాలు స్పష్టం చేశాయి. భారత్, చైనాల మధ్య ఘర్షణలకు గల్వాన్ ఒక్కటే కేంద్రం కాదు. డెప్సాంగ్, డెమ్‌చోక్ వివాదాలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాస్తవాధీనరేఖకు ఈవల వైపు భారత్‌లో ఉన్న ఈ కీలక ప్రదేశాలలో చైనా సైనిక దళాలు తిష్ఠ వేసి ఉన్నాయి. డిసెంబర్ 2024లో కూడా 'ఉభయ దేశాల మధ్య సంబంధాలు 2020 నుంచి మామూలుగా లేవని' భారత విదేశాంగ మంత్రి చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య నాలుగురోజుల యుద్ధం జరిగినప్పుడు భారత్‌ను దెబ్బతీసేందుకు చైనా పరోక్షంగా ప్రయత్నించింది.

చైనాతో అన్ని రంగాలలో సంబంధాలను తెంచుకునే విషయమై భారత్ మాట్లాడింది కానీ అది ఆచరణలో అంత తేలిక కాదని రుజువయింది. చైనాతో భారత్ వస్తూత్పత్తుల వాణిజ్య లోటు ఏటా పెరుగుతూనే ఉంది. 2024–25లో ఈ వాణిజ్యలోటు 10,000 కోట్ల డాలర్లుగా ఉన్నది. పలు కీలక వస్తువుల విషయంలో భారత్ పూర్తిగా చైనాపై ఆధారపడి ఉన్నది. భారత్‌లో రిజిస్టర్ అయిన చైనా కంపెనీలు 174 కాగా 3,560 భారతీయ కంపెనీల మేనేజ్‌మెంట్ బోర్డులలో చైనీస్ డైరెక్టర్లు ఉన్నారు. భారత్–పాకిస్థాన్ యుద్ధం తరువాత టిక్‌టాక్ తదితర చైనీస్ మొబైల్ యాప్స్‌ను భారత్ నిషేధించింది. భారత్‌లో చైనా పెట్టుబడులపై ఆంక్షలు విధించింది.



షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా నరేంద్ర మోదీ, క్సీ జిన్‌పింగ్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశం చరిత్రాత్మకమైనది. ఉభయ దేశాల మధ్య సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడానికి పెద్దగా ఉపయోగపడకపోయినా వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో తీవ్రమైన విభేదాలు, వ్యత్యాసాలను తొలగించుకునేందుకు అది తోడ్పడే అవకాశమున్నది. ఇదే సంభవిస్తే భారత్–చైనా సంబంధాలు మేలు మలుపు తిరుగుతాయి.

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ)కు క్సీ జిన్‌పింగ్ మొదటి నుంచీ చాలా ప్రాధాన్యమిస్తున్నారు. 2019, 2022, 2024 ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా జిన్‌పింగ్, మోదీల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ దృష్ట్యా టియాంజిన్ సదస్సు సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశం చరిత్రాత్మకమైనది. సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడంలో అవరోధాలను అధిగమించేందుకు అది పెద్దగా ఉపయోగపడదు. అయితే ఇటీవలి కాలంలో వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో తీవ్రమైన విభేదాలు, వ్యత్యాసాలను తొలగించుకునేందుకు గణనీయంగా తోడ్పడే అవకాశమున్నది. ఇదే సంభవిస్తే ఉభయ దేశాల మధ్య సంబంధాలు మేలుమలుపు తిరుగుతాయి.

భారత్, చైనా రెండూ తమ పాత వైఖరులను విడనాడి స్నేహపూరిత సంబంధాలను పెంపొందించుకోవాలని నిర్ణయించుకోవడానికి దారితీసిన పరిస్థితులు, కారణాలను మనం జాగ్రత్తగా విశ్లేషించాలి. డోనాల్డ్ ట్రంప్‌తో స్నేహానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. అయినప్పటికీ ట్రంప్ మోదీ స్నేహాన్ని తృణీకరించారు. ఫలితంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలలో న్యూఢిల్లీకి చేదు అనుభవాలే మిగిలాయి. సుసంబంధ, పరస్పర ప్రయోజనకర ఆర్థిక సంబంధాల కంటే వ్యక్తిగత వ్యాపార లబ్ధికి, సంకుచిత రాజకీయ లక్ష్యాలకు ప్రాధాన్యమిచ్చే లావాదేవీల అధ్యక్షుడి నుంచి భారత ప్రభుత్వం ఒక క్రూర పాఠాన్ని నేర్చుకున్నది. మరే దేశంపై విధించని విధంగా భారత్‌పై ట్రంప్ అత్యధిక సుంకాలు విధించారు.

దీంతో చైనాతో సంబంధాలు మెరుగుపరచుకోవడం ద్వారా అమెరికా సృష్టించిన ఇబ్బందికరమైన పరిస్థితుల నుంచి బయటపడేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. చైనా తన వాణిజ్యాభివృద్ధికి, పెట్టుబడులను ఇతోధికంగా విస్తరింపచేసుకునేందుకు ఆరాటపడుతోంది. అందుకు అవసరమైన అవకాశాలు ప్రపంచ అతిపెద్ద మార్కెట్ అయిన భారత్‌లో ఉన్నాయనే వాస్తవాన్ని చైనా గుర్తించింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో తన ప్రభావాన్ని విస్తరింపచేసుకోవడం కూడా భారత్ లక్ష్యంగా ఉన్నది. ఈ కారణాల వల్ల నిన్నటిదాకా తన శత్రువుగా ఉన్న చైనాను తనకు అనుకూలం చేసుకునేందుకు పూనుకున్నది. అయితే వాస్తవాలను నిశితంగా పరిశీలిస్తే భారత్–చైనా సరిహద్దు ప్రాంతాలపై తన వాదనలను విడనాడడానికి గానీ, తాను ఉత్పత్తి చేసే సైనిక సామగ్రిని భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్న పాకిస్థాన్ ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడానికి గానీ బీజింగ్ అంగీకరించదని స్పష్టమవుతున్నది. టియాంజిన్‌లో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం, ఉగ్రవాదం నిర్మూలన అంశాలకు మోదీ అమిత ప్రాధాన్యమిచ్చారు. అయితే క్సీ జిన్‌పింగ్ చాలా తెలివిగా ఆ అంశాలకు ప్రాధాన్యమివ్వకుండా వ్యవహరించారు.

ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ ప్రయోజనాలకు అనుకూలంగా మోదీ స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో లేరు. భారత్ ఎగుమతుల ప్రధాన గమ్యమైన అమెరికా, భారత్ భారీ దిగుమతులకు మూలదేశమైన చైనా మధ్య చిక్కుకున్నారు. క్వాడ్, ఎస్‌సీఓ/ఆర్‌ఐసీలలో దేనికి అగ్ర ప్రాధాన్యమివ్వాలనే విషయంలో కూడా ఆయనకు అన్నీ చిక్కులే. ట్రంప్ మాదిరిగా మోదీ కూడా తన రాజకీయ సహజాతాలు తిరుగులేని రీతిలో సక్రమమైనవని విశ్వసిస్తారు. ఆయన వైయక్తిక దౌత్యశైలికి ప్రధాన కారణం ఆ ప్రగాఢ విశ్వాసమే. ఇప్పటికే ఎన్నో వైఫల్యాలు ఎదురయ్యాయి. భారత్ ప్రయోజనాలు దెబ్బతింటున్నందున నరేంద్ర మోదీ తన వైయక్తిక దోస్తీ దౌత్యాన్ని విడనాడి, విదేశాంగ శాఖ అధికారులు, అనుభవజ్ఞులైన దౌత్యవేత్తల సలహా, సూచనల ప్రకారం వ్యవహరించాలి. అప్పుడు మాత్రమే భారత్ ప్రయోజనాలకు విశేషంగా దోహదం చేకూరుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తొలి ప్రభాతంలో ఆధునిక నేపాల్

మధ్య తరగతి, ఆంగ్ల భాషా ప్రావీణ్య, వృత్తి నిపుణుల కుటుంబాల నేపథ్యమున్న భారతీయులు తమ మాతృభూమేతర దేశాల గురించి తెలుసుకోదలిచినప్పుడు సర్వసాధారణంగా వారి ఆసక్తి పాశ్చాత్య దేశాల పైనే ఉంటుంది. సహజంగానే అమెరికా, ఇంగ్లాండ్‌లను వారు ఎక్కువగా ఇష్టపడతారు. అలాగే ఫ్రాన్స్, ఇటలీ కూడా భారతీయుల శ్రద్ధకు నోచుకుంటాయి.


పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే నేను ఆ పాశ్చాత్య దేశాల గురించి చాలా తెలుసుకున్నాను. అదృష్టవశాత్తు నేను పెరిగిన పరిసరాలు నాకు సమీపంలో ఉన్న ఇతర దేశాలపై శ్రద్ధాసక్తులను జనింపచేశాయి. నేను తొలుత ప్రస్తావించిన నేపథ్యం నుంచి వచ్చిన భారతీయులు సాధారణంగా ఈ సమీప దేశాల పట్ల ఉదాసీనవైఖరి చూపడం కద్దు. ఉత్తరాఖండ్‌లోని ఇతర ప్రాంతాలతో పాటు నా స్వస్థలం డెహ్రాడూన్ కూడా 18వ శతాబ్ది తుదినాళ్లలో నేపాల్ గూర్ఖా రాజ్యం అధీనంలోకి వెళ్లాయి. గూర్ఖాల నుంచి ఉత్తరాఖండ్ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ వారి అనేక సైనిక పటాలాలకు డెహ్రాడూన్ ప్రధాన స్థావరంగా ఉండేది. ఆ సైనికులలో అత్యధికులు నేపాలీలు. ఈ కారణంగా డెహ్రాడూన్‌లో ఉన్న సైనిక పటాలాల పేర్లలో 'గూర్ఖా' అనే పదం తప్పనిసరిగా ఉండేది.

నా బాల్యంపై నేపాలీ ప్రభావం విస్తృతమైనది, విస్మరించలేనిది.

నేను చదివిన పాఠశాల, 1950ల్లో తమ స్వదేశం నేపాల్ నుంచి పరారై వచ్చిన కులీన రాణాలు స్థాపించింది. మా ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే మార్గం పొడుగునా నేపాలీ భాషీయుల ఆవాసాలు ఉండేవి. క్రీడలలో నా తొలి ఆరాధ్యుడు నేపాలీ సంతతికి చెందిన ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ ఆటగాడు రామ్ బహదూర్ చెత్రి. ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ ముగిసిన అనంతరం కలకత్తా నుంచి డెహ్రాడూన్‌కు వచ్చి మా బాబాయితో కలిసి ఏర్పాటు చేసిన క్రికెట్ క్లబ్‌ను ఆయనే నిర్వహిస్తుండేవారు. ఈ అనుబంధాల కారణంగా యవ్వనంలోను ఆ తరువాత నేను చాలాసార్లు నేపాల్‌ను సందర్శించాను. నా నేపాలీ స్నేహితులలో ఒకరు ఖాట్మండులో ఒక పత్రికా సంపాదకుడుగా ఉన్నాడు.

ఈ అనుబంధాల కారణంగానే, నేపాల్ చరిత్రపై ఇటీవల ప్రచురితమైన 'Nepal in the Long 1950s' చాలా ఆసక్తితో చదివాను. ప్రత్యూష్ అన్నా, లోక్‌రంజన్ పరజూలి, మార్క్ లైచ్టీ ఈ విశిష్ట గ్రంథ సంపాదకులు. రాణాల పాలన నుంచి నేపాల్ విముక్తమైన అనంతర కాలంలో ఆ హిమాలయ రాజ్యంలో సంభవించిన మార్పులను ఈ పుస్తకంలోని వ్యాసాలు వివరించాయి. 19వ శతాబ్దంలో నేపాల్ రాజకీయాలను శాసించిన రాణాలు స్వతంత్ర ఆలోచనా ధోరణులను, సృజనాత్మక స్వేచ్ఛను పూర్తిగా నియంత్రించారు. రాణాల పాలనా శృంఖలాల నుంచి బయటపడిన తరువాత నేపాల్‌లో చోటుచేసుకున్న సాంస్కృతిక వికాసాన్ని, సామాజిక మార్పులను ఈ పుస్తకం విపులీకరించింది.

ఖాట్మండులోని చరిత్రాత్మక టీ దుకాణం 'తిలౌరి మైలాకో పసల్' గురించి ప్రవాస్ గౌతమ్ రాసిన కథనం ఈ పుస్తకంలోని మొదటి వ్యాసం. తేనేటి సేవనం సంప్రదాయ నేపాలీ సంస్కృతిలో భాగం కాదు. ప్రపంచ యుద్ధాలలో సుదూర దేశాలకు వెళ్లిన గూర్ఖా



నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలను చులకనగా చూడడాన్ని, వాటి పట్ల అహంకారపూరిత వైఖరి ప్రదర్శించడాన్ని మన పాలకపక్ష రాజకీయవేత్తలు విడనాడాలని ఏడాది క్రితం ఇదే కాలమ్‌లో రాసిన వ్యాసంలో నేను వాదించాను. 'Nepal in the Long 1950s' చదివిన తరువాత ఆ వాదనకు ఇలా ముక్తాయింపు ఇవ్వదలిచాను: ఇరుగు పొరుగు దేశాల గురించి మరింత విస్తృతంగా, సమగ్రంగా మనం అధ్యయనం చేయాలి. తద్వారా, ఆర్థిక, విదేశాంగ విధాన ప్రయోజనాలతో సంబంధం లేకుండా భారతదేశమూ, భారతీయులూ విశేషంగా లబ్ధి పొందుతారు.

సైనికులు తమకు అలవాటయిన తేనీటి సేవనాన్ని మాతృభూమికి పరిచయం చేశారు. ప్రస్తావిత టీ షాప్‌కు ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలతో పాటు ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి అభిమానులు నిత్యం వస్తుండేవారు. రాజకీయ పరిణామాల గురించి చర్చించేందుకు, తమ ఉద్యమ కార్యకలాపాలను నిర్ణయించుకునేందుకు ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలు 'తిలౌరి మైలాకో పసల్'కు వచ్చేవారు. ఇక ఫుట్‌బాల్ ఆటగాళ్లు, మ్యాచ్‌కు ముందు, మ్యాచ్ అయిపోయిన తరువాత విధిగా అక్కడకు వస్తుండేవారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌లతో పాటు సినిమాల గురించి వారు మాట్లాడుకునేవారని గౌతమ్ రాశారు (ఖాట్మండులో సినిమా థియేటర్లు 1950ల తొలినాళ్లలో ప్రారంభమయ్యాయి).



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఖాట్మండు లోయలోని ఇతర ప్రదేశాలలో టీషాప్‌ల వలే కాకుండా 'తిలౌరి మైలాకో పసల్' కస్టమర్లలో అన్ని కులాలవారు ఉండేవారు. దుకాణ యజమానులు అయిన సోదరులు ఉదార భావాలు ఉన్న ప్రగతిశీలురు. అది వారికి వ్యాపార లబ్ధిని సమకూర్చింది. అయినప్పటికీ సంప్రదాయ సామాజిక వివక్షలు కొనసాగుతూనే ఉండేవి. అగ్ర కులాల విద్యావంతులు ఆ విశాల టీ షాప్ లోపల రుచికరమైన తేనేటిని సేవిస్తుండగా కింది కులాల శ్రామికులు సాధారణంగా దుకాణం వెలుపలే టీ తాగి వెళ్లిపోతుండేవారు.

1950ల్లో ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యమయిన తరుణంలో నేపాలీల ఆలోచనలను 'బికాస్' లేదా అభివృద్ధి భావన అమితంగా ప్రభావితం చేసిందని బన్దన గ్యావలీ తన వ్యాసంలో పేర్కొన్నారు. పొరుగున ఉన్న భారత్, వలసపాలన నుంచి విముక్తి పొందుతున్న అనేక ఆసియా, ఆఫ్రికన్ దేశాల వలే నేపాల్ కూడా మరిన్ని రహదారులు, మరిన్ని ఫ్యాక్టరీలు, విద్యుదుత్పాదన కేంద్రాలకు, మహానగరాల నిర్మాణానికి ఆరాటపడింది. వాటిని సమకూర్చుకోవడమే 'అభివృద్ధి' అని విశ్వసించింది. పెట్టుబడిదారీ అనుకూల, సామ్యవాద అనుకూల వర్గాలు రెండిటికీ ఇటువంటి దార్శనికతే కలిగి ఉండేవి. కాకపోతే పెట్టుబడిదారీ విధాన అనుకూలురు మార్కెట్ ఆధారంగానే అటువంటి అభివృద్ధి సిద్ధిస్తుందని విశ్వసించేవారు. సామ్యవాద సానుకూలురు కార్మికవర్గ రాజకీయ పక్షం నాయకత్వంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో మాత్రమే సర్వతోముఖ అభివృద్ధి సాధ్యమని వాదిస్తుండేవారు (బన్దన ప్రస్తావించని ఒక విశేషం ఉన్నది. 1950ల్లోను, ఆ తరువాయి దశాబ్దంలోను అటు నేపాల్‌లోను, ఇటు భారత్‌లోను చాలా మంది తల్లిదండ్రులు తమ మగబిడ్డలకు బికాస్ లేదా దాని సంస్కృత రూపమైన వికాస్ అని నామకరణం చేసేవారు).

రాణాల పాలన ముగిసిన అనంతరం నేపాలీల మేధో వికాసం, నవ్య సాహిత్య జాగృతి గురించి ప్రత్యూష్ తన వ్యాసంలో వివరించారు. 'నేపాల్ సాంస్కృతిక్ పరిషద్' గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సంస్థ ప్రచురించే ఒక పత్రికలో నేపాల్ చరిత్ర, సంస్కృతిపై విపుల, పరిశోధనాత్మక వ్యాసాలు వెలువడుతుండేవి. ఆ పత్రిక తొలి సంపాదకీయం ఇలా పేర్కొంది: 'నేపాల్‌లో కొత్త యుగం ఆరంభమయింది. జాతి తన స్వాభిమానాన్ని కాపాడుకునేందుకు, మరింత సమున్నత సంస్కృతిని సృష్టించేందుకు తమ పూర్వీకుల సాంస్కృతిక, సాహిత్య కృషి గురించి తప్పక తెలుసుకోవలిసిన అవసరమున్నది'.

నేపాల్‌లో తొలి ఆధునిక విశ్వవిద్యాలయం సంస్థాపన గురించి లోక్ రంజన్ తన వ్యాసంలో వివరించారు. రాజు త్రిభువన్ పేరిట ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటయింది. 'ఆరంభం నుంచి భారతీయులు, అమెరికన్లకు తమ అధికారాన్ని, ప్రభావాన్ని నెరపేందుకు ఈ విశ్వవిద్యాలయం ఒక నెలవు అయిందని వ్యాస రచయిత వ్యాఖ్యానించాడు. పట్నా విశ్వవిద్యాలయాన్ని ఆదర్శంగా తీసుకుని త్రిభువన్ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరచాలని పలువురు సూచించారు. అయితే ఈ సూచనను ఒక విద్యావేత్త తీవ్రంగా ఖండిస్తూ ఇరవయో శతాబ్ది తుదినాళ్లలో ఏర్పాటు చేసుకునే విశ్వవిద్యాలయాన్ని భారతీయ విశ్వవిద్యాలయాలను గుడ్డిగా అనుకరించడాన్ని భారతీయ విద్యావేత్తలు కూడా హర్షించరని పేర్కొన్నారు. ఖాట్మండులో విదేశీ పర్యాటకులకు సేవలు అందిస్తున్న ఒక హోటల్‌ను నిర్వహించే రష్యన్ వ్యాపారవేత్త గురించి ఒక ఆసక్తికరమైన వ్యాసమున్నది. భూ సంస్కరణలు, అమెరికా సహాయం గురించి కూడా విపుల వ్యాసాలు ఉన్నాయి.

ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా ఆధునిక నేపాల్ గురించి నేను చాలా తెలుసుకున్నాను. 1950ల్లో భారత్‌లో సంభవించిన పరిణామాల గురించి కూడా అటువంటి పుస్తకం నొకదాన్ని తీసుకువస్తే బాగుంటుంది కదా అనే ఆలోచన నా మనసులో మెదిలింది. ఆ స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో కలకత్తా, ఢిల్లీ, బాంబే, బెంగళూరులో కఫేలు, కాఫీ హౌస్‌లు మేధావుల సమావేశాలు, చర్చలకు నెలవులుగా ఉండేవి. అటువంటి నెలవులు గురించి అధ్యయనం చేయడం విలువైన చారిత్రక కర్తవ్య నిర్వహణ అవుతుంది. అలాగే నేపాలీ పత్రికల గురించి ప్రత్యూష్ రాసిన వ్యాసం ఉత్కృష్ట అధ్యయనాలకు ఉపథ నిర్దేశం చేసిన బాంబే జర్నల్ 'ఎకనమిక్ వీక్లీ' (తదనంతర కాలంలో ఇది ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీగా పునరుత్థానమయింది) చరిత్రను శోధిస్తే స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో మేధో చింతన ఆవిర్భావం, అది పరిణమించిన రీతులపై కొత్త వెలుగులు ప్రసరిస్తాయి. త్రిభువన్ విశ్వద్యాలయంపై వ్యాసం చదివిన తరువాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల ఏర్పాటు, భారతదేశ, విశాల ప్రపంచ ఆర్థిక జీవనంపై వాటి ప్రభావం గురించి పరిశోధనలు ఇంకా ఎందుకు జరగలేదని నేను ఆశ్చర్యపోయాను. అలాగే రష్యన్ వ్యాపారవేత్తపై వ్యాసం చదివిన తరువాత సుప్రసిద్ధ తాజ్, ఒబెరాయి హోటళ్ల చరిత్రపై పరిశోధనలు జరగవలసి ఉందనే భావన కలిగింది.

నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలను చులకనగా చూడడాన్ని, వాటి పట్ల అహంకారపూరిత వైఖరి ప్రదర్శించడాన్ని మన పాలకపక్ష రాజకీయవేత్తలు విడనాడాలని సంవత్సరం క్రితం ఇదే కాలమ్ (ఆగస్టు 24, 'విశ్వమిత్ర భారత్‌కే ఇరుగు పొరుగు బలిమి')లో రాసిన వ్యాసంలో నేను వాదించాను. 'Nepal in the Long 1950s' చదివిన తరువాత ఆ వాదనకు ఇలా ముక్తాయింపు ఇవ్వదలిచాను: ఇరుగు పొరుగు దేశాల గురించి మరింత విస్తృతంగా, సమగ్రంగా మనం అధ్యయనం చేయాలి. తద్వారా, ఆర్థిక, విదేశాంగ విధాన ప్రయోజనాలతో సంబంధం లేకుండా భారతదేశమూ, భారతీయులూ విశేషంగా లబ్ధి పొందుతారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)


మన కాలపు 'కల్చరల్ కమాండర్'

తెలుగు సాంస్కృతిక రంగాన్ని బహుజన విముక్తి దిశగా పదునెక్కించిన ప్రజావాగ్గేయకారుల్లో ముందువరసలో నిలిచే పేరు మాస్టార్జీ. తన ఏడుపదుల జీవితంలో అరవయ్యేళ్లను కళకే అంకితం చేసిన సాంస్కృతిక సేనాని. ఎర్రజెండా పాటకు దీటుగా బహుజన పాటను నిలబెట్టాడు మాస్టార్జీ. తెలుగు సమాజంలో లక్షలాదిమందికి బహుజన సోయిని అందించిన మహావాగ్గేయకారుడు. మూలాల్లోకి వెళ్లి, ఆ చరిత్రనంతా వందలాది పాటల్లోకి ఎక్కించి బహుజన రాజకీయాలు బోధించినవాడు. మూలవాసీ సిద్ధాంతాన్ని యాభై యేళ్ల క్రితమే తెలుగు నేలకు పరిచయం చేసిన దార్శనికుడు. విప్లవోద్యమ పాట పెద్దయెత్తున వెలువడుతున్న కాలంలో మాస్టార్జీ మాత్రం అంబేడ్కరిస్ట్ సాంస్కృతిక ఉద్యమానికి పునాదులు వేశాడు. నలుగురు నడిచే దారుల్లో ఎవ్వరైనా నడవగలరు. అలా కాకుండా కొత్త తొవ్వ వేయడం అందరి వల్లా కాదు. అలాంటి ప్రత్యేకతను కలిగినవాడు మాస్టార్జీ. ఆయన పాటందుకుంటే అందులో బహుజన రాజకీయ పాఠమే ఉంటుంది తప్ప, అలరించే నిష్ప్రయోజనత ఉండదు.

నలుగురు నడిచే దారుల్లో ఎవ్వరైనా నడవగలరు. అలా కాకుండా కొత్త తొవ్వ వేయడం అందరివల్లా కాదు. అలాంటి ప్రత్యేకతను కలిగినవాడు మాస్టార్జీ. ఆయన పాటందుకుంటే అందులో బహుజన రాజకీయ పాఠమే ఉంటుంది తప్ప, అలరించే నిష్ప్రయోజనత ఉండదు. అణగారిన బాధితుల పక్షాన నిజమైన ప్రజాస్వామికవాది ఆయన.

మాస్టార్జీ అసలు పేరు గంగాధరి శ్రీరాములు. తెలుగు నేల మీద చెరగని ప్రభావాన్ని వేసిన సాంస్కృతిక అధ్యాయం జననాట్యమండలి. దాని కళాకారులకు 'రగల్ జెండా' బ్యాలే, దీపారాధన, బాంగ్డా వంటి డ్యాన్సులు నేర్పడానికి మాస్టర్‌గా వెళ్లాడు. అట్లా ఆయనను అందరు మాస్టార్జీగా సంబోధించడంతో, అదే పేరు స్థిరపడిపోయింది. 1952 సెప్టెంబర్ 7న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారంలో సాధారణ మాదిగ కుటుంబంలో సత్యమ్మ, రాజయ్య దంపతులకు జన్మించాడు. తండ్రి రాజయ్య కూడా వీధి భాగవతం చెప్పేవాడు. ఆ ప్రభావం మాస్టార్జీపైన చిన్ననాడే పడింది. ఇక తన మేనత్త చంద్రమ్మ పాడే జానపద పాటలు కూడా మాస్టార్జీని కళాకారునిగా తీర్చిదిద్దాయి. తన ఏడవ ఏటనే పాటలు రాసే పని మొదలుపెట్టాడు.

తెలుగు సమాజంలో విప్లవ గాలులు వీచడం మొదలయ్యాయి. అయినా సరే మాస్టార్జీ మాత్రం అంబేడ్కర్ మార్గంలో తన పయనాన్ని కొనసాగించాడు. అందుకు కారణం కులవివక్ష పట్ల ఆయనకు చిన్ననాటి నుంచి తీవ్ర వ్యతిరేకత ఉండడమే. మరోవైపు ఉత్తర భారతాన 1970వ దశకంలో బిహార్‌లోని బెల్చీలో 12 మంది దళితులను ఠాకూర్లు ఊచకోత కోశారు. అలాగే 1975లో భగల్పూర్ జైలులో నలుగురు దళితుల కళ్లు పీకేశారు. ఈ రెండు సంఘటనలు మాస్టార్జీపై తీవ్ర ప్రభావం చూపాయి. దళితుల విముక్తి జరగాలంటే కులనిర్మూలన జరగాలని నిర్ణయించుకున్నాడు ఆయన. అలా ఇప్పటికీ సుమారు 400లకు పైగా పాటలు రచించి బహుజనులను ఆలోచింపజేశాడు.



ఈ నేపథ్యంలోనే మాస్టార్జీ రాసిన 'అందుకో దండాలు... బాబా అంబేడ్కరా' పాట తెలుగు నేల దశదిశలకూ వ్యాపించింది. ఎక్కడ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగినా ఇప్పటికీ వినపడుతూ ఆ పాట చరిత్రను సృష్టించింది. అందుకే అది అనతి కాలంలోనే ఎనిమిది భారతీయ భాషల్లోకి సైతం అనువాదం అయ్యింది. ఈ క్రమంలో మాస్టార్జీ పేరు ఉమ్మడి రాష్ట్రంలో మార్మోగింది. అది కేవలం భారతదేశం వరకే ఆగిపోలేదు. 2001లో దక్షిణాఫ్రికాలో జరిగిన డర్బన్ సదస్సులో మాస్టార్జీ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ సదస్సులో నల్లజాతి ప్రజలపైన మాస్టార్జీ ఆశువుగా రాసిన పాటే 'బ్లాక్ ఈజ్ బ్యూటీ'. ఈ పాటకు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులంతా పులకించిపోయారు. అలాగే 2011లో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో సైతం విదేశీయులను మైమరపింపజేసింది మాస్టార్జీ పాట.

కళ ద్వారా బహుజనులను మేల్కొల్పాలని సంకల్పించాడు మాస్టార్జీ. అట్లా 1977లో విశ్వజన కళామండలిని స్థాపించాడు. ఇక సాహిత్యం వల్ల ప్రజల్లో కలిగే మార్పును ముందే గుర్తించాడు ఆయన. అందుకే తాను పాటల వరకే పరిమితం కాలేదు. తనలో ఆడి, పాడే కళ ఉంది. దానిని సానబెట్టి అనేక నృత్య రూపకాలు రచించి ప్రదర్శించాడు. వాటితో పాటు ప్రజలను ఆలోచింపజేయడానికి నాటకం మంచి వాహకమని నమ్మాడు. అందుకే "రిక్షా రాజయ్య, స్కోరెంత?, అఖండ విప్లవజ్యోతి అంబేడ్కర్, ఇందాకటిది ఉందా?, ఈ పిచ్చికి పేరు పెట్టండి, వంద గొంతులు వెయ్యి డప్పులు, ఔను మల్లా (వీధి నాటకం), కాముడు, అమ్మా..ఆవు" వంటి నాటికలు రచించి, ప్రదర్శించాడు. మట్టిపూలు అనే కవితా సంపుటిని ప్రచురించాడు. ఇక 'గుర్తు కొస్తున్నాయి' కథా సంపుటితో పాటు, అనేక పాటలను వివిధ సందర్భాల్లో పుస్తకాలుగా, సీడీలుగా వెలువరించాడు.

అంబేడ్కర్ అన్నట్టు "చరిత్ర తెలియనివారు చరిత్రను సృష్టించలేరు". అందుకే బహుజనులకు వారి చరిత్రను తెలియజేసేందుకు పాటను ఒక వాహికగా మార్చుకున్నాడు మాస్టార్జీ. పాట ద్వారా రాజకీయాలు బోధించాలనే సోయి ఆయనలో మెండుగా ఉంది. మనం ఎక్కడి నుంచి వచ్చాం, ఎటు పయనిస్తున్నాం, ఇప్పుడు మనమున్న ఈ దుస్థితికి చరిత్రలో ఎక్కడ మోసం జరిగిందో పాటలోనే విడమరిచి చెప్పడంలో మాస్టార్జీ నిష్ణాతుడు. అందుకే ఆయన లక్షలాదిమంది బహుజనులను ఆలోచింపజేయగలిగాడు. అంతేకాదు మాస్టార్జీ మూలవాసీ సిద్ధాంతాన్ని తెలుగు నేలకు పరిచయం చేశాడు. చరిత్రను బహుజన కోణంలో స్పృశించాడు. ఎర్రజెండా పాటకు దీటుగా బహుజన పాటను సృజించాడు. ఇట్లా తన కాలంలో ముందుకు వచ్చిన ప్రతీ ఉద్యమానికి పాటల మద్దతు తెలియజేశాడు. అణగారిన బాధితుల పక్షాన నిజమైన ప్రజాస్వామికవాదిగా నిలిచాడు.

■ డా. పసునూరి రవీందర్
తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు

(రేపు రవీంద్ర భారతిలో మాస్టార్జీ జన్మదినం, ఆయన స్థాపించిన విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవం)

'రైతునేస్తం' అవార్డు దరఖాస్తులకు ఆహ్వానం

'రైతునేస్తం' 21వ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త 'పద్మశ్రీ' పురస్కృతులు స్వర్గీయ డా. ఐ.వి. సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులతో పాటు అగ్రి ఇన్నోవేషన్స్‌ను అవార్డులతో సత్కరించనున్నారు. ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునేవారు 'రైతునేస్తం' వెబ్‌సైట్ https://rythunestham.in/awards నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని పూరించి, దానికి వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి సెప్టెంబర్ 15వ తేదీలోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004. ఫోన్: 96767 97777 (లేదా) రైతునేస్తం', డోనెం. 8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మం., గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522017, ఫోన్: 97053 83666 చిరునామాలకు పంపగలరు లేదా editor@rythunestham.inకు ఇ-మెయిల్ చేయవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే.

– యడ్లపల్లి వేంకటేశ్వరరావు
చైర్మన్, రైతునేస్తం ఫౌండేషన్



సిద్దేశ్వర గుండం వద్ద నిమజ్జనం చేస్తున్న బల్దియా సిబ్బంది





సిద్దేశ్వర గుండం వద్ద నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



పబ్లిక్ గార్డెన్ సమీపంలో మహిళల నృత్యాలు

గణపయ్యకు నీరాజనం

కన్నులపండువగా సాగిన నిమజ్జనోత్సవం

- నగరంలో వెల్లువలా తరలివచ్చిన గణేష్ విగ్రహాలు
- డప్పు చప్పుళ్లు, నృత్యాలతో భక్తుల సందడి
- స్వాగతించిన విశ్వహిందూ పరిషత్
- విస్తృత ఏర్పాట్లతో ప్రశాంతంగా సాగిన పర్వం



బంధం చెరువు వద్ద గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్/వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు వాడవాడలా ఆధ్యాత్మిక సందడి చేసిన మహాగణపతి భక్త కోటి నుంచి సెలవు తీసుకున్నాడు. విగ్రహాల నిమజ్జనోత్సవ సందడి శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగి ఆడంబరంగా ముగిసింది. గణపతి బప్పా మోరియా, మంగళమూర్తి మోరియా, గణేష్ మహారాజ్‌కి జై.. అంటూ భక్తుల మిన్నంటే నినాదాలు నగరమంతా మార్మోగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో భారీ గణపయ్యలను ఉంచి మంగళవాయిద్యాలు, యువకుల కేరింతలు, మహిళల కోలాటాలతో నిమజ్జనమంతా నేత్రపర్వంగా కొనసాగింది. నిమజ్జన వేడుకలను వరంగల్ కలెక్టర్ సత్యశారదా దేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ముందుగా దేశాయిపేటలోని చిన్నవడ్డెపల్లి చెరువులో ఉన్నతాధికారులు నిమజ్జన వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. చిన్నవడ్డెపల్లి చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని క్రేన్ ఎక్కి స్వయంగా గణేశ్ నిమజ్జనం చేశారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి కమిషనర్, మేయర్ తగు సూచనలు చేశారు. అంతే కాకుండా కమిషనర్, మేయర్ నగరంలోని నిమజ్జన ప్రాంతాలైన చెరువులను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రధానంగా చిన్నవడ్డెపల్లి చెరువు, ఉర్సు, రంగశాయిపేట, బెస్తం చెరువు, ఖిలావరంగల్, గుండు చెరువు, గొర్రెకుంట, కట్టమల్లన్న, మామునూరు, బంధం చెరువు, సిద్ధేశ్వరగుండం, హసన్‌పర్తి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హనుమకొండ చౌరస్తా, కాజీపేట నిట్ ప్రాంతంలో విశ్వ హిందూ పరిషత్, మహాగణపతి నవరాత్రి ఉత్సవ సమితి నాయకులు కసిరెడ్డి జైపాల్‌రెడ్డి, శ్రీరాం ఉదయ్‌కుమార్, వెలగందుల రాజు, నందాల చందర్‌బాబు తదితరులు, వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో చందర్‌బాబు, నాగరాజు, ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చే వినాయక ప్రతిమల నిర్వాహకులపై పూలవర్షం కురిపిస్తూ వారు చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ స్వాగతించారు. బహుమతులు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా ప్రస్తుతిస్తూ స్వాగతించారు. పోలీస్ యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యగా ట్రాఫిక్‌ను దారి మళ్లించింది. హనుమకొండ చౌరస్తాలో రాత్రి 8నుంచి 9గంటల ప్రాంతంలో కిక్కిరిసిన భక్తజన సమూహంతో నిమజ్జనోత్సవపర్వం ఆధ్యాత్మిక సందడి గుబాళించింది. అర్ధరాత్రి దాటినా నగరంలో రోడ్లపై జనసంచారం గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపు కొనసాగింది. అపార్ట్‌మెంట్ల నుంచి వినాయక ప్రతిమలను ఏకరూప దుస్తులతో ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

చిన్న వడ్డెపల్లి చెరువులో వినాయక నిమజ్జనం ఉదయం నుంచే కోలాహలంగా సాగింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఉత్సాహంగా విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక మండపాల నుంచి నిర్వాహకులు డప్పు చప్పుళ్ల మధ్య గణేష్ విగ్రహాలను చెరువు వద్దకు తరలించారు. సాయంత్రం వేళ నుంచి నిమజ్జన వేడుకలు (మిగతా 6లో..)

ఏడాదిన్నరలో లక్షల ఎకరాలకు సాగునీరు

- ప్రణాళికాబద్ధంగా గోదావరి నీటిని విడుదల చేస్తాం..
- రెండు పంటలకు నీళ్లు అందించేందుకు చర్యలు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవాబుపేట రిజర్వాయర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, బీర్ల ఐలయ్య, యశస్వినిరెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

లింగాల ఘణపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఏడాదిన్నర కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటుగా ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. శుక్రవారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్ వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి పంటపొలాలకు గోదావరి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ నిర్మాణానికి పెరిగిన అంచనా వ్యయంతో సవరింపులను కలుపుకుని రూ. 15వేల కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ. 13వేల కోట్లతో పనులను పూర్తయ్యాయన్నారు. మిగతా నిధులు మంజూరు చేయించుకుని రానున్న ఏడాదిన్నరలో ఆరు లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీళ్ల అందించే చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ (మిగతా 6లో..)

విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించేది ఉపాధ్యాయులే..



హనుమకొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, కలెక్టర్ స్నేహ శబరీష్

- రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా గురుపూజోత్సవం



మాట్లాడుతున్న బండా ప్రకాశ్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించేది ఉపాధ్యాయులేనని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడుతూ.. సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనన్నారు. విద్య ఇచ్చిన గొప్ప అవకాశంతోనే ఈ స్థాయికి ఎదిగానని, ఉపాధ్యాయులే తనను ప్రభావితం చేశారన్నారు. జిల్లాలో 1,45,294 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండటం అభినందనీయమన్నారు. కొన్ని జిల్లాల్లో చదువుకునే వారి సంఖ్య తక్కువ శాతం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటానికి గత కారణాలను గతంలో పరిశీలించిన అనంతరం జిల్లాలో దాదాపు 22ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులకు నిధులు ఇచ్చారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే డిజిటల్ విద్యా బోధన ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని, విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పిన చదువువల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని, ప్రతీ ఒక్కరు జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరడానికి విద్య ఎంతగానో సహాయపడుతుందన్నారు. దేశానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వివిధ అధికారులు, వివిధ రంగాల వారిని ఉపాధ్యాయలే అందించారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో జిల్లా ముందుందని, జిల్లాలో ఉన్న 873 పాఠశాలల్లో లక్షకుపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విలువలతో కూడిన భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని తెలియజేస్తూ పలువురు ఉపాధ్యాయులు స్ఫూర్తి గీతాలు ఆలపించగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ విద్యార్థినులు చేసిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది. సమావేశం అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 55మంది ఉపాధ్యాయులను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ డాక్టర్ బండా ప్రకాశ్, కలెక్టర్ స్నేహ శబరీష్, డీఈఓ వాసంతి శాలువా కప్పి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీస్ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి గోపాల్, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ యోగితారాణా, దేవసేన, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న కేయూ ప్రొఫెసర్ ప్రసాద్, ఉపాధ్యాయులు అరుణ, సునిత, తిరుపతి, లింగయ్య

కనులపండువగా..

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం
- హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ నుంచి ఐదుగురికి సత్కారం

హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదిక ప్రాంగణంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల అవార్డుల ప్రదానోత్సవం కన్నుల పండుగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఐదుగురికి సత్కారం జరిగింది. కేయూలోని ఫార్మసీ ప్రొఫెసర్ ఎన్. ప్రసాద్, హనుమకొండ పింగళి మహిళ కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి అరుణ, మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు రాదారపు సునీత, భూపాలపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొండ్ర తిరుపతి, చిట్యాల మండలంలోని జడల్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నూకల లింగయ్యలు అవార్డులు అందుకున్నారు.

- కేయూ క్యాంపస్/భూపాలపల్లిటౌన్/చిట్యాల/మహబూబాబాద్ ఎడ్యుకేషన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మృతుల్లో ఒకరు రైతు, మరొకరు డ్రైవర్



కోడెపాక నర్సయ్య మృతదేహం, కాల్వల సంజీవ్ మృతదేహం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల మండలంలోని బావ్‌సింగ్‌పల్లి గ్రామానికి చెంది కోడెపాక నర్సయ్య (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కాల్వల సంజీవ్ (34) స్థానిక పంచాయతీ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు వ్యక్తిగత పని నిమిత్తం భూపాలపల్లికి బైక్‌పై బయల్దేరారు. సంజీవ్ బైక్ నడుపుతుండగా నర్సయ్య వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లిలోని బాంబులగడ్డ వద్ద టేకుమట్ల నుంచి భూపాలపల్లికి వస్తున్న ట్రాలీ వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో నర్సయ్య, సంజీవ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఇద్దరూ తుది శ్వాస విడిచారు. ఘటన స్థలాన్ని భూపాలపల్లి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతులకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు.

డివైడర్‌ను ఢీకొని ..

స్నేహితుడిపై కేసు నమోదు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీకాంత్ నాయక్

హసన్‌పర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి చర్చి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సు ంకరి రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్ మూసాపేట, భరత్ నగర్‌కు చెందిన జరపుల గోపాల్‌రావు నాయక్ కుమారుడు శ్రీకాంత్ నాయక్ (24) బీటెక్ పూర్తి చేశాడు. రెండు నెలల కిందటే హనుమకొండ గోకుల్ నగర్‌లోని వేదాంత్ లర్నింగ్ సెంటర్‌లో మాస్టర్‌గా పనిచేస్తూ అశోకకాలనీలో ఉంటున్నాడు. గురువారం రాత్రి తన మిత్రుడు గుగులోత్ హేమంత్ అద్దె గదిలో తోటి మిత్రులతో కలిసి విందు చేసుకున్నారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజామున శ్రీకాంత్‌నాయక్‌ను రోహన్ సబ్లే బైక్‌పై ఎక్కించుకొని గోకుల్‌నగర్ నుంచి కే యూసీ వైపు వెళ్తున్నారు. వడ్డెపల్లి చర్చి సమీపంలో వారి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోహన్ సబ్లేకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోపాల్‌రావు నాయక్ ఫిర్యా దు మేరకు రోహన్ సబ్లేపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. హనుమకొండ స్నేహ నగర్‌లో నివాసం ఉంటున్న మాధారెడ్డి కృష్ణవేణి (38) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న పైకప్పు ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. భర్త సత్యనారాయణరెడ్డి పోలీసు హెడ్ క్వార్టర్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్న ట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టం కోసం ఎంజీఎంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కమిషనరేట్‌లో పెరిగిన శిక్షల శాతం

● బాధ్యతాయుతంగా పనిచేయడం ద్వారానే సాధ్యం ● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నేరస్తులకు కోర్టులో శిక్షలు పడ్డ శాతం పెరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఇదంతా అన్ని విభాగాల సిబ్బంది బాధ్యయుతంగా పని చేయడం ద్వారానే సాధ్యమైందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు కమిషనరేట్ పరిధిలోని వివిధ న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు పడటంలో ప్రధాన పాత్రలు పోషించిన జాయింట్ డిప్యూటీ డైరెక్టర్స్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు ప్రాసెస్ విధులు నిర్వహించే అధికారులను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించడం వల్లనే మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది జరిగిన 16 ట్రయల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని, వాటిలో 6 హత్య కేసుల్లో ఐదు యావజ్జీవ శిక్షపడగా, మిగతా కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష పడిందన్నారు. నాలుగు అత్యాచార కేసుల్లో రెండు కేసుల్లో జీవితఖైదు, మరో రెండు కేసుల్లో 20 ఏళ్ల జైలు శిక్ష పడిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులో ఏడేళ్ల శిక్ష, చోరీతో పాటు మరో ఇతర ఐదు కేసుల్లో మూడేళ్ల చొప్పున జైలు విధించిందన్నారు. ఇలా నిందితులకు శిక్షలు పడటం ద్వారా బాధితులకు న్యాయం జరగడంతోపాటు కోర్టు, పోలీసులపై ప్రజలకు నమ్మకం కలుగుతోందన్నారు. నేరస్తులకు శిక్షపడటం కోసం పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. సమన్వయం కోసం ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారిని మానిటరింగ్ అధికారిగా నియమించామన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, వరంగల్ ప్రాసిక్యూషన్ ఆఫ్ జాయింట్ డిప్యూటీ డైరెక్టర్ రాములు, సంగారెడ్డి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, సీసీఆర్‌బీ ఏసీసీ డేవిడ్ రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంతోషి, శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, పావని, రాజమల్లారెడ్డి, దుర్గాబాయి, భరోసా కేంద్రం న్యాయాధికారి నీరజ, ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, శ్రీనివాస్, రవికుమార్, పుల్యాల కిషన్, ఎస్సై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు .



సన్మానగ్రహీతలైన న్యాయశాఖ, పోలీస్‌శాఖ అధికారులతో సీపీ

ఉత్తముల ఎంపికలో గందరగోళం

● నాలుగు సార్లు మార్పులకు గురైన జాబితా ● ఎమ్మెల్యే గైర్హాజరుపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ...

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలకు దారితీసింది. నాలుగు సార్లు ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను మార్చి మార్చి రూపొందించడాన్ని ఉపాధ్యాయ, అధికార, ప్రజాప్రతినిధి వర్గాలు తప్పుబట్టాయి. తొలుత గురువారం సాయంత్రానికే 48 మందితో కూడిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రకటించింది. అర్ధరాత్రి వరకు ఆ జాబితాను 48 మందికి కుదించిన అధికారులు మరో జాబితాను విడుదల చేశారు. దీంతో జిల్లాలోని ఉపాధ్యాయులంతా విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపట్ల విస్మయం చెందారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ముచ్చటగా మూడో సారి 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మరో జాబితాను బహిర్గతం చేశారు. దీంతో గురుపూజోత్సవానికి హాజరైన ఉపాధ్యాయులంతా అవాక్కయ్యారు. సత్కారాల సమయానికి ఉత్తముల సంఖ్య 55 నుండి 62కు పెరిగిన జాబితా ప్రకారం ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో జరిగిన విషయాలను సుతిమెత్తగా ప్రస్తావిస్తూ కలెక్టర్ స్నేహశబరీష్ తన ప్రసంగంలో అసహనం వ్యక్తం చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సైతం ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో విద్యాశాఖ వ్యవహరించిన తీరుపట అసంతృప్తితోనే గురుపూజోత్సవానికి గైర్హాజరయినట్లు ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకున్నాయి. కార్యక్రమ నిర్వహణలో విద్యాశాఖ పూర్తిగా విఫలమయినట్లు ఉపాధ్యాయులు విమర్శలు గుప్పించారు.



కుర్చీలు లేకపోవడంతో నిలబడి ఉన్న ఉపాధ్యాయులు

స్నేహలతకు జాతీయ ఉత్తమ ఇన్‌స్ట్రక్టర్ అవార్డు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న హనుమకొండవాసి నక్క స్నేహలత యాదవ్ జాతీయ ఉత్తమ ఇన్‌స్ట్రక్టర్‌గా అవార్డును అందుకుంది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టీచర్స్ అవార్డ్స్ కార్యక్రమంలో స్నేహలత యాదవ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ ఉత్తమ ఇన్‌స్ట్రక్టర్ అవార్డును అందజేశారు. .

ఏడాదిన్నరలో లక్షల ఎకరాలకు సాగునీరు

(5వ పేజీ తరువాయి)

నుంచి నవాబుపేటకు ప్రధాన కాల్వతో పాటుగా 10 ఉపకాలువలకు లైనింగ్ పనులు, పూడికతీత కోసం రూ.148కోట్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో దేవాదుల మూడోదశ ఆరో ప్యాకేజీకి రూ.1,015 కోట్లు మంజూరు చేయించామన్నారు. దీంతో 78వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీతో ముందుకు సాగుతుందన్నారు. గొలుసుకట్టు చెరువులను వరుస క్రమంలో నింపుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యేలంతా సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. యూరియాను కృత్రిమ కొరతను సృష్టిస్తున్న బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యూరియా కోసం తాము కేంద్రమంత్రి నడ్డాను కలిశామని, అంతేకాకుండా ప్రియాంక గాంధీతో కలిసి తాను, ఎంపీ కావ్య ఢిల్లీలో ధర్నా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరాం, ఇరిగేషన్ ప్రాజెక్ట్ సీఈ సుధీర్, ఈఈ ప్రవీణ్, డీఈ శ్రీకాంత్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రాంబాబు, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనానికి సంబంధించిన శోభయాత్ర బందోబస్తును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించారు. ఆయా మార్గాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారా? అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. నిమజ్జనం, శోభయాత్రకు ఏర్పాటు చేసిన 583 సీసీ కెమెరాలకు సంబంధించిన సీసీ ఫుటేజీలను కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసులు పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తారని సీపీ తెలిపారు.

చిర్రా రాజుగౌడ్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రాజుగౌడ్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేయూ పాలక మండలి సభ్యుడు, తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ చిర్రా రాజుగౌడ్‌కు ప్రతిష్ఠాత్మకమైన విద్యారత్న పురస్కార అవార్డు పొందారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీ సెమినార్ హాల్‌లో ఎస్ఆర్ఎఫ్ శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నేతృత్వంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించిన ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో అవార్డును ప్రదానం చేశారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా చిర్రా రాజుగౌడ్ అవార్డును అందుకున్నారు. విద్యా రంగానికి అందించిన విశేషమైన సేవలకు చిర్రా రాజుగౌడ్ అవార్డును ఇచ్చామని ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేశ్ పేర్కొన్నారు.

రేపు కేయూలో అనిశెట్టి రజిత యాదిసభ

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక (ప్రరవే) జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ రచయిత అనిశెట్టి రజిత యాధిసభను సెప్టెంబరు 7న నిర్వహించనున్నట్లు సాహిత్య, సామాజిక సంస్థల బాధ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు యాది సభ జరుగుతుందని పేర్కొన్నారు.

మునిపల్లిలో మొరం దందా

● అంతరిస్తున్న ప్రకృతి రమణీయమైన బోడగట్టుగుట్ట
● అనుమతులు లేకుండానే అక్రమ తరలింపు
● చోద్యం చూస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు



బోడగట్టుగుట్ట వద్ద తరలింపునకు గురవుతున్న మొరం

హసన్‌పర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం చింతగట్టు రెవెన్యూ శివారు మునిపల్లిలో మొరం దందా యథేచ్ఛగా సాగుతోంది. ప్రకృతి రమణీయమైన బోడగట్టుగుట్టను వ్యాపార కేంద్రంగా చేసుకొని కొంత మంది వ్యక్తులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరాన్ని నగరానికి తరలిస్తూ లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మునిపల్లికి చెందిన కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో బోడగట్టుగుట్టకు ప్రొక్లైనర్ సహాయంతో టిప్పర్లు ఏర్పాటు చేసి నగరానికి అక్రమంగా మొరాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో కొన్నిరోజుల కిందట కొంతమంది గ్రామస్తులు మునిపల్లికి చెందిన వ్యక్తులు చేసే మొరం దందాను కెమెరాల్లో బంధించి పోలీసు, రెవెన్యూ అధికారులకు వాట్సాప్ పెట్టినట్లు తెలిసింది. దీంతో కేయూసీ పోలీసు స్టేషన్‌కు చెందిన ఓ పోలీసు అధికారి మునిపల్లి బోడగట్టుగుట్ట వద్దకు చేరుకొని విచారించి నివేదికను తయారు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, తహసీల్దార్ చల్ల ప్రసాద్‌ను ఫోన్‌లో వివరణ కోరగా విచారించి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గణపయ్యకు నీరాజనం

(5వ పేజీ తరువాయి)

జోరందుకున్నాయి. నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు నగరవాసులు భారీగా తరలివచ్చారు. భారీ వినాయక విగ్రహాలను క్రేన్‌లతో నిమజ్జనం చేయడాన్ని ఆసక్తిగా తిలకించారు. నిమజ్జన ప్రాంతంలో వివిధ రకాల వస్తువుల అమ్మకాలు, డప్పు చప్పుళ్ల మధ్య వినాయక విగ్రహాల తరలింపుతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో జనాలు కిక్కిరిసిపోయారు. పోచమ్మమైదాన్ చౌరస్తాలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణనాథులకు స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. చిన్న వడ్డెపల్లి చెరువుకు నిమజ్జనానికి తరలివచ్చే గణనాథులకు వేదిక పైనుంచి మైకు ద్వారా స్వాగతం పలుకుతూ వారు పాటించవల్సిన సూచనలు, జాగ్రత్తలను తెలిపారు.

గణపతులను మండపాల నుంచి తరలించిన వెంటనే అక్కడ మిగిలి పోయిన పూలు, చెత్తను శానిటేషన్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన సేకరించి అక్కడి నుంచి బాలసముద్రం, పోతన నగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా నగరంతో పాటు చుట్టుపక్కల గణపతులను నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, మత్స్యశాఖ సిబ్బంది తెల్లవారేవరకు పని చేశారు. ఒక్కో చెరువు వద్ద 30 మంది సిబ్బంది కలిసి మూడు షిఫ్టులలో ప్రత్యేక దుస్తువులు ధరించి విధులు నిర్వర్తించినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి వెల్లడించారు. మునిసిపల్ సిబ్బందికి అనుసంధానంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలందించారు. 832 మంది శానిటేషన్ సిబ్బంది మరో వంద మంది అధికారులు నిమజ్జనంలో ఎనలేని సేవలందించారు. 300మంది గజ ఈతగాళ్లను తెప్పల వద్ద ఉంచి గణపతుల నిమజ్జనానికి పూర్తి సేవలు వినియోగించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సీసీ కెమెరాలలో రికార్డు అయ్యేందుకు వీలుగా 28 మంది సిబ్బంది ఐసీసీసీ నుంచి 24/7 విధులు నిర్వర్తించారు.

నేడు చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్

గణేశ్ మండపాల నుంచి నిమజ్జన ప్రదేశాలకు తరలించే సమయంలో వాహనాల నుంచి తొలగించిన వ్యర్థాలు, రోడ్లను శుభ్రం చేసేందుకు శనివారం శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్టు శానిటరీ సూపర్‌వైజర్లు శ్రీను, భాస్కర్, సురేష్ తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని మినహాయించి స్టాండింగ్ సిబ్బందితో నగరంలోని రోడ్లు, కాలనీలు శుభ్రం చేయిస్తామని తెలిపారు.

ఐసీసీసీ కేంద్రం నుంచి నిమజ్జన ఏర్పాట్ల వీక్షణ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని పలు ప్రధాన రహదారుల గుండా జరుగుతున్న గణేశ్ శోభయాత్ర, వివిధ ప్రాంతాల్లో చెరువుల వద్ద జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాలను మేయర్ గుండు సుధారాణి శుక్రవారం సాయంత్రం ఐసీసీసీ నుంచి వీక్షించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రం నుంచి మేయర్ చెరువుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న నోడల్ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. ప్రతీ ప్రాంతంలో జరుగుతున్న కార్యక్రమాలను సీసీ కెమెరాల్లో రికార్డు చేయాలని మునిసిపల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ప్రతీ ఉద్యోగి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మేయర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈ మాధవిలత, డీఈ కార్తీకరెడ్డిలు పాల్గొన్నారు.



ఐసీసీసీ నుంచి నిమజ్జన ఏర్పాట్లు వీక్షిస్తున్న మేయర్ సుధారాణి , అధికారులు

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

గిర్మాజిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విస్మరించాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఎం.డి.రాజాసాహెబ్ అధ్యక్షతన శుక్రవారం ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. వ్యవసాయ ఉత్పత్తులకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధర చట్టం చేస్తామంటూ హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ దానిని విస్మరించి రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడంతో దేశంలోని పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్టికల్ 130 సవరణకు సిద్ధమైందని ఆయన ఆరోపించారు. పేదల ప్రభుత్వంగా చెబుతున్న మోదీ ఆచరణలో కార్పొరేట్ వర్గాల ప్రభుత్వంగా మారిందని రవి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్ల గడిచినా ఆరు గ్యారంటీలు, 420 హామీలలో కొన్ని మాత్రమే అమలు చేసిందని అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ పబ్బం గడుపుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటాపోటీగా చేస్తున్న ప్రకటనల జోరు అమలులో కనిపించడం లేదన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, కె.వెంకన్న, ఎన్.కొమురయ్య, వి.రాగసుధ, కె.బాబురావు, నగర కార్యదర్శి మాలోతు సాగర్, కె.సంధ్య, జగదీశ్వర్, ఎం.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కె.సదానందం, కె.రాజమౌళి, మాలోతు ప్రత్యూష, ఐతం నగేష్, ఎమల్లికార్జున్, మాలి ప్రభాకర్, బి.కుమారస్వామి. జి.ఓదెలు, ఎ.నర్సయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

జోరుగా మద్యం విక్రయాలు

ఎక్సైజ్ అధికారుల ఆంక్షలు గాలికి...

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులు మూసి ఉన్నాయనేది ఉత్తిత్తి మాటే.. పేరుకే లైసెన్స్‌డ్ షాపులకు అబ్కారీ అధికారులు సీల్ వేశారు.. కానీ మద్యం విక్రయాలు ఎక్కడా ఆగలేదు. గణపతి నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకూడదని, భక్తులు ఇబ్బందులకు గురికావొద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులను మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బార్, వైన్స్ షాపులకు అబ్కారీ అధికారులు సీల్ వేశారు. కానీ అక్రమంగా మద్యం విక్రయాలను నిలువరించడంలో చేతులెత్తేశారని పలువురు విమర్శిస్తున్నారు. కేవలం బార్, వైన్‌షాపుల తనిఖీలకే పరిమితం అవడంతో గ్రేటర్ వరంగల్ శివార్లతో పాటు వరంగల్ రూరల్‌లోని పల్లెల్లో మద్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. మద్యం బాబుల సందడితో బెల్ట్‌షాపులు బార్, వైన్స్ షాపులను తలిపించాయి. కొందరు అధికారుల ఆశీస్సులతో వైన్‌షాపుల నిర్వాహకులు వందలాది మద్యం పెట్టెలను బెల్ట్‌షాపులకు తరలించినట్లు తెలుస్తోంది. దీంతో ట్రైసిటీ చుట్టూరా ఉన్న గుండ్లసింగారం, చింతగట్టు, దేవన్నపేట, కోమటిపల్లి, భట్టుపల్లి, కడిపికొండ, కాజీపేట దర్గా, పైడిపల్లి, దేశాయిపేట, వడ్డెపల్లి, న్యూశాయంపేట, హనుమకొండ బస్టాండ్, భీమారం, పూరీగుట్ట, ధర్మారం, ఉనికిచర్ల, దేవన్నపేట, గోపాల్‌పూర్‌తో పాటు వరంగల్ రూరల్‌లోని పల్లెల్లో మద్యం విక్రయాలు జోరుగా ఊపందుకున్నాయి. ఒక్కో ఫుల్‌బాటిల్‌పై రూ.200 నుంచి 250 వరకు, బీరుపై రూ.70 అధికంగా తీసుకొని ఆయా బెల్ట్‌షాపుల నిర్వహించినట్లుగా సమాచారం.




సిద్దేశ్వర గుండం వద్ద నిమజ్జనం చేస్తున్న బల్దియా సిబ్బంది, నిమజ్జనం అవుతున్న గణనాథులు

హనుమకొండ వాగ్దేవి కళాశాలలో నిమజ్జనానికి తరలుతున్న గణపతికి హారతి ఇస్తున్న విద్యార్థులు




ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

వినాయక నిమజ్జనం కనులపండువగా సాగింది. తొమ్మిది రోజులు ఘనమైన పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు.. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, నృత్యాల నడుమ చెరువుల వద్దకు బయలుదేరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.



వరంగల్ చిన్న వడ్డెపల్లి చెరువులో గణపతి నిమజ్జనం దృశ్యాలు



పబ్లిక్ గార్డెన్ సమీపంలో మహిళల నృత్యాలు





హనుమకొండ సిద్దేశ్వర గుండం వద్ద..

నిట్‌లో ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్

- రూ.13కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు
- బజాజ్ ఆటో లిమిటెడ్‌తో నిట్ ఎంవోయూ

హనుమకొండ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బజాజ్ ఆటో లిమిటెడ్‌తో వరంగల్ ఎన్ఐటీ శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నది. ఈ భాగస్వామ్యం కింద బజాజ్ ఆటో లిమిటెడ్ తన సీఎస్ఆర్ నిధులు రూ.13కోట్లు వెచ్చింది వరంగల్ నిట్ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ (బీఈఎస్‌టీ) సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. ఇలా ఒప్పందం కుదుర్చుకున్న మొదటి కేంద్ర నిధుల సాంకేతిక విద్యాసంస్థ (సీఎఫ్‌టీఐ)గా వరంగల్ నిట్ నిలిచింది. ఈ ఎంవోయూపై వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ గుడిపాటి ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. నిట్ వరంగల్ బీఈఎస్‌టీ అధిపతి ప్రొఫెసర్ టి.కిశోర్ కుమార్, డీన్స్ విభాధి పతులు. అధ్యాపకులు, బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రతినిధులు ఈ సందర్భంగా హాజరయ్యారు. బీఈఎస్‌టీ లక్ష్యం విద్య, శిక్షణ, పరిశ్రమల అవసరాల మధ్య గత అంతరాన్ని తగ్గించడం. ఈ ప్రాజెక్టు ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశా లు కలిగేలా నైపుణ్యాభివృద్ధి చేయనున్నారు.



ఎంవోయూపై పత్రాలతో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి, బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ గుడిపాటి సుధాకర్

బీఈఎస్‌టీ ప్రోగ్రాంను మొత్తం ఆరు విభాగాలుగా రూపొందించారు. వీటిలో మొదటి దశలో వరంగల్ నిట్‌లో ఫర్మ్‌వేర్ డెవలప్‌మెంట్, ఈ-మొబిలిటీ అనే రెండు విభాగాలను అమలు చేస్తారు. ఇవి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ భవిష్యత్తుకు అత్యంత కీలకం. ఈ ప్రోగ్రాం ఇప్పటికే నిట్‌లోని బీటెక్ (ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) కోర్సుల్లో ప్రారంభించారు.

ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు నిట్, బజాజ్ ఆటో లిమిటెడ్ నుంచి సంయుక్తంగా సర్టిఫికెట్ పొందు తారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక విభాగం కోసం అవసరమైన అన్ని పరికరాలు, ల్యాబ్ వంటి మౌలిక వసతులు బజాజ్ ఆటో లిమిటెడ్ పూర్తిగా కల్పిస్తుంది. దీంతో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలతో శిక్షణ లభిస్తుంది. బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో త్వరలోనే ఇన్నోవేషన్, శిక్షణ, అప్లయిడ్ రిసెర్చ్ హబ్‌గా ఎదుగనున్నది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఉన్నత విద్యాకార్యదర్శి మార్గదర్శకత్వంలో బీఈఎస్‌టీ ప్రోగ్రాం ప్రారంభించిన మొదటి నిట్ వరంగలేనని అన్నారు. విద్యాబోధన, పారిశ్రామిక రంగంలో వేగంగా మారుతున్న వాస్తవ అను వర్తనాల మధ్య గల అంతరాన్ని తగ్గించడంలో ఈ ప్రోగ్రాం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ గుడిపాటి మాట్లాడుతూ.. అకాడెమియా భాగస్వా మ్యాన్ని బలపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను భవిష్యత్తుకు తగిన ఇంజనీర్లుగా తీర్చిదిద్దడంలో ఇది దోహదం చేస్తుందన్నారు. అంతేగాక పూర్తిస్థాయి నిధులతో మౌలిక వసతు లు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, సర్టిఫికేషన్ మార్గాలు అందించడంలో బజాజ్ దీర్ఘకాలిక కట్టుబాటును పునరుద్ఘాటించారు.



కేయూ స్టాల్ వివరాలను వింటున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఇతర అధికారులు

సీఎం దృష్టిని ఆకర్షించిన కేయూ స్టాల్

'వెస్ట్ టూ వెల్త్' వివరాలపై రేవంత్‌రెడ్డి ఆరా

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శిల్పాకళా వేదిక సాక్షిగా కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్.. సీఎం రేవంత్ రెడ్డి దృష్టిని ఆకర్షించింది. కేయూ సెరికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత నేతృత్వంలో రూపొందించిన 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. వేస్ట్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అనే అంశాన్ని సంబంధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత, ఇతర అధికారులు రాము బన్నూర్కర్, ఎం.ప్రవీణ్‌లు సీఎం రేవంత్‌కు వివరించారు. ప్రాజెక్టు బాగుందని కితాబుచ్చారు. అలాగే ఇటీవల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను సక్సెస్ చేశారని, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను మరింత సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. వెల్ డన్.. వెల్ డన్.. అంటూ వర్సిటీ అధికారులను అభినందించారు.

మేడారం అడవుల్లో దారుణ హత్య

- యువకుడిని కిడ్నాప్ చేసి చంపిన దుండగులు
- ఆపై మృతదేహం దహనం
- పోలీసుల అదుపులో నిందితులు?



మృతుడు బాసిత్ (ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అడవుల్లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిని పలువురు కిడ్నాప్ చేసి హత్య చేశారు. ఆపై మృతదేహాన్ని కాల్చి పడేసి వెళ్లారు. ఈ సంఘటన గురువారం వెలుగు చూసింది. మేడారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మేడారానికి రెండు కిలో మీటర్ల దూరంలో గుర్తు తెలియని మృతదేహం ఉందని పలువురు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి తమ సిబ్బందితో ఎస్సై అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలింగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎం.డి.బాసిత్ (20) అనే యువకుడిదిగా గుర్తించారు. ఈనెల 3న భూపాలపల్లి నుంచి బాసిత్ కిడ్నాప్‌నకు గురికాగా కేసు నమోదైంది. బాసిత్‌ను భూపాలపల్లికే చెందిన బబ్లూ, ప్రశాంత్, కుషాల్‌తోపాటు మరికొందరు శాంతినగర్‌లోని చర్చి వద్ద నుంచి కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని అతడి తల్లి సబిహ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో బాసిత్‌ను కిడ్నాపర్లు హత్య చేసి మేడారం అడవుల్లో మృతదేహాన్ని కాల్చి పడిసినట్టు పోలీసుల విచారణలో తేలింది. మృతుడి రెండు చేతులను తాడుతో వెనక్కి కట్టేసి ఉన్నాయి. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించిన పోలీసులు నిందితులు బబ్లూ, ప్రశాంత్, కుషాల్‌ను అదుపులోకి తీసుకున్నారని సమాచారం. గంజాయి రవాణా ఆర్థిక లావాదేవీల విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడమే ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. మరోవైపు ఓ యువతికి బాసిత్ ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్‌లు పంపడం వల్లే ఈ హత్య జరిగిందని కూడా చర్చ జరుగుతోంది. బాసిత్‌ను తామే హత్య చేశామని నిందితులు బబ్లూ, ప్రశాంత్, కుషాల్ అంగీకరించారని సమాచారం. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి సీఐ నరేష్, ఎస్సై సాంబ మూర్తి సందర్శించి విచారణ చేపడుతున్నా రని మేడారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు వెల్లడించారు.



జీపీఓలు వెళుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్‌కు తరలిన జీపీవోలు

జెండా ఊపి బస్సులను ప్రారంభించిన అదనపు కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు సంబంధించిన గ్రామ పంచాయతీ పాలన అధికారులు (జీపీవోలు) నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి చేతలు మీదుగా అందుకునేందుకు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం నుంచి జీపీవోల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాకు సంబంధించి 110 మంది జీపీవోలు మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకల్లవ్య ద్వారా అందుబాటులోకి ప్రపంచస్థాయి విద్య

- విద్యార్థుల అభ్యసన పునాదుల పటిష్టతకు దోహదకారి
- ఏకల్లవ్య ఓటీటీ ప్లాట్‌ఫారం చైర్మన్ సంతోష్ రెడ్డి
- ఘనంగా ఓటీటీ ప్లాట్ ఫారం ప్రారంభం

హనుమకొండ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ ఏకల్లవ్య ఓటీటీ ప్లాట్‌ఫారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఏకల్లవ్య చైర్మన్ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు అత్యుత్తమ ఉపాధ్యాయుల శ్రేణి, వనరులు కొన్ని నగరాల్లోనే కేంద్రీకృతమయ్యాయని, దీనిని తాము మార్చుతున్నామ న్నారు. ఏకల్లవ్య ద్వారా కేవలం తరగతులే కాకుండా ఎంపిక, అవకాశం, ప్రపంచస్థాయి విద్య దేశం నలుమూలలా అందిస్తుందని, అధ్యయనం మధ్య అంతరాలను తొలగిస్తుందన్నారు. సంప్రదాయ నమూనా మాదిరిగా ఏకల్లవ్య విద్యార్థులను ఒకే గ్రేడ్‌లో బంధించదని, విద్యార్థుల అభ్యసన పునాదులను బలపరుస్తుందని చెప్పారు. ఏకలవ్య సహ వ్యవస్థాపకుడు, సీఈవో దీపక్ మాట్లాడుతూ.. అధ్యయనాల మధ్య అంతరాలే విద్యార్థులు ఉన్నత స్థాయి భావనలను అర్థం చేసుకోలేకపోవడానికి కారణం అన్నారు. దీనికి తాము పరిష్కారం కనుకొన్నామని, తాము పేస్ బేస్డ్ సిస్టమ్ నుంచి మాస్టరీ బేస్డ్ సిస్టమ్ వైపు అడుగుపెడుతున్నామన్నారు.

ఏకల్లవ్య డైరెక్టర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి అత్యుత్తమ బోధన అనివార్యం అన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఉపాధ్యాయుల వద్ద విద్య నేర్చుకునేందుకు వీలుగా తాము ఈ ఓటీటీ ప్లాట్‌ఫారంను నిర్మించామన్నారు. ఎస్ఆర్ అకాడమీ జీఎం, ఏకల్లవ్య డైరెక్టర్ పెండెం వెంకట నగేశ్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఒక గొప్ప పాఠం కూడా నాసిరకం ప్రజంటేషన్ వల్ల ప్రభావం కోల్పోతుందని అన్నారు. అందుకే లర్నింగ్‌కు సంబంధించిన ప్రతీ వీడియో సినిమా స్థాయి క్వాలిటీ ప్రొడక్షన్‌ను కలిగి ఉంటుందన్నారు. డైరెక్టర్ అజయ్ కుమార్ కొండపర్తి మాట్లాడుతూ.. వీడియోలో ప్రతీ క్షణం కంటెంట్ ప్రయోజనకరంగా, పాఠ్యపరంగా సరైనదిగా, ఆకట్టుకునేలా రూపొందించామని తెలిపారు. భారత నౌకాదళం మాజీ అధికారి సీటీవో కమాండర్ అనుమాండ్ల నటరాజు మాట్లాడుతూ.. తమ టెక్నాలజీ స్థిరమైంది, సురక్షితమైందని తెలిపారు. బఫరింగ్ లేకుండా సాఫీగా నడిచే వీడియో కోసం ఆధునాతన సాంకేతికతను వాడామన్నారు.



ఏకల్లవ్య ఓటీటీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

దేశంలోనే మొదటి ఓటీటీ ప్లాట్ ఫారం

ఒకే సబ్‌స్క్రిప్షన్‌తో టైమ్, ఆహా గురు వంటి అగ్రశ్రేణి విద్యా బ్రాండ్లను ఒకే సబ్‌స్క్రిప్షన్‌లో అందించి ప్రతీ విద్యార్థికి నాణ్యమైన, సరసమైన విద్య అందిస్తుంది. విద్యార్థులు తమ లర్నింగ్ జర్నీని స్వయంగా నియంత్రించుకొని, లర్నింగ్‌లోని అంతరాలను తొలగించుకొని తమ పూర్తి విద్యాసామర్థ్యాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుంది. భారతీయ విద్యలోని ప్రధాన సవాళ్లకు, సమస్యలకు ప్రత్యక్ష సమాధానం ఇస్తుంది. మహానగరం మొదలు కుగ్రామం వరకు అగ్రశ్రేణి విద్యను ఇంటింటికీ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ మధుకర్ రెడ్డి, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

కాజీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఫాతిమానగర్‌లో శుక్రవారం మదర్ థెరిసా వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఫాతిమా కెథడ్రిల్ చర్చి గురువు కాసు మర్రెడ్డి ఫాతిమా జంక్షన్‌లోని థెరిసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శాంతి దూతగా ఆమె పేదలకు చేసిన సేవలు గుర్తు చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, సెక్రటరీ టామీ, విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఆర్. రాజ్‌మోహన్ రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, క్రైస్తవ సంఘం నాయకులు టి. మత్యాస్ రెడ్డి, ఎం. జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


మదర్ థెరిసా విగ్రహానికి పూల మాలలు వేస్తున్న ఎమ్మెల్యే నాయిని

వినాయక.. సెలవిక..

- వరంగల్ మహానగరంలో ఘనంగా గణపయ్య నిమజ్జనోత్సవం
- వెల్లువలా తరలివచ్చిన గణేష్ విగ్రహాలు
- డప్పు చప్పుళ్లు, నృత్యాలతో భక్తుల సందడి


వేయిస్తంభాల గుడిలో గణేషుడికి చక్రస్నానం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగరంలో తొమ్మిది రోజులపాటు అత్యంత కోలాహలంగా వాడవాడలా ఆధ్యాత్మిక సందడి చేసిన శ్రీ మహాగణపతి నవరాత్రుల పర్వం నిమజ్జనోత్సవ సందడితో శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగి ఆడంబరంగా ముగిసింది. గణపతి బప్పా మోరియా, మంగళమూర్తి మోరియా, గణేష్ మహారాజ్‌కి జై.. అంటూ భక్తుల మిన్నంటే నినాదాలతో నగరమంతా మార్మోగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో భారీ గణపయ్యలను ఉంచి మంగళవాయిద్యాలు, యువకుల కేరింతలు, మహిళల కోలాటాలతో నిమజ్జనమంతా నేత్రపర్వంగా కొనసాగింది. మేయర్ గుండు సుధారాణి చిన్నవడ్డేపల్లి చెరువులో తొలి గణపతిని నిమజ్జనం చేసి లాంఛనంగా ఆరంభించగా, హనుమకొండ సిద్ధేశ్వరగుండంలో 4 గంటలకు తొలి నిమజ్జనం జరిగింది. అదే విధంగా పోలీసు పకడ్బందీ బందోబస్తు, అధికారగణం పర్యవేక్షణలో నిమజ్జనోత్సవ పర్వమంతా సందడిగా కొనసాగింది. అపార్ట్‌మెంట్ల నుంచి వినాయక ప్రతిమలను ఏకరూప దుస్తులతో ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

వీహెచ్‌పీ స్వాగతం

హనుమకొండ చౌరస్తా, కాజీపేట నిట్ ప్రాంతంలో విశ్వహిందూ పరిషత్, శ్రీ మహాగణపతి నవరాత్రి ఉత్సవ సమితి నాయకులు కసిరెడ్డి జైపాల్‌రెడ్డి, శ్రీరాం ఉదయ్‌కుమార్, వెలగందుల రాజు, నందాల చందర్‌బాబు తదితరులు, వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో చందర్‌బాబు, నాగరాజు, ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చే వినాయక ప్రతిమల నిర్వాహకులపై పూలవర్షం కురిపిస్తూ వారు చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ స్వాగతించారు. బహుమతులు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా ప్రస్తుతిస్తూ స్వాగతించారు. పోలీస్ యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యగా ట్రాఫిక్‌ను దారి మళ్లించింది. హనుమకొండ చౌరస్తాలో రాత్రి 8నుంచి 9గంటల ప్రాంతంలో కిక్కిరిసిన భక్తజన సమూహంతో నిమజ్జనోత్సవపర్వం ఆధ్యాత్మిక సందడి గుబాళించింది. అర్ధరాత్రి దాటినా నగరంలో రోడ్లపై జనసంచారం గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపు కొనసాగింది. నిమజ్జనోత్సవానికి ముందు తొలిపూజలు చేసి మళ్లీ వచ్చే ఏడాదికి ఇంకా సందడిగా రమ్మని వేడుకుంటూ మహిళలు మంగళహారతులతో గణపయ్య ప్రతిమలను నిమజ్జనోత్సవానికి తరలించారు. ఈసారి నగరం మొత్తంమీద నెలకొల్పిన 5వేల పైచిలుకు విగ్రహాలకు అర్ధరాత్రి వరకు 80శాతం విగ్రహాలు నిమజ్జనోత్సవం జరిగే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రాచీన కోనేరులో తొలి నిమజ్జనం

వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించిన వరసిద్ధి వినాయక నవరాత్రి వేడుకల పర్వంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అతి ప్రాచీన కోనేరులో గణపతి త్రిశూల స్నానమాచరింపజేసి పంచామృతాలతో హరిద్రాలేపనంతో అభిషేకించిన అనంతరం మధ్యాహ్నం అదే కోనేరులో గణపయ్య విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అంతకుముందు స్వామిని ఆలయం నుంచి రాగన్నదర్వాజ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠ శర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్, కాశీలింగాచారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రత్యేక రథంపై ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని నిమజ్జనోత్సవానికి తరలించారు.

● హనుమకొండ టౌన్ : బాలసముద్రంలోని వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు పూజలు నిర్వహించి శుక్రవారం అంగరంగ వైభవంగా గణపతులను నిమజ్జనానికి తరలించారు. సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లు, జంక్షన్ల వద్ద 40 మందికి పైగా పోలీసు సిబ్బందితో నిమజ్జన వేడుకల్లో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. న్యూ శాయంపేట చెరువు, పలు కాలనీలలో డీజేలు నిర్వహించకుండా నిర్వాహకులకు పలు హెచ్చరికలు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

● వడ్డేపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్లలో వినాయక చవితిని పురస్కరించుకొని విఘ్నాధిపతిని భక్తులు నవరాత్రులు కొలిచారు. శుక్రవారం వినాయక ప్రతిమలను శకటాలపై డప్పుచప్పుళ్లు, భాజాభజంత్రీలు, యువత కేరింతలు, నృత్యం, భజనలతో హనుమకొండ పట్టణం మార్మోగింది. హనుమకొండ 57వ డివిజన్ గోకుల్ నగర్ గజానన మండలి అధ్యక్షుడు బంక సతీష్ యాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేల్పుల లక్ష్మణ్, బొల్లు భాస్కర్, ఎల్లావుల అనిల్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమను ఊరేగించి హనుమకొండలోని సిద్ధేశ్వరుడి గుండంలో నిమజ్జనం చేశారు. హనుమకొండ 58వ డివిజన్ రాఘవేంద్ర నగర్ ఫేస్ -2లో వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మండల స్నేహిత- రాజు దంపతులు రూ. 11,116లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గణపతి యూత్ అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వినాయక ప్రతిమను వరంగల్ నిట్ ప్రాంతంలోని బంధం చెరువులో నిమజ్జనం చేశారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ దేవరాజ్ కాలనీలో వినాయక విగ్రహాలను శకటాలపై తరలించి గోపాల్‌పూర్‌లోని ఆరకల సాయికుంటలో నిమజ్జనం చేశారు. గోపాల్‌పూర్ బృందావన కాలనీ రోడ్డు నంబర్ -2లో, పరిమళ కాలనీలో, 57వ డివిజన్ స్నేహనగర్‌లో,వికాస్ నగర్‌లో, ఇందిరా నగర్‌లో వినాయక విగ్రహాలను ఊరేగించి బంధం చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. 60వ డివిజన్ వడ్డేపల్లి చెరువు కట్ట శివాలయం వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని పొలిమేరలోని చెరువులో నిమజ్జనం చేశారు.


గణేష్ నిమజ్జనంలో భాగంగా హనుమకొండ చౌరస్తాలో నృత్యాలు చేస్తున్న యువతీ, యువకులు


సిద్దాపూర్‌లో వినాయకుడిని దర్శించుకుంటున్న చినజీయర్ స్వామి శిష్యులు శ్రీరామానుజన్ స్వామి

● హనుమకొండ చౌరస్తా: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న బొజ్జగణపయ్యను భక్తి శ్రద్ధలతో నిమజ్జనానికి తరలిచేందుకు నగరంలోని యువతీ యువకులు, భక్తులు శుక్రవారం శోభాయాత్రను చేపట్టారు. ఉదయం 11గంటల నుంచే హనుమకొండ చౌరస్తా మీదుగా పద్మాక్షికాలనీ సిద్ధేశ్వర గుండంలో గణేషుడిని నిమజ్జనం చేయడానికి నగరంలోని పలు కాలనీలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. హనుమకొండ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్, హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పద్మాక్షిగుండంలో నిమజ్జనానిక తరలివెళ్లే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా తరళివచ్చే గణనాథులకు స్వాగతం పలికారు.


వివేకానంద కాలనీలో శోభాయాత్రకు సిద్ధమవుతున్న మహిళలు

● హసన్‌పర్తి: మండలంలోని ఎర్రగట్టుగుట్ట మంత్రపురి కాలనీ, గోల్డెన్ యూత్ మున్నూరు కాపు సంఘం వినాయక మండపంలో వినాయక మండలి కమిటీ సభ్యులు నిర్వహించిన లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రపురి కాలనీకి చెందిన గుంజి శేషు వేలం పాటలో పాల్గొని రూ.25వేలకు గణేష్ లడ్డూను గెలుచుకోగా హసన్‌పర్తికి చెందిన తోట సంతప్ రూ.51,116లకు లడ్డూ వేలం పాటను దక్కించుకొని గణేష్ లడ్డూను కైవసం చేసుకున్నారు. కాగా, మండలంలోని సిద్ధాపూర్‌లో 1980లో దూల్‌పేట్ యూత్ అసోసియేషన్ స్థాపించిన వినాయకుడి విగ్రహాన్ని శుక్రవారం చినజీయర్ స్వామి శిష్యుడు రామానుజన్ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యూత్ సభ్యులను సన్మానించి షీల్డ్‌లను అందజేశారు.

● కాజీపేట: మండల కేంద్రంలో శుక్రవారం గణపతుల నిమజ్జనం ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచే బంధం చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. తహసీల్దార్ బావుసింగ్, ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, మెడికల్, మైనింగ్, మున్సిపల్ సిబ్బంది 200 మంది విధులు నిర్వర్తించారు. కాజీపేటలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన 400 విగ్రహాలను భక్తులు పూజలు చేసి, బ్యాండ్ మేళాలలో ర్యాలీలు తీశారు. అభయాంజనేయస్వామి ఆలయం జూబ్లీ మార్కెట్ లడ్డూను బానోత్ బాలు-జీజా దంపతులు రూ. 25,516 వేలం పాడి దక్కించుకున్నారు. టీ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రామవేందర్ తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న గణేశ్‌ను కుటుంబంతో కలిసి చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జై.. బోలో గణేశ్ మహరాజ్‌కు జై.. అంటూ కాజీపేట పురవీధుల్లో భక్తుల పెద్ద పెట్టున చేసిన నినాదాలు మారుమోగాయి.

● రాంనగర్: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో ఉన్న డ్రీమ్ హోమ్స్‌లో లడ్డు వేలానికి పలువురు పోటీపడ్డారు. చివరికి పడిదల నవ జీవన్‌రావు, రచన లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాల రవీందర్, రాజేశ్, పొన్నాల శ్రీకాంత్, రవికిరణ్, వెంకటేశ్వర్లు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు. లడ్డు కైవసం చేసుకున్న నవ జీవన్‌రావుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లడ్డు తనను వరించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

● మడికొండ: లంబోదరుడి నిమజ్జనం మడికొండలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. గణేషుడిని అలంకరించిన వాహనాల్లో ఊరేగించారు. బ్యాండు మేళాలు, డప్పుల దరువులతో భక్తులు గణపయ్యను కీర్తిస్తూ స్థానిక సల్ల చెరువు వద్దకు చేర్చారు. డీఎంహెచ్‌వో అప్పయ్య, కార్పొరేటర్ సరోజన కరుణాకర్, ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, బీజేపీ నాయకులు దువ్వ నవీన్, పిట్టల రమేష్‌లతో కలిసి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్సై పెగడ రాజ్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు, భక్తులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ కార్యాలయంలో వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

● హనుమకొండ టౌన్ : హనుమకొండ బాలసముద్రం లోని బీఆర్ఎస్ కార్యాలయంలో వినాయక నిమజ్జన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎ మ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్- రేవతి భాస్కర్ దంపతులు కా ర్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి సీడ్ గణేష్ ప్రతిమను నిమజ్జనం చేశారు. అలాగే బాలసముద్రంలోని నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లు, జంక్షన్ల వద్ద 40 మందికిపైగా పోలీసు సిబ్బందితో నిమజ్జన వేడుకల్లో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. న్యూ శాయంపేట చెరువు, పలు కాలనీలలో డీజేలు నిర్వహించకుండా నిర్వాహకులకు పలు హెచ్చరికలు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


భీమారం బ్యాంకు కాలనీలో లడ్డు వేలం


మడికొండ సల్ల చెరువులో గణేషుడిని నిమజ్జనం చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య, సీఐ కిషన్ తదితరులు


గణపతిని నిమజ్జనం చేస్తున్న టీ రైల్వే జేఏసీ చైర్మన్ రాఘవేందర్


లడ్డును దక్కించుకొని తలపై ఎత్తుకున్న నవ జీవన్‌రావు

నిమజ్జన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా 12 ప్రదేశాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. మూడు షిఫ్టుల వారిగా వైద్యాధికారులు, సిబ్బందిని అవసరమైన మందులతో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. 108 అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బంధం చెరువు, సిద్ధేశ్వరుడి గుండం, హసన్‌పర్తి, కటాక్షపూర్ పెద్ద చెరువు, ప్రగతి సింగారం బ్రిడ్జి, గుండ్ల సింగారం చెరువు, కమలాపూర్ ప్రాంతాలను పరిశీలించి 180 మంది వైద్య సిబ్బందిని డిప్యూటేషన్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్వాతి, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ నవీన్, డాక్టర్ కవిత, డాక్టర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు సుబేదారి ఎస్సై సుమన్ తెలిపారు. హనుమకొండ బస్‌డిపో సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం గణేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారం రావడంతో ఎస్సై ప్రకాష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది గణేష్ నివాసంలో తనిఖీలు చేపట్టగా మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. కాగా, అక్రమంగా మద్యం విక్రయించిన గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

మాల మహానాడు పశ్చిమ ఇన్‌చార్జిగా శ్రీనివాస్



వడ్డేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ మాల మహానాడు పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జిగా హనుమకొండ 57వ డివిజన్ స్నేహనగర్‌కు చెందిన పనికల శ్రీనివాస్ నియమితులయ్యారు. జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టుగుట్ట కాకతీయ కెనాల్ సమీపంలోని శ్మశానవాటిక ప్లాట్‌ఫామ్‌ను కూల్చివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని పద్మావతి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై, ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సుంకరి రవికుమార్ తెలిపారు. కాలనీ ప్రతినిధులు పావురాల సమ్మయ్య, పాడి గణపతిరెడ్డి, మూల దేవేందర్‌గౌడ్, నంది శ్రీనివాస్, చకిలం చంద్రశేఖర్, సుభాష్, సంపత్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులకే గౌరవం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులకు లభించే గౌరవం మరెవ్వరికీ లభించదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులతో కలిసి టీచర్స్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మానసిక దివ్యాంగ చిన్నారులు ఉపాధ్యాయుల వేషాధారణలో అలరించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య ఉపాధ్యాయులు, సిబ్బందికి బహుమతులు అందించారు. మానసిక వికలాంగుల కోసం కేంద్రప్రభుత్వం ఐరీస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని కోరారు. వారి భద్రత కోసం ఐరీస్ ఆధారిత బయోమెట్రిక్‌సిస్టం అమలుపై మరోసారి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మ, ఫౌండర్ బండ రామలీల, ఈసీ మెంబర్లు సదానందం, కల్యాణ్, ప్రముఖ ఇన్‌ఫ్యూయెన్సర్ లోకేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిస్తున్న ఎంపీ కడియం కావ్య

గురువులకు అపూర్వ సత్కారం

హనుమకొండ కల్చరల్: భారత మాజీ రాష్ట్రపతి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని అనేక ప్రాంతాల్లో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులను సత్కరించగా అనేక ఇతర స్వచ్ఛంద సంస్థలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కూడా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించి పూజించారు. రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు పూల సారంగపాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ దహగం సాంబమూర్తి, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గిరిజా మనోహర్‌బాబు తదితర 20 మంది రిటైర్డ్ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా పైడిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 1968-69 నుంచి 1978-79 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హనుమకొండలో జరిగింది. ఈ సందర్భంగా 11 మంది గురువులను ఘనంగా సత్కరించారు.

● హసన్‌పర్తి: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 20 మంది అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఎంఈవో ఎ.శ్రీనివాస్, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఎమ్మార్పీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు. హసన్‌పర్తి కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వాకర్స్ అధ్యక్షుడు నాగమల్ల సుధీర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వాకర్స్ పాల్గొన్నారు. ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కేంద్రంలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

● మడికొండ: రాధాకృష్ణన్ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మడికొండ విలేజ్ పోలీస్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ గుండబత్తిన జయరాజ్ స్థానిక విశ్రాంత ఉపాధ్యాయులు పులియా, రాజేంద్రప్రసాద్ తదితరులను కలిసి శాలువాలతో సన్మానించారు. పాదాభివందనం చేసి గురుభక్తిని చాటుకున్నారు. అలాగే పలువురు విద్యార్థులు తమ ఉపాధ్యాయులను కలిసి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

● హనుమకొండ టౌన్: పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవిత పాఠాలు నేర్పేది గురువులేనని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తన గురువు రావిశెట్టి రాజేశ్వర్‌రావును హనుమకొండ వడ్డేపల్లి టీచర్స్ కాలనీలోని ఇంటికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు.

సేవాపక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

శంభునిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీజేపీ శ్రేణులకు, మోదీ అభిమానులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచన మేరకు సేవా పక్షం కారక్రమం వరంగల్ జిల్లా కన్వీనర్‌గా కనుకుంట్ల రంజిత్, కోకన్వీనర్లుగా కర్ని రవీందర్, కొంతం సంగీత్‌లను నియమించామని చెప్పారు. సేవా పక్షంలో భాగంగా స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరాలు, పేదలకు, దివ్యాంగులకు సహకరించడం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా సేవా పక్షం కార్యాచరణను కార్యకర్తలకు వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



వంటిల్లు

పుల్లటి వామన చింతకాయలను చూడగానే నోరూరని వారుండరు. వాటితో పప్పు, పచ్చడి చేసుకుని ఇష్టంగా తింటూ ఉంటాం. అలాంటి వామన చింతకాయలతో చేసే రుచికరమైన వెరైటీ వంటకాలు మీ కోసం...

వామన చింతకాయలతో వెరైటీగా..!

చింతకాయ పులిహోర

కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయలు- 100 గ్రాములు, పొడి పొడిగా ఉడికించిన అన్నం- మూడు కప్పులు, పచ్చి మిర్చి- పది, అల్లం- చిన్న ముక్క, పసుపు- అర చెంచా, ఉప్పు- తగినంత, నూనె- మూడు చెంచాలు, పల్లీలు- తగినన్ని, మినప్పప్పు- ఒక చెంచా, పచ్చి శనగపప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- రెండు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, ఇంగువ- చిటికెడు, జీడిపప్పు- కొద్దిగా, కరివేపాకు- కొద్దిగా, నెయ్యి- అర చెంచా

తయారీ విధానం

- ముందుగా చింతకాయలను నీళ్లతో బాగా కడగాలి. తరవాత తొడిమలు తీసి చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో చింతకాయల ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం, పసుపు, ఉప్పు, కొన్ని నీళ్ల చుక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. పల్లీలు, జీడిపప్పు వేసి దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి. తరవాత ఆ నూనెలో ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న చింతకాయ పేస్టు కూడా వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు వేగనిచ్చి నెయ్యి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- వెడల్పాటి గిన్నెలోకి ఉడికించిన అన్నం తీసుకోవాలి. అందులో వేయించిన పల్లీలు, జీడిపప్పు, చింతకాయ మిశ్రమం వేసి బాగా కలపాలి. ఉప్పు సరి చూసుకోవాలి. అంతే కమ్మని చింతకాయ పులిహోర రెడీ..!

చిట్కాలు
- చింతకాయలకు ఉన్న పీచును పూర్తిగా తీసివేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అప్పుడే పులిహోర రుచిగా ఉంటుంది.
- ఇష్టమైతే కొద్దిగా నువ్వుల పొడి కలుపుకోవచ్చు.

చింతకాయ చికెన్

కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయాలు- 100 గ్రాములు, బోన్‌లెస్ చికెన్- పావు కేజీ, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- నాలుగు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, కారం- తగినంత, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- ఒక చెంచా, గరం మసాల పొడి- ఒక చెంచా, కొత్తిమీర- కొద్దిగా, నూనె- మూడు చెంచాలు


తయారీ విధానం

- ఉల్లిపాయను సన్నగా తరిగి పెట్టుకోవాలి. చింతకాయలను శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చింతకాయలు వేసి అవి మునిగేవరకు నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. చింతకాయలను చేత్తో గట్టిగా పిండి పిప్పిని తీసివేసి గుజ్జును సిద్ధం చేసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మిర్చి ముక్కలు, పసుపు, కారం, ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. అయిదు నిమిషాల తరవాత చింతకాయ గుజ్జు వేసి కలపాలి. ఇది రెండు నిమిషాలు ఉడికిన తరవాత చికెన్ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న చింతకాయ చికెన్ వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

వామన చింతకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ని నివారిస్తాయి. వీటిని తినడం వల్ల గర్భిణుల్లో వాంతులు, వికారం తగ్గుతాయి. మహిళల్లో రుతు సమస్యలు రావు. వామన చింతకాయలతో చేసిన వంటకాలు తినిపిస్తే చిన్న పిల్లలకు కడుపులో నులిపురుగుల సమస్య తీరుతుంది.



చిట్కాలు
- కూర ఉడుకుతున్నప్పుడు కొద్దిగా జీడిపప్పు, పల్లీలు, గసగసాల పేస్టు వేసి కలిపితే కమ్మటి రుచి వస్తుంది.
- చికెన్ ముక్కలను తగుమాత్రం ఉడికిస్తే తినడానికి బాగుంటుంది.



చింతకాయ పప్పుచారు

కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయలు- 150 గ్రాములు, కందిపప్పు- 200 గ్రాములు, పసుపు- అర చెంచా, కరివేపాకు- కొద్దిగా, పచ్చిమిర్చి- అయిదు, నూనె- మూడు చెంచాలు, కారం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఎండు మిరపకాయలు- మూడు, ఉల్లిపాయలు- రెండు, ఇంగువ- పావు చెంచా, టమాటా- ఒకటి, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

- చింతకాయలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి చింతకాయలు వేసి అవి మునిగేవరకు నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి చేత్తో పిసికి రసం తీసుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో కందిపప్పు వేసి ఒక గ్లాసు నీళ్లు పోయాలి. తరవాత పావు చెంచా పసుపు, పచ్చిమిర్చి చీలికలు, ఒక చెంచా నూనె వేసి మూతపెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.

తరవాత కుక్కర్‌ను స్టవ్ మీద నుంచి దించి అది చల్లారాక మూత తీసి అందులో చింతకాయ రసం వేసి బాగా కలపాలి. తరవాత కారం, ఉప్పు, మరో రెండు గ్లాసుల నీళ్లు పోసి కలపాలి.

- స్టవ్ మీద మందపాటి పెద్ద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఎండు మిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పప్పు-చింతకాయ రసం మిశ్రమాన్ని పోసి బాగా కలపాలి. పెద్ద మంటమీద పది నిమిషాలు మరిగించాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి.

చిట్కాలు
- కందిపప్పును పావుగంటసేపు నీళ్లలో నానబెడితే మెత్తగా ఉడుకుతుంది.
- ఆలుగడ్డ, సొరకాయ, కేరట్, బెండకాయ, మునక్కాడలు, ముల్లంగి లాంటి కూరగాయల ముక్కలను విడిగా ఉడికించి ఇందులో కలుపుకోవచ్చు.

భోజన కుతూహలం

రాతిబండలపై, నీటి వనరులు తక్కువగా ఉన్న పొడిబారిన నేలల్లో ఆకుజెముడు పొదలు పెరుగుతాయి. ఇది ఆముదం జాతికి చెందిన మొక్క. ఆకుజెముడును సంస్కృతంలో సేహుండా అని పిలుస్తారు. ఆయుర్వేదంలో దీనికి స్నుహి అనే శాస్త్రీయనామం ఉంది. తెలుగులో దీనిని ఆకుజెముడు లేదా కాడజెముడు అని పిలుస్తారు. ఆకుజెముడు ఆకులు, వేళ్లు, కాండం, కాండం నుండి వచ్చే పాలతో మధుస్నుహీరసాయనం లాంటి ఔషధాలు తయారవుతాయి. ఆకుజెముడు ఆకులు చాలా తీక్ష స్వభావం కలిగినవి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి ప్రయోజనాలివే..

ఆకుజెముడు ఆకులతో ఆహార ఔషధం

- ఆకుజెముడు ఆకుల రసం లేదా గుజ్జు రుచిని పుట్టిస్తాయి. అజీర్ణాన్ని పోగొడతాయి. పొట్ట ఉబ్బరాన్ని తగ్గిస్తాయి.
- కీళ్లవాతం, సయాటికా, నడుము నొప్పి, మెడనొప్పి మొదలైన వాటికి ఈ ఆకులు మంచి మందు. ఆకుజెముడు ఆకులను వేడి చేసి నెప్పి ఉన్న ప్రాంతంలో కట్టు కడితే ఉపశమనం లభిస్తుంది.
- ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుకోవటం, దగ్గు, జలుబు మొదలైన వ్యాధులకు ఇది మంచి మందు.
- చెవికి సంబంధించిన నరాల జబ్బులు, శరీరం వివిధ భాగాల్లో వచ్చే వాపులు, గడ్డలను తగ్గించటానికి కూడా ఈ ఆకులు ఉపకరిస్తాయి. ఈ ఆకుల రసాన్ని చెవిలో వేస్తే నెప్పి వెంటనే తగ్గుతుంది.
- బొల్లి వంటి చర్మవ్యాధుల నివారణకు ఇది గొప్ప మందు.
- లేత ఆకుల నుంచి పాలు కారుతూ ఉంటాయి. ఈ పాలు తీవ్రమైన మలబద్ధకం, రకరకాల విషప్రభావాలకు మంచి మందు.

- ఆకుజెముడు ఆకులను ముక్కలుగా కోసి మజ్జిగలో ఉడికించి.. పచ్చడిగా చేసుకొని తినవచ్చు.
- ఈ ఆకులను ఎండబెట్టి పొడిచేసి గ్రీన్‌టీ మాదిరిగా తాగవచ్చు.
- ఈ ఆకులు వేడి చేస్తాయి. అందువల్ల వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.

• గంగరాజు అరుణాదేవి



సాధారణంగా మనం అరటిపండు తిని దాని తొక్కను పడేస్తూ ఉంటాం. అలాకాకుండా ఈ తొక్కతో ఫేస్‌ప్యాక్‌లు తయారుచేసుకుని వాడితే ముఖసౌందర్యం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆ ఫేస్‌ప్యాక్‌ల తయారీ గురించి తెలుసుకుందాం...

అరటిపండు తొక్కతో ఇలా చేస్తే...

- ముందుగా అరటిపండు తొక్కను పసుపు నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత చిన్న ముక్కలుగా తుంచి మిక్సీలో వేసి కొన్ని నీళ్ల చుక్కలు చిలకరించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టుని గిన్నెలోకి తీసుకోవాలి. అందులో అరచెంచా బియ్యప్పిండి, అర చెంచా చక్కెర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి మెల్లగా మర్దన చేయాలి. అరగంట తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. అరటిపండుతొక్క... చర్మానికి తేమను అందిస్తుంది. దీంతో ముఖం మీద ఏర్పడిన నల్ల మచ్చలు, ఎండ వల్ల వచ్చే టానింగ్ లాంటివి తగ్గిపోతాయి. చక్కెర... మృత కణాలను తొలగించి చర్మాన్ని మెరిపిస్తుంది. బియ్యప్పిండి చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది.



- అరటి తొక్క పేస్టులో ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తరవాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే ముఖం తాజాగా మెరుస్తూ కనిపిస్తుంది.
- అరటి తొక్క పేస్టులో రెండు చెంచాల పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మ రంధ్రాలు పరిశుభ్రమవుతాయి. మొటిమలు, గుల్లలు రావు. చర్మం ఛాయగా మృదువుగా మారుతుంది.
- అరటి తొక్క లోపలి భాగంతో ముఖాన్ని కింది నుంచి పైకి మెల్లగా రుద్దాలి. పావుగంట తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేసుకోవాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తూ ఉంటే నుదుటి మీద, పెదవుల చుట్టూ ఏర్పడిన గీతలు, ముడుతలు మాయమవుతాయి. చర్మం బిగుతుగా ప్రకాశవంతంగా మారుతుంది.

అమ్మగా.. 'అమృతం' పంచుతున్నారు!




అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి పాలే ఆహారం. తల్లీబిడ్డల అనుబంధాన్ని పెంచి పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి కూడా తల్లి పాలే దోహదం చేస్తాయి. అలాంటి తల్లి పాలను ఎన్ఐసీయూ శిశువుల కోసం దానం చేస్తూ తన్న ఉదారతను చాటుకుంటున్నారు హైదరాబాద్‌కు చెందిన సమీరా షెరీఫ్. ఇటీవల ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చారు. బిడ్డ పుట్టిన తరవాత 50 రోజుల వ్యవధిలో 13 లీటర్ల చనుబాలను ఆమె దానం చేశారు తల్లిపాల ఉత్పత్తి, నిల్వ, దానం చేసే విధానాల గురించి ఎన్నో ఆసక్తికరమై అంశాలను ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

"సాధారణంగా బిడ్డ పుట్టిన తరవాత కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు... తల్లి చుట్టూ చేరి "పాలు వస్తున్నాయా? బిడ్డకు పాలు సరిపోతున్నాయా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుంటారు. అలా అడగడం మంచిది కాదని నా అభిప్రాయం. స్త్రీ శరీరం ఒక అద్భుతం. అందుకే భగవంతుడు పిల్లలను కనే బాధ్యతను ఆడవారికి అప్పగించాడు. పాలకోసం బిడ్డ ఏడిస్తే వెంటనే తల్లి మెదడుకు సంకేతాలు అందుతాయి. మెల్లగా రొమ్ములు పాలతో నిండుతాయి. బిడ్డ పుట్టిన తరవాత మొదటి రెండు రోజులు పాలు తక్కువగా వస్తాయి. క్రమంగా బిడ్డ తాగుతున్న కొద్దీ పాలు ఎక్కువగా వస్తుంటాయి. బిడ్డకు పాలు సరిపోకపోవడం అనేది ఉండదు.

ఆలోచన ఇలా వచ్చింది...

కొవిడ్ సమయంలో మా పెద్దబ్బాయి పుట్టాడు. పుట్టిన వెంటనే బాబుకు కామెర్లు వచ్చాయి. చికిత్స చేస్తున్నప్పటికీ కామెర్లు తగ్గకపోవడంతో "బాబుకి తల్లిపాలు సరిపోతున్నాయా?" అని వైద్యులు ప్రశ్నించారు. బిడ్డ కడుపు నిండా పాలు తాగితేనే మూత్రం ద్వారా కామెర్లు తొలగిపోతాయని చెప్పారు. ఫొటోథెరపీ చేసి బాబుకి తల్లి పాలు సరిపోవడం లేదని తేల్చారు. తల్లి పాలలో కొన్ని ఫార్ములా పాలు కలిపి బాబుకి పట్టించారు. బాబు వెంటనే వాంతి చేసుకున్నాడు. వాడికి తల్లిపాలు మాత్రమే కావాలని నాకు అర్థమయింది. 'పాలు ఎక్కువగా కావాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి?' అనే విషయం గురించి అంతర్జాలంలో వెతికి, పుస్తకాలు చదివి చాలా విషయాలు తెలుసుకున్నాను. అలాగే బంధువుల్లో పెద్దవారిని అడిగి కొంత సమాచారం సేకరించాను. అలా నాకు నేనుగా ఒక పద్ధతిని అనుసరించడం ప్రారంభించాను. క్రమంగా పాలు పెరిగాయి. బాబు తాగిన తరవాత కూడా చాలా పాలు మిగిలి ఉండేవి. వాటిని అలాగే ఉంచితే రొమ్ములు బరువెక్కి నొప్పిగా అనిపించేది. మామూలుగా తల్లులందరూ ఇలా అదనంగా ఉన్న పాలను బాత్‌రూమ్‌లో పిండేస్తుంటారు. లేదంటే బిడ్డకు స్నానం చేసే నీటిలో కలిపేస్తుంటారు. ఎంతో అమూల్యమైన తల్లి పాలను వృథా చేయడానికి నాకు మనస్కరించలేదు. అప్పుడే చనుబాలను దానం చేయాలనే ఆలోచన వచ్చింది. సాధారణంగా ఎన్‌జీఓ సెంటర్లకు వెళ్లి తల్లులు పాలు దానం చేస్తుంటారు. నాకు హైదరాబాద్‌లో అలాంటి వెసులుబాటు కనిపించలేదు. కానీ నిలోఫర్ ఆసుపత్రిలోని మిల్క్ బ్యాంక్‌లో దానం చేయవచ్చని తెలిసింది. అప్పుడు రెండు నెలల వ్యవధిలో ఎనిమిది లీటర్ల తల్లిపాలను దానం చేశాను. ప్రస్తుతం అంకుర, రెయిన్‌బో ఆసుపత్రుల్లో కూడా తల్లిపాలను దానం చేసే వీలుంది. ఇప్పుడు రెండో బాబు పుట్టిన తరవాత 27 రోజుల వ్యవధిలోనే ఆరు లీటర్ల పాలను నిల్వ చేశాను. వీటితో కలిపి 50 రోజుల్లో 13 లీటర్ల చనుబాలను రెయిన్‌బో ఆసుపత్రిలో దానం చేశాను. బిడ్డ పుట్టిన తరవాత మొదటి వారం కొలెస్ట్రమ్ విడుదలవుతుంది. దాన్నే 'ముర్రుపాలు' అని కూడా అంటారు. వాటిలో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. ఈ పాలను కూడా విడిగా తీసి ఆసుపత్రిలో ఇచ్చాను. ఇలా తల్లులు దానం చేసిన పాలను 'ఎన్ఐసీయూ' (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఉన్న శిశువుల కోసం వినియోగిస్తారు."

> సమీర... ప్రముఖ తెలుగు నటి సన కోడలు. ఆమె భర్త సయ్యద్ అన్వర్ అహ్మద్. వీరికి అర్హాన్, అమీర్ అనే ఇద్దరు అబ్బాయిలున్నారు. సమీర కూడా పలు తెలుగు, తమిళ సీరియల్స్‌లో నటించారు. 'ఆడపిల్ల', 'అభిషేకం', 'భార్యామణి', 'మూడుముళ్ల బంధం', 'ప్రతిబింబం', 'మంగమ్మగారి మనవరాలు' సీరియల్స్ ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. సమీర సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటారు. తల్లిగా తన అనుభవాలను, బిడ్డలతో అనుబంధం, కుటుంబ సభ్యుల ప్రేమానురాగాలను ప్రతిబింబించే పలు వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటారు. చనుబాలను దానం చేసే విధానాన్ని వివరిస్తూ చేసిన వీడియోకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వచ్చింది.



నేటి తల్లులు ఇవి తెలుసుకోవాలి...

పాలు తాగిన తరవాత కూడా బిడ్డ ఏడుస్తూ ఉంటే పాలు సరిపోవడం లేదనుకొని ఫార్ములా పాలు పట్టాలనే ఆలోచన చేస్తూ ఉంటారు. ఫార్ములా పాలు మంచివి కాదని నేను చెప్పను కానీ వాటి అవసరం బిడ్డకు రాదని నా అభిప్రాయం. బిడ్డకు కావాల్సినన్ని పాలు ఉత్పత్తి చేసే శక్తి తల్లికి ఉంటుంది. గ్యాలెక్ట్ గ్రాన్యూల్స్ అనే పౌడర్ మార్కెట్లో దొరుకుతుంది. దీన్ని ఒక చెంచా చొప్పున ఒక గ్లాసు పాలలో కలుపి... ఉదయం, సాయంత్రం తాగితే చనుబాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాని రుచి చాలా బాగుంటుంది. తల్లి పాలలో యాంటీబాడీలు ఉంటాయి. వీటివల్లనే పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలకు ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే వాటిని నిరోధించే విధంగా తల్లిపాలు ఉత్పత్తి అవుతాయి. పిల్లలకు ఉదయం, సాయంత్రం, రాత్రివేళల్లో ఉండే అవసరాలకు తగ్గట్టుగా చనుబాలు వస్తుంటాయి. పాలు రాకపోయినా నిపుల్‌ను బిడ్డ నోట్లో ఉంచితే కొంతసేపటికి పాలు ఉత్పత్తి అవుతాయి. రొమ్ములు పెద్దగా ఉన్నా చిన్నగా ఉన్నా; నిపుల్స్ చదునుగా ఉన్నా, కాస్త ఎత్తుగా ఉన్నా పాల ఉత్పత్తికి అవరోధాలు కావు. నిపుల్స్ చదునుగా ఉంటే మాత్రం నిపుల్ సక్కర్ వాడడం మంచిది. నిపుల్‌తోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కూడా కొద్దిగా బిడ్డ నోట్లో ఇమిడ్చి, సరైన విధానంలో బిడ్డ పాలుతాగేలా తల్లులు చూసుకోవాలి. పిల్లలకు కావాల్సినప్పుడల్లా ఒక రొమ్ములో పాలిస్తూ అదే సమయంలో రెండో రొమ్మునుంచి పాలు తీసి భద్రపరచి దానం చేస్తే పది మంది పిల్లలకు సహాయం చేసినవారవుతారు."

• పి. హిమబిందు

పిల్లలు అబద్ధాలు చెబుతున్నారని తెలిసినప్పుడు తల్లిదండ్రులు ఆందోళన చెందడం సహజం. అలాంటప్పుడు తల్లిదండ్రులు శాంతంగా వ్యవహరిస్తూ పిల్లలను సరైన దారిలోకి ఎలా తీసుకురావాలో తెలుసుకుందాం..

పిల్లలు అబద్ధాలు చెబుతున్నారా..?



- పిల్లలు నిజం చెప్పలేదని తెలిసినప్పుడు వెంటనే వారిమీద కోపంతో అరవకూడదు. భయపెట్టకూడదు. ప్రేమగా మాట్లాడుతూ అసలు విషయం రాబట్టే ప్రయత్నం చేయాలి.
- ఒక్కోసారి పిల్లలు తప్పు చేసినందుకు భయపడి అబద్ధం చెబుతారు. కొన్ని సందర్భాల్లో చేసిన తప్పు అమ్మానాన్నలకు తెలియకూడదనుకుంటారు. పిల్లలు ఏ ఉద్దేశంతో అబద్ధమాడుతున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.
- పిల్లలు అబద్ధం చెప్పారని తెలియగానే వాళ్లని దగ్గర కూర్చోపెట్టుకుని నిజం చెప్పడం ఎంత ముఖ్యమో వివరించి చెప్పాలి. అబద్ధాలు చెప్పడం వల్ల కుటుంబ సభ్యులకు వారిమీద నమ్మకం పోతుందని తెలియజెప్పాలి.
- పిల్లలు అనుకోకుండా చేసే తప్పులకు కోప్పడి బెదిరిస్తే వెంటనే అబద్ధాలు చెప్పడం నేర్చుకుంటారు. అందుకే పిల్లల మీద అనవసరంగా అరవకూడదు. వాళ్లు ఏదైనా పొరబాటు చేస్తే మరోసారి అలా చేయవద్దని మెల్లగా నచ్చచెప్పాలి.
- కుటుంబంలో పెద్దలను చూసే పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో పెద్దలు ఏ చిన్న అబద్ధం కూడా చెప్పకూడదు.

పండ్లు, కూరగాయలను ఎలా శుభ్రం చేయాలంటే..!



మనం బజారు నుంచి తెచ్చుకున్న పండ్లు, కూరగాయలు తాజాగా కనిపిస్తున్నప్పటికీ వాటి మీద పురుగు మందుల అవశేషాలు, కొన్ని రకాల రసాయనాలు, దుమ్ము, ధూళి, క్రిమికీటకాల గుడ్లు లాంటివి ఉండవచ్చు. వీటివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయి. అందుకే పండ్లను తినేముందు, కూరగాయలను వండేముందు సరైన విధానంలో శుభ్రం చేయాలంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- కూరగాయలను ముందుగా ఉప్పు, పసుపు కలిపిన నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాతనే ముక్కలుగా తరగాలి. ఒకవేళ వాటిని నిల్వ చేసుకోవాలనుకుంటే మాత్రం ముందుగా కడగకూడదు. అలా కడిగితే తేమ వల్ల బ్యాక్టీరియా పెరిగి కూరగాయలు తొందరగా పాడవుతాయి.
- ఆకుకూరలకు ముందుగా కాడలు తుంచి శుభ్రం చేయాలి. తరవాత ఆ ఆకులను జల్లిబుట్టలో వేసి పంపు నీళ్ల ధార కింద పెట్టి కడగాలి. ఇసుక, మట్టి లాంటివి పూర్తిగా పోయే వరకూ ఆకులను చేత్తో రుద్దుతూ కడగాలి. వర్షాకాలంలో మాత్రం ఆకులను కొద్దిసేపు ఉప్పునీటిలో నానబెట్టడం మంచిది.
- క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లను ఉప్పు నీళ్లలో పావుగంటసేపు ఉంచితే వాటిలోని పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- బంగాళదుంప, చామదుంప, చిలకడ దుంప, కంద, ముల్లంగి, అల్లం, కేరట్‌లను మెత్తని బ్రష్ లేదా స్పాంజ్‌తో రుద్దుతూ కడిగితే వాటికి అంటుకుని ఉన్న మట్టి, బ్యాక్టీరియా తొలగిపోతాయి.

'టారిఫ్' బాధిత పరిశ్రమలకు కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: అమెరికా అడ్డగోలు సుంకాలతో ఇబ్బందులు పడుతున్న భారత పరిశ్రమలు, ఎగుమతిదారులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం. ఎగుమతులపై ఆధారపడిన సంస్థలకు సులువుగా రుణాలు, మూల ధనం అందేలా చూడటం, కొత్త మార్కెట్లను అన్వేషించుకునేందుకు తోడ్పడటం వంటి చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది. కరోనా సమయంలో కుదేలైన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రూ.20 లక్షల కోట్లతో ఇచ్చిన రిలీఫ్ ప్యాకేజీ తరహాలో ఈ ప్యాకేజీ ఇవ్వనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. సుంకాల దెబ్బకు ఎగుమతులు తగ్గిన సంస్థలు మూతపడకూడదని, ఉద్యోగాలేవీ పోకుండా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50శాతం సుంకాలు విధించడంతో.. మన దేశం నుంచి అమెరికాకు చేసే ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర పరికరాలు, రొయ్యలు, రత్నాలు-ఆభరణాల రంగాల పరిశ్రమలకు దెబ్బతగిలింది. కాగా, క్రెమ్లిన్‌కు భారత్ శుద్ధి కేంద్రంగా ఉపయోగపడుతోందంటూ ట్రంప్ వాణిజ్య సలహాదారు నవారో ఇటీవల చేసిన వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. నవారో వ్యాఖ్యలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జైస్వాల్ చెప్పారు. అమెరికాతో సంబంధాలు తమకెంతో ముఖ్యమని, రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయన్నారు.

భారత్, రష్యాను చైనాకు కోల్పోయాం

(మొదటి పేజీ తరువాయి)

అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందన కోరగా.. దీనిపై తాము తక్షణం స్పందించదల్చుకోలేదని చెప్పారు. కాగా.. యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజాల అధిపతులకు ట్రంప్ గురువారం వైట్‌హౌస్‌లో విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్‌పిచాయ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. "ఈ టేబుల్ వద్ద ఉన్నవారంతా అత్యంత తెలివైన వ్యక్తులు. కచ్చితంగా ఇదొక హై-ఐక్యూ గ్రూప్. మీ అందరినీ చూసి నేను గర్విస్తున్నాను. మీతో కలిసి ఇక్కడ ఇలా ఉండడం నాకు లభించిన గౌరవం." అని ట్రంప్ పేర్కొన్నారు. ముఖ్యంగా.. తనవద్ద మైక్రోసాఫ్ట్ షేర్లున్నాయని.. అవి 28 డాలర్ల నుంచి 500కు పైగా డాలర్లకు చేరాయని చెబుతూ.. సత్య నాదెళ్ల బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. టిమ్ కుక్, బిల్‌గేట్స్, మెటా జుకెర్‌బెర్గ్, శామ్ ఆల్ట్‌మన్ తదితర టెక్ దిగ్గజాలు ఈ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందు.. ట్రంప్ భార్య మెలానియా ఒక సమావేశం నిర్వహించారు. అందులో కూడా ఈ టెక్ దిగ్గజాలందరూ పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో సత్య నాదెళ్ల తర్వాత మాట్లాడిన బిల్‌గేట్స్.. తాను ఇప్పుడు జీవితంలో రెండో దశలో ఉన్నానని, సత్య నాదెళ్ల అద్భుతంగా పనిచేస్తుండడం వల్ల పెరుగుతున్న తన సంపదను దాతృత్వ కార్యక్రమాలకు ఖర్చుచేస్తున్నానని చెప్పినప్పుడు ట్రంప్ పెద్దగా నవ్వారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ సుందర్‌పిచాయ్‌ని ఉద్దేశించి.. అమెరికాలో గూగుల్ ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటోందని ప్రశ్నించగా.. దానికి ఆయన వచ్చే రెండేళ్లలో 250 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.22 లక్షల కోట్ల) మేర పెట్టుబడులు పెడతామని చెప్పారు. అందుకు ట్రంప్ ఆయన్ను ప్రశంసించారు.



వైట్ హౌస్ విందులో జుకర్‌బర్గ్, ట్రంప్, మెలానియా, బిల్‌గేట్స్

ఇండియా సారీ చెబుతుంది

» అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

అధిక సుంకాలు విధిస్తే భారత్ దిగివస్తుందన్న భ్రమలు ఇప్పటికే పటాపంచలైనా.. అమెరికా అహం మాత్రం అణువంతైనా తగ్గలేదు! మరో నెలా, రెణ్నెల్లలో భారత్ తమకు సారీ చెప్పి వాణిజ్య ఒప్పందానికి అర్రులు చాస్తుందని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ జోస్యం చెప్పారు. "నా ఉద్దేశం ప్రకారం.. నెల.. రెండు నెలల్లో భారతదేశం మాతో వాణిజ్య చర్చలకు కూర్చుని క్షమాపణ చెబుతుంది.. ట్రంప్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. రష్యా నుంచి చమురు కొనడం ఆపేయాలని, బ్రిక్స్‌లో భాగం కాకూడదని, అమెరికాకు, ఆ దేశ కరెన్సీ డాలర్‌కు మద్దతు తెలపాలని.. లేదా 50 శాతం సుంకాలను ఎదుర్కోవాలని రంకెలు వేశారు. చైనా, ఇండియా పరస్పరం తమ ఉత్పత్తులను అమ్ముకోలేవని.. రెండు దేశాలూ తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అమెరికాకు రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. భారతదేశం గనక బ్రిక్స్ దేశాల నడుమ 'అచ్చు'లాగా (బ్రిక్స్ అనే ఆంగ్ల పదంలో ఇండియాను సూచించే 'ఐ' అనే అక్షరం సరిగ్గా మధ్యలో ఉంటుంది. దానికి ఎడమ పక్కన ఆర్ (రష్యా).. కుడిపక్కన సి (చైనా), అనే అక్షరాలు ఉంటాయి. అంటే రష్యా, చైనా దేశాలకు వారధిలాగా) ఉండాలనుకుంటే అలాగే ఉండొచ్చని.. అదెంతకాలం కొనసాగుతుందో తామూ చూస్తామని అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు.

ఉక్రెయిన్‌కు మద్దతుగా దళాల్ని మోహరిస్తే సహించం!

» వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటాం

» మెక్రాన్ వ్యాఖ్యలపై పుతిన్ హెచ్చరిక

కీవ్, సెప్టెంబరు 5: ఉక్రెయిన్‌తో తమకు శాంతి ఒప్పందం కుదరటానికి ముందే ఆ దేశానికి మద్దతుగా ఎవరైనా సైనిక దళాలను మోహరిస్తే వాటిని కూడా తాము లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా శాంతి దళాల్ని మోహరించటానికి కట్టుబడి ఉన్నామని ఇటీవల పలు యూరప్ దేశాల అధినేతలు పునరుద్ఘాటించిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఉక్రెయిన్‌లో విదేశీ దళాల మోహరింపును తాము అంగీకరించబోమన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత దానికి రష్యా పూర్తిగా కట్టుబడి ఉంటుందని, ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదని పుతిన్ చెప్పారు. రష్యా-ఉక్రెయిన్‌లు ఒడంబడిక కుదుర్చుకొని యుద్ధాన్ని ఆపిన అనంతరం.. ఉక్రెయిన్‌పై మళ్లీ రష్యా దురాక్రమణకు పాల్పడకుండా ఆ దేశంలో సైనిక దళాల్ని మోహరించటానికి 26 దేశాలు అంగీకరించాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం ఓ సదస్సులో మాట్లాడుతూ, సెక్యూరిటీ గ్యారెంటీల అమలు (దళాల మోహరింపు?) ప్రారంభమైందని, వాటి వివరాలు వెల్లడించలేనని చెప్పటం గమనార్హం.


చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



'మంచు' ఆవిష్కరించిన చిరుగాలి పాట

నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్యారెడ్డి ప్రధాన పాత్రధారులుగా ఎం.నాగ రాజశేఖర్ రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ... చెలియా'. ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్ బేనర్‌పై రూపాశ్రీ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'నువ్వే చెప్పు చిరుగాలి' అంటూ సాగే పాటను మంచు మనోజ్ ఆవిష్కరించి చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. సుధీర్ బగడి సాహిత్యానికి ఎంఎం కుమార్ బాణీని అందించారు. సాయి చరణ్ ఆలపించారు. చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని యూనిట్ పేర్కొంది.



హీరో నాని సినీ ప్రయాణం ప్రారంభించి 17 ఏళ్ల పూర్తయిన ప్రత్యేక సందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ద ప్యారడైజ్' చిత్రం నుంచి ఓ పవర్ ఫుల్ స్టిల్ విడుదల చేశారు మేకర్స్ ఇందులో నాని కంప్లీట్ బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం నాని జిమ్‌లో బీభత్సంగా వర్కవుట్ చేస్తున్నారని ఈ స్టిల్ చూస్తే అర్థమవుతుంది. ప్రస్తుతం ప్యారడైజ్ చిత్రం టాకీ పార్ట్ షూటింగ్ ప్రత్యేకంగా వేసిన భారీ సెట్స్‌లో జరుగుతోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2026 మార్చి 26న మొత్తం ఎనిమిది భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

ఓనమ్ స్పెషల్...
దీపావళి విడుదల



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'కె. ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్. కేరళ నేపథ్యంలో సాగే కథ కనుక ఓనమ్ పండగ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. సినిమాలో ఓనమ్ పండగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను ప్రత్యేకంగా చిత్రీకరించినట్లు నిర్మాతలు తెలుపుతూ దీపావళి సందర్భంగా అక్టోబర్ 18న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తామని ప్రకటించారు. అలాగే మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ నెల 9న లవ్ మెలోడీ సాంగ్ 'కలలే.. కలలే' ను విడుదల చేస్తామని చెప్పారు. నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

ఊహించని మలుపులతో అలరిస్తుంది




జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య, సీరత్‌కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తి మాట్లాడుతూ 'శివ మంచి నిర్మాణ విలువలతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జాతస్య మరణం ధ్రువం' అనే టైటిల్‌ను సూచించింది నేనే' అని చెప్పారు. శ్రవణ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది' అని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి, పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని శివకుమార్ పేర్కొన్నారు.

విడుదలకు సిద్ధం



రాజ్‌తరుణ్, సందీప్ మాధవ్ కథానాయకులుగా సీహెచ్ సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, మానసా రాధాకృష్ణన్ హీరోయిన్లు. స్వాతి సుధీర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. దీపావళికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సందీప్ మాధవ్, రాజ్ తరుణ్ మాస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. 1980ల నాటి కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది, యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని దర్శకుడు తెలిపారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని నిర్మాత చెప్పారు.



తమిళ చిత్రకథానాయకుడు విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ సినిమా నుంచి తాజాగా 'జిల్ జిల్ సాంగ్'ను విడుదల చేశారు. భోలే షావలి రాసి పాడిన ఈ పాటను విజయ్ ఆంటోనీ స్వరపరిచారు. ఈ పాటలోని విజువల్స్ సినిమా మీద ఆసక్తి పెంచాయి. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ నెల 19న 'భద్రకాళి' చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. నటుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ఈ ప్రాజెక్టుకు మరింత ప్లస్ అయింది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణసాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర తదితరులు నటించారు.

వీర చంద్రహాస వస్తున్నారు



శివరాజ్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న కన్నడ చిత్రం 'వీర చంద్ర హాస'. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. ఎంవీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 19న 'వీర చంద్రహాస'ను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. మహాభారతం నేపథ్యంలో కథ సాగుతుందని, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు.



చిన్న సినిమాకు పెద్ద విజయం



మౌళి తనుజ్, శివాని నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం శుక్రవారం విడుదలైంది. సాయిమార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్యా హాసన్ నిర్మించిన చిత్రమిది. బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బన్నీ వాసు మాట్లాడుతూ 'చిన్న సినిమాకు ప్రేక్షకాదరణ ఎలా ఉంటుందో అనే సందేహం ఉంది, కానీ విడుదలైన అన్ని చోట్లా 'లిటిల్ హార్ట్స్' పాజిటివ్ టాక్‌తో కొనసాగుతోంది. చిన్న సినిమాకు ప్రేక్షకులు పెద్ద విజయం ఇచ్చారు' అని చెప్పారు. "సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత ఆ స్థాయి సక్సెస్‌ను అందుకుంటుందని అందరూ అభినందిస్తున్నారు' అని వంశీ నందిపాటి అన్నారు. 'పరిమిత బడ్జెట్‌తో ఓ మంచి లవ్ స్టోరీ తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మాను, 'లిటిల్ హార్ట్స్'తో ఆ నమ్మకం నిజమైంది' అని సాయిమార్తాండ్ తెలిపారు.





యు ముంబా చేతిలో బుల్స్ చిత్తు



విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా ఇక్కడ జరిగిన పోరులో యు ముంబా ఘనవిజయం సాధించింది. శుక్రవారం నాటి తొలి మ్యాచ్‌లో యు ముంబా 48-28తో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది. ఈ సీజన్‌లో బెంగళూరుకిది వరుసగా మూడో ఓటమి. మ్యాచ్ ప్రారంభం నుంచే యు ముంబా ఆటగాళ్లు రైడింగ్, టాకిలింగ్‌లో వరుస పాయింట్లతో దూసుకెళ్లారు. ప్రథమార్ధంలో ముంబా రైడర్ అజిత్ చౌహాన్ అద్భుతమైన రైడ్‌లో ఒకేసారి ఆరు పాయింట్లు రాబట్టాడు. ఈ సీజన్‌లో ఒక రైడ్‌లో అత్యధిక పాయింట్లు రాబట్టిన రైడర్‌గా అజిత్ రికార్డు నెలకొల్పాడు. అజిత్ మొత్తంగా 13 పాయింట్లు సాధించాడు. ప్రథమార్ధాన్ని 29-12తో ముగించిన ముంబా.. ద్వితీయార్ధంలోనూ జోరు కొనసాగించింది. చివర్లో ముంబాను ఆలౌట్ చేసే అవకాశాలొచ్చినా బుల్స్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-32తో యూపీ యోధాస్‌పై గెలుపొందింది.

అమ్మాయిలు.. అదిరేలా

థాయ్‌లాండ్‌పై 11-0తో భారత్ విజయం

మహిళల ఆసియా కప్ హాకీ

హంగ్జౌ (చైనా): ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో సొంతగడ్డపై భారత పురుషుల జట్టు సత్తా చాటుతుంటే.. ఇదే జోరులో విదేశీ గడ్డపై మన అమ్మాయిలూ అదరగొడుతున్నారు. మహిళల ఆసియా కప్‌ను భారత జట్టు అద్భుత విజయంతో ప్రారంభించింది. పూల్-బిలో భాగంగా శుక్రవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 11-0తో థాయ్‌లాండ్‌ను చిత్తుగా ఓడించింది. ఉదితా దుహాన్ (30వ, 52వ), డంగ్ డంగ్ (45వ, 54వ) చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. ముంతాజ్ (7వ), సంగీతా కుమారి (10వ), నవ్‌నీత్ కౌర్ (16వ), లాల్‌రేమ్సియామి (18వ), సుమన్ దేవి (49వ), షర్మిలా దేవి (57వ), రుతజా పిసల్ (60వ) తలో గోల్ కొట్టారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను శనివారం జపాన్‌తో ఆడనుంది.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా..

- పురుషుల హాకీలో చైనాతో భారత్ పోరు నేడు
- రాత్రి 7.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

రాజ్‌గిర్ (బిహార్): సొంతగడ్డపై చెలరేగుతున్న భారత పురుషుల హాకీ జట్టు ఆసియా కప్‌లో ఫైనల్ బెర్తే లక్ష్యంగా చైనాతో శనివారం అమీతుమీకి సిద్ధమైంది. సూపర్-4 దశలో తమ ఆఖరి మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాలన్న కసితో భారత్ బరిలో దిగనుంది. సూపర్-4లో భారత్.. మొత్తం నాలుగు పాయింట్లతో టాప్‌లో ఉంది. చైనా, మలేసియా చెరో మూడు పాయింట్లతో తర్వాతి స్థానంలో ఉండగా, కొరియా కేవలం ఒక పాయింట్‌తో చివర్లో ఉంది. ఈ నేపథ్యంలో చైనాతో మ్యాచ్‌ను కనీసం డ్రాగా ముగించినా, భారత్ ఫైనల్ చేరేందుకు అవకాశముంది. సూపర్-4లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది.

పతకంపై జ్యోతి, దీపిక గురి

నేటి నుంచి వరల్డ్ ఆర్చరీ

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న భారత స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖతో పాటు వెటరన్ దీపికా కుమారి శనివారం నుంచి జరిగే వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పతకమే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో భారత్ తరఫున పురుషులు, మహిళలు కలిపి 12 మంది ఆర్చర్లు పాల్గొంటున్నారు. జ్యోతి, పర్ణీత్, ప్రీతికలతో కూడిన మహిళల టీమ్‌పై ఈసారి కూడా భారీ అంచనాలున్నాయి. ఇక పురుషుల కాంపౌండ్‌లో ప్రథమేశ్, అమన్ సైనీ, రిషభ్ యాదవ్ ఈ ఏడాది అద్భుత ఫామ్‌లో ఉన్నారు. అయితే మహిళల రికర్వ్‌లో దీపిక, అంకిత, గథ ఖడకే సత్తా నిరూపించుకోవాల్సి ఉంది. శనివారం తొలి రోజు కాంపౌండ్ పోటీలు జరుగనున్నాయి.

ఆఖరి పోరులో సబలెంక x అమందా

సెమీస్‌లో ఒసాక, పెగుల ఓటమి | **యూఎస్ ఓపెన్**



న్యూయార్క్: టాప్ సీడ్ అర్యాన సబలెంక, ఎనిమిదో సీడ్ అమండ అనిసిమోవ యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక (బెలారస్) 4-6, 6-4, 6-3తో నాలుగో సీడ్ పెగుల (అమెరికా)పై గెలుపొందింది. మరో సెమీఫైనల్లో లోకల్ స్టార్ అనిసిమోవ 6-7 (4), 7-6 (3), 6-3తో ఫ్లషింగ్ మెడోస్‌లో రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన నవోమి ఒసాక (జపాన్)ను చిత్తు చేసింది. ఈసారి అనిసిమోవ జోరు అలా ఇలా లేదు. క్వార్టర్‌ఫైనల్లో ఆరు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్, టైటిల్ ఫేవరెట్ స్వియటెక్‌కు షాకిచ్చిన అమెరికా యువ క్రీడాకారిణి సెమీఫైనల్లో..నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత నవోమి ఒసాకాకు ఝలకిచ్చింది. తద్వారా 24 ఏళ్ల అమండా వరుసగా రెండోసారి మేజర్ టోర్నీ తుదిపోరుకు చేరింది. వింబుల్డన్‌లోనూ అనిసిమోవ టైటిల్ ఫైట్‌కు చేరిన విషయం విదితమే. ముఖాముఖి పోరులో సబలెంకపై అనిసిమోవ 6-3తో ఆధిక్యంలో ఉండడం విశేషం. ఈ ఏడాది వింబుల్డన్ సెమీఫైనల్లో సబలెంకపై అమండాదే పైచేయి అయ్యింది. అనిసిమోవా-ఒసాక సెమీస్ తొలి రెండు సెట్లు నువ్వా..నేనా అనేలా సాగాయి. దాంతో రెండు సెట్లూ టైబ్రేకర్‌కు వెళ్లాయి. అయితే మొదటి సెట్‌ను ఒసాక సొంతం చేసుకోగా..రెండో సెట్‌ను అనిసిమోవ చేజిక్కించుకుంది. ఈనేపథ్యంలో నిర్ణాయక మూడో సెట్ హోరాహోరీగా సాగుతుందని అంచనా వేశారు. కానీ కీలక తరుణంలో నవోమి చేతులెత్తేసింది. ఫలితంగా ఆఖరి సెట్‌ను అలవోకగా కైవసం చేసుకున్న అనిసిమోవ మ్యాచ్‌ను ముగించేసింది. ఒసాక 15 ఏస్‌లతో విరుచుకుపడగా..అమండా 50 విన్నర్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించింది. ఇక..పెగులకు మరోసారి ఫ్లషింగ్ మెడోస్‌లో నిరాశ తప్పలేదు. గత సంవత్సరం ఫైనల్లోనూ పెగులపై సబలెంక విజయం సాధించడం గమనార్హం. ఈసారి సెమీస్‌లో సబలెంక ఎనిమిది ఏస్‌లు వేస్తే..పెగుల మూడింటికే పరిమితమైంది. ఇద్దరూ చెరో నాలుగు డబుల్‌ఫాల్ట్‌లు చేయగా..43 విన్నర్లతో ప్రత్యర్థిని సబలెంక ఉక్కిరిబిక్కిరి చేసింది.

భాంబ్రి జోడీ ఓటమి

కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరడం ద్వారా టైటిల్‌పై ఆశలు రేపిన భారత డబుల్స్ ఆటగాడు యుకీ భాంబ్రి ఫైనల్ మాత్రం చేరలేక పోయాడు. ఉత్కంఠ భరితంగా సాగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భాంబ్రి/మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ 7-6 (2), 6-7 (5), 4-6తో కుప్‌స్కీ/శాలిస్‌బరీ ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

176 కి.మీ.. 44 గంటలు



అత్యంత క్లిష్టమైన రేసును పూర్తిచేసిన తెలుగు రేసర్ విశ్వభరతి

ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా రికార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన రేసుగా పేరుగాంచిన అల్ట్రా ట్రయల్ డు మోంట్ బ్లాంక్ (యూటీఎంబీ) వరల్డ్ సిరీస్ పరుగును ఆంధ్ర వెటరన్ అథ్లెట్ అల్లంశెట్టి విశ్వభరత్ విజయవంతంగా పూర్తి చేశాడు. పశ్చిమ ఐరోపాలో ఎత్తయిన పర్వత శిఖరమైన మోంట్ బ్లాంక్ మూడు దేశాల సరిహద్దుల నడుమ ఉంటుంది. 2018లో మనాలికి చెందిన షశ్వత్ తర్వాత ఈ రేసు పూర్తి చేసిన రెండో భారతీయుడు భరత్‌నే కావడం విశేషం. ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్‌ల మీదుగా ప్రయాణించిన అనంతరం తిరిగి ఫ్రాన్స్‌లోని చమోనిక్స్‌లో రేసు ముగుస్తుంది. గత నెల 29న జరిగిన 176.5 కిలోమీటర్ల రేసును విశ్వభరత్ 44 గంటల 29 నిమిషాల్లో పూర్తి చేశాడు. రేసును 46 గంటల 45 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉండగా నిర్దిష్ట సమయం కంటే ముందే భరత్ గమ్యానికి చేరుకొని, ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా ఖ్యాతి గడించాడు. ప్రాణ వాయువు తక్కువగా ఉండే ఎత్తయిన పర్వత శ్రేణులు, తీవ్రమైన గాలులు, శీతల వాతావరణం, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని భరత్ ఈ రేసును ముగించాడు. రేసు మధ్యలో 81వ కి.మీ దగ్గర భరత్‌కు విపరీతమైన కాళ్ల నొప్పి వచ్చినా పట్టుదలతో పరుగును పూర్తిచేశాడు. ఫ్రాన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న భరత్ స్వస్థలం గుంటూరు. కొవిడ్ లాక్‌డౌన్‌లో భరత్‌కు పరుగుపై ఆసక్తి కలగగా 2022 నుంచి ప్రొఫెషనల్ రన్నర్‌గా రేసుల్లో పాల్గొనడం ప్రారంభించాడు. 110 కిలోమీటర్ల యూటీఎంబీ వరల్డ్ సిరీస్ రేసులో ప్రతిభ ఆధారంగా ఈ 176 కిలోమీటర్ల రేసుకు అర్హత సాధించాడు. ఈ రేసుకు అర్హత సాధించడమే అత్యంత క్లిష్టమైన విషయమని విశ్వభరత్ చెప్పాడు. రెండేళ్ల ముందు నుంచే పలు క్వాలిఫయింగ్ ట్రయల్ రేసులను నిర్వహిస్తారని, అర్హత పాయింట్ల ఆధారంగా రన్నర్లకు ప్రధాన రేసుకు ఎంట్రీ లభిస్తుందని తెలిపాడు.

రాస్ టేలర్..మళ్లొచ్చాడు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ రాస్ టేలర్ తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. 2021, డిసెంబరులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ 41 ఏళ్ల వెటరన్ తాజాగా సమోవా జట్టు తరఫున ఆడబోతున్నట్టు ప్రకటించాడు. టేలర్ తల్లిది సమోవా దేశం కావడంతో అక్కడి పాస్‌పోర్ట్ కూడా తనకు ఉంది. అంతేకాకుండా కివీస్ తరఫున ఆడి మూడేళ్లు పూర్తి కావడంతో టేలర్ మరో జట్టుకు ఆడడంలో ఎలాంటి ఇబ్బందీ లేదు. ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026లో చోటు కోసం ఆసియా-ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్‌లో సమోవా తరఫున టేలర్ బరిలోకి దిగుతాడు.

అర్జున్ విజయం

సమర్‌ఖండ్: ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ రెండో రౌండ్‌లో ఇరిగేసి అర్జున్.. ఆర్మేనియా ఆటగాడు మార్టిరోస్యన్‌పై విజయం సాధించాడు. అలాగే 15 ఏళ్ల ఇవాన్ జెమ్లాన్‌స్కీ (రష్యా)పై ప్రజ్ఞానంద నెగ్గాడు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ వైశాలి.. ఎలినే రోబర్స్ (నెదర్లాండ్స్)ను ఓడించింది. ఇక 14 ఏళ్ల చిచ్చరపిడుగు యాగిజ్ కాన్ (తుర్కియే)తో తలపడిన ప్రపంచ చాంపియన్ గుకేశ్ డ్రాతో సరిపెట్టుకున్నాడు. భారత ఆటగాళ్ల విదిత్ గుజరాతీ-అభిమన్యు మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది.

బోణీ కొట్టిన సుమిత్, నీరజ్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన సుమిత్ కుందు, నీరజ్ ఫొగట్ శుభారంభం చేశారు. సుమిత్ (75 కిలోలు) తొలి రౌండ్లో జోర్డాన్ బాక్సర్ మహ్మద్ అల్ హుస్సేన్‌ను ఓడించాడు. అలాగే మహిళల్లో నీరజ్ (65 కి) 3-2తో ఫిన్లాండ్‌కు చెందిన క్రిస్టా కొవలైనెన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరింది. ఇక, మహిళల 70 కిలోల కేటగిరిలో సనమచా చాను 4-1తో డిటె ఫ్రోస్ట్రోల్మ్ (డెన్మార్క్)పై గెలుపొంది ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

టైసన్..వన్స్‌మోర్!



జూనియర్ మేవెదర్‌తో బౌట్

న్యూయార్క్: హెవీవెయిట్ ప్రపంచ మాజీ చాంపియన్ మైక్ టైసన్ మళ్లీ రింగ్‌లోకి అడుగు పెడుతున్నాడు. 'బాక్సింగ్ హాల్ ఆఫ్ ఫేమర్స్'లో భాగంగా వచ్చే ఏడాది టైసన్-ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్ మధ్య ఎగ్జిబిషన్ పోరు జరగనుంది. అయితే టైసన్, మేవెదర్ జూనియర్‌లను సంప్రదించాకే కచ్చితమైన తేదీ, వేదికను ఖరారు చేస్తారట.

బిజినెస్

'ఆర్‌కామ్'ది మోసపూరిత ఖాతానే: బీఓబీ

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూడా మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. ఈ మోసంలో ఆ కంపెనీ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ కూడా దోషి అని రెగ్యులేటరీ సంస్థలకు బ్యాంక్ తెలిపింది. ఫోరెన్సిక్ ఆడిట్ ఆధారంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఆర్‌కామ్‌కు రెండు విడతలుగా తాము రూ.2,462.5 కోట్ల రుణాలు మంజూరు చేస్తే, అందులో ఇప్పటికీ రూ.1,656.07 కోట్ల బకాయిలు చెల్లించలేదని పేర్కొంది. కాగా ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ఇప్పటికే ఆర్‌కామ్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించాయి.

వేదాంత చేతికి జేపీఎల్!

రూ.17,000 కోట్లకు బిడ్

న్యూఢిల్లీ: జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేపీఎల్) దివాలా పరిష్కార ప్రక్రియ కొలిక్కి వచ్చిన సూచనలు కనిపిస్తున్నాయి. కంపెనీ రుణ దాతల కమిటీ (సీఓసీ) శుక్రవారం నిర్వహించిన చాలెంజ్ బిడ్డింగ్‌లో జేపీఎల్ ఆస్తులకు రూ.17,000 కోట్లు చెల్లించేందుకు అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత గ్రూప్ బిడ్ దాఖలు చేసింది. అదానీ గ్రూప్ ఆఫర్ చేసిన రూ.12,505 కోట్ల కంటే ఇది రూ.4,495 కోట్లు ఎక్కువ. సీఓసీ ఈ బిడ్‌ను ఆమోదిస్తే జేపీఎల్ ఆస్తులు వేదాంత గ్రూప్ పరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ.57,185 కోట్ల అప్పుల్లో ఉన్న జేపీఎల్.. రియల్టీ, సిమెంట్, పవర్, హోటల్స్, రహదారుల నిర్మాణ వ్యాపారాల్లో ఉంది.

జోరుగా తయారీ!



జీఎస్‌టీ తగ్గించిన నేపథ్యంలో పండగ సీజన్ గిరాకీపై భారీ అంచనాలు

ఉత్పత్తిని 25% వరకు పెంచిన కంపెనీలు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఈసారి పండగ సీజన్‌లో వస్తు గిరాకీ భారీగా పెరగవచ్చని కంపెనీలు ఆశాభావంగా ఉన్నాయి. ఊపందుకోనున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు, ముఖ్యంగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల సంస్థలు తయారీని 25 శాతం వరకు పెంచినట్లు తెలిసింది. వస్తువుల తయారీకి అవసరమైన విడిభాగాల సమీకరణను సైతం గణనీయంగా పెంచాయి. తగ్గించిన జీఎస్‌టీ రేట్లు దుర్గా నవరాత్రుల ప్రారంభ రోజు (ఈ నెల 22) నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో పుంజుకోనున్న వస్తు గిరాకీ క్రిస్మస్ వరకు కొనసాగవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు. సాధారణంగా కంపెనీలు పండగ సీజన్ కోసం ఆగస్టు-సెప్టెంబరులోనే ఉత్పత్తి పెంచుతాయి. అక్టోబరు-డిసెంబరు కాలంలో తమ పూర్తి తయారీ సామర్థ్యంలో 50-70 శాతాన్ని మాత్రమే వినియోగించుకుంటాయి. అధిక గిరాకీకి అనుగుణంగా సరఫరా చేసేందుకు ఈసారి ఏడాది చివరి వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 శాతం ఉపయోగించుకోవాల్సి రావచ్చని చాలా వరకు కంపెనీలు భావిస్తున్నాయి.

అదే బాటలో ఎలక్ట్రానిక్ కంపెనీలు

ప్రస్తుతం మార్కెట్లో 32 అంగుళాల కంటే అధిక సైజున్న టీవీలకే డిమాండ్ అధికంగా ఉంది. అన్ని సైజుల టీవీలు, ఏసీలు, మానిటర్లు, ప్రొజెక్టర్లు, డిష్‌వాషర్లపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. దీంతో బడా సైజు టీవీల ధరలు కనీసం రూ.2,000 తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. కాబట్టి, ఈ పండగ సీజన్‌లో వీటి విక్రయాలు ఊపందుకోవచ్చన్న అంచనాలున్నాయి. భారీ టీవీల స్టాక్‌ను ఇప్పటికే సిద్ధం చేసుకున్న కంపెనీలు వచ్చే 2-3 నెలల్లో భారీగా లబ్ధి పొందనున్నాయని హాయర్ అప్లయెన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీశ్ అన్నారు. 32 అంగుళాల నుంచి అధిక సైజుకు మారాలనుకునే వారి కొనుగోళ్లు భారీగా పెరగవచ్చని, ఈ నేపథ్యంలో 43 అంగుళాలు, ఆపై సైజు టీవీల ఉత్పత్తిని 20 శాతం పెంచినట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీ తగ్గింపుతో తమ టీవీల ధరలను 8-10 శాతం మేర తగ్గించనున్నట్లు సోనీ ఇండియా తెలిపింది. రేట్ల తగ్గుదలతో డిమాండ్ 10 శాతం మేర పెరగవచ్చని కంపెనీ ఎండీ సునీల్ నయ్యర్ అన్నారు.

ఏసీలకూ డిమాండ్

సాధారణంగా ఏసీల విక్రయాలు ఫిబ్రవరి నుంచి ఊపందుకుంటాయి. వీటిపై జీఎస్‌టీ గణనీయంగా తగ్గడంతో కస్టమర్లు ఈ పండగ సీజన్‌లోనూ ఏసీ కొనుగోళ్లకు ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.

చిన్న కార్ల తయారీ పెంపు

ప్రస్తుతం అన్ని కార్లపై జీఎస్‌టీ 28 శాతంగా ఉంది. కాగా, 4 మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లు, 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించారు. దీంతో పండుగ సీజన్‌లో చిన్న కార్లు, హ్యాచ్‌బ్యాక్‌లు, కాంపాక్ట్ ఎస్‌యూవీల కొనుగోళ్లు అనూహ్యంగా పెరగవచ్చని వాహన తయారీ సంస్థలు భావిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా కంపెనీలు ఈ మోడళ్ల ఉత్పత్తిని ఇప్పటికే పెంచినట్లు తెలుస్తోంది. పన్ను భారం తగ్గడంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ కార్ల విక్రయాలు 10 శాతం వరకు పెరగవచ్చని, ఈ ఏడాది ఇండస్ట్రీ విక్రయాల వృద్ధి 7-8 శాతానికి పెరగవచ్చని మారుతి సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణతో కార్ల డిమాండ్ ఒక్కసారిగా పెరగనుందని, అధిక గిరాకీ వచ్చే రెండు నెలల పాటు కొనసాగవచ్చని సిట్రోయెన్ కార్ల విక్రయ కంపెనీ స్టెల్లాంటిస్ ఇండియా ఆటోమోటివ్ బ్రాండ్స్ విభాగ డైరెక్టర్ కుమార్ ప్రియేష్ అన్నారు.

విద్యపై పెట్టుబడితో వచ్చేదే అత్యుత్తమ రాబడి

మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దేవ్ అగర్వాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యపై పెట్టే పెట్టుబడులపై వచ్చే రాబడులే అత్యుత్తమ రాబడులని మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ (ఎంఓఈసీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఉద్దేశంతోనే ఐఎస్‌బీలో ఎంఓఈసీ ఏర్పాటుకు రూ.100 కోట్లు సమకూర్చినట్టు తెలిపారు. లెర్న్, ఎర్న్ (నేర్చుకో, సంపాదించు) అనేది తమ సిద్ధాంతమన్నారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని మన జీవిత కాలంలోనే దేశానికి, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ఇవ్వాలనే విషయాన్ని కూడా తాము దృఢంగా నమ్ముతామన్నారు. ఈ లక్ష్యంతోనే అనేక విద్యా సంస్థలకు మోతీలాల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూరుస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు.

సందేశాలపై తస్మాత్ జాగ్రత్త: సెబీ

న్యూఢిల్లీ: సెబీ పేరిట సామాజిక మాధ్యమ వేదికలపై సర్క్యులేట్ అవుతున్న సందేశాలు, నోటీసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్వెస్టర్లను సెబీ హెచ్చరించింది. అలాంటి మోసపూరిత సందేశాలకు స్పందించి వ్యక్తిగత సమాచారం ఏదీ పంచుకోవద్దని సూచించింది. ఇన్వెస్టర్లను తమ ఉచ్చులోకి లాగేందుకు మోసగాళ్లు సెబీ లోగో, లెటర్‌హెడ్, సీల్ కూడా కాపీ చేసిన సందర్భాలున్నట్టు తెలియచేసింది. భిన్న రకాల ఉల్లంఘనలపై రెగ్యులేటరీ చర్యలను నివారించుకునేందుకు పెనాల్టీలు లేదా ఫైన్ చెల్లించాలన్న బెదిరింపులు ఆ సందేశాల్లో వ్యాపింపచేస్తున్నట్టు తెలిపింది.

కేవీబీ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) వడ్డీ రేట్లను తగ్గించింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) తగ్గించినట్లు ప్రకటించింది. అన్ని కాలపరిమితుల రుణాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. దీంతో ఏడాది కాలవ్యవధి కలిగిన ఆటో, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు 9.55 శాతం నుంచి 9.45 శాతానికి తగ్గగా నెల, మూడు, ఆరు నెలల కాలానికి సంబంధించిన వడ్డీ రేట్లు 9.3 శాతం నుంచి 9.45 శాతం మధ్యన ఉంటాయని పేర్కొంది. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 7 నుంచి అమల్లోకి వస్తాయని కేవీబీ వెల్లడించింది.

మస్క్‌కు టెస్లా ట్రిలియన్ డాలర్ల ఆఫర్

ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇదే అతిపెద్ద పారితోషిక ప్యాకేజీ

వాషింగ్టన్: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా సారథి ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే నం.1 ధనవంతుడన్న విషయం తెలిసిందే. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ డేటా ప్రకారం.. శుక్రవారం నాటికి ఆయన సంపద విలువ 378 బిలియన్ డాలర్లు. అంటే, 37,800 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.33.26 లక్షల కోట్ల పైమాటే. తాజాగా ఈ కుబేరుడికి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వ్యక్తి)గా అవతరించే ఆఫర్ దక్కింది. వివరాల్లోకి వెళ్తే.. టెస్లా బోర్డు మస్క్‌కు భవిష్యత్‌లో ట్రిలియన్ డాలర్ల విలువ చేసే పనితీరు ఆధారిత భారీ పారితోషిక ప్యాకేజీని ఆఫర్ చేసింది. ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద ప్యాకేజీ. బీవైడీ, ఇతర చైనా కంపెనీల నుంచి పోటీ తట్టుకోలేక విక్రయాలు భారీగా తగ్గిడీలాపడిన టెస్లా.. ఈ ప్యాకేజీలో భాగంగా మస్క్‌కు అత్యంత భారీ లక్ష్యాలను నిర్దేశించింది.

కంపెనీ మార్కెట్ విలువను (క్యాపిటలైజేషన్) ప్రస్తుత 1.12 ట్రిలియన్ డాలర్ల నుంచి 8.5 ట్రిలియన్ డాలర్ల (8.5 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చడం, కంపెనీ కార్ల వార్షిక విక్రయాలను గత ఏడాదిలో నమోదైన 20 లక్షల లోపు యూనిట్ల నుంచి 2 కోట్ల యూనిట్లకు పెంచడం, రోబో ట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల అమ్మకాలను 10 లక్షల యూనిట్లకు పెంచడం అందులో ప్రధానమైనవి.

లక్ష్యాలన్నింటినీ చేరుకుంటేనే,ప్యాకేజీలో భాగంగా ఆఫర్ చేసిన 42.37 కోట్ల కంపెనీ షేర్లు మస్క్‌కు దక్కుతాయి. ప్రస్తుతం వాటి విలువ 8,780 కోట్ల డాలర్లు. పదేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ 8.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరితే ఆయన వాటా షేర్ల మొత్తం విలువ ట్రిలియన్ డాలర్లు దాటనుంది. ఈ ప్యాకేజీ ప్రయోజనాలు పూర్తిగా దక్కాలంటే, మస్క్ కంపెనీలో కనీసం ఏడున్నరేళ్లు కొనసాగాలి. పదేళ్లలో లక్ష్యాలన్నింటినీ సాధించాల్సి ఉంటుంది.

హెచ్ఏఎల్‌కు తేజస్ యుద్ధ విమాన ఫ్యూజ్‌లేజ్

అందజేసిన వేమ్ టెక్నాలజీస్


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా అభివృద్ధి చేస్తున్న తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ ఏంకే 1ఏకి సంబంధించి రెండో సెంటర్ ఫ్యూజ్‌లేజ్ (ప్రధాన క్యాబిన్)ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వేమ్ టెక్నాలజీస్ అందజేసింది. దేశీయ ఏరోస్పేస్ రంగంలో స్థానికంగా ఉన్న కంపెనీల ప్రాధాన్యం పెరుగుతుందనేందుకు ఇది సంకేతం. ఈ ఏడాది ఆరంభంలో హెచ్ఏఎల్‌కు ఎల్ అండ్ టీ.. కోయంబత్తూర్‌లోని తన ప్లాంట్ నుంచి ఏంకే 1ఏ కోసం వింగ్ అసెంబ్లీస్‌ను అందించింది. తాజాగా వేమ్ టెక్నాలజీస్ ఫ్యూజ్‌లేజ్‌ను అందించటం విశేషం. గడచిన మూడేళ్ల కాలంలో విమానాలకు సంబంధించి కీలక కాంపోనెంట్లు, కాంప్లెక్స్ సిస్టమ్స్ కోసం దేశీయ కంపెనీలకు హెచ్ఏఎల్ దాదాపు రూ.13,763 కోట్ల విలువైన కాంట్రాక్టులను అందించింది.

ఆటుపోట్ల ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ చెరోదారి

ముంబై: తీవ్ర ఆటుపోట్ల మధ్య సాగిన ట్రేడింగ్‌లో శుక్రవారం సెన్సెక్స్, నిఫ్టీ చెరోదారిలో ముగిశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో షేర్లు అందించిన లాభాలను ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు తుడిచిపెట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 715 పాయింట్ల మేరకు ఊగిసలాడి ఒక దశలో 80,321.19 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి 7.25 పాయింట్ల నష్టంతో 80,710.76 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 6.70 పాయింట్ల లాభంతో 24,741 వద్ద ముగిసింది. వారం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే సెన్సెక్స్ 901.11 పాయింట్లు, నిఫ్టీ 314.15 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం ఈక్విటీ మార్కెట్ ఎలాంటి మార్పు లేకుండా తటస్థంగానే ముగిసినప్పటికీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి రికవరీ సాధించడం స్వల్ప సానుకూలతను సూచిస్తోందని విశ్లేషకులంటున్నారు.

అదానీ పవర్ షేర్ల విభజన: అదానీ పవర్ తన షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించనుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారులు షేర్ల విభజనకు ఆమోదం తెలిపారని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో అదానీ పవర్ తెలిపింది. తగినంత మెజారిటీతో వాటాదారులు ఈ తీర్మానాన్ని ఆమోదించినట్టు వెల్లడించింది. రిటైల్, చిన్న ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెంచేందుకు తీసుకున్న ఈ చర్య కింద రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరును రూ.2 ముఖ విలువ గల 5 షేర్లుగా విభజిస్తారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




6 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,07,620 ▲	98,650 ▲	1,36,500 ▼
విజయవాడ	1,10,300 ▲	1,04,000 ▲	1,27,000 ▼
విశాఖపట్నం	1,09,720 ▲	98,650 ▲	1,36,000 ▼
రాజమండ్రి	1,07,620 ▲	98,650 ▲	1,27,300 ▲
ప్రొద్దుటూరు	1,09,000 ▲	1,00,280 ▲	1,27,200 ▲
ముంబై	1,06,338 ▲	97,406 ▲	1,23,170 ▼



ఏకలవ్య ఓటీటీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నిర్వాహకులు

దేశంలోనే తొలి ఎడ్యుకేషనల్ ఓటీటీ
ఏకలవ్య ప్రారంభం

- విద్యలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం
- ప్రతి సబ్జెక్టుపై సులభంగా అర్థమయ్యే కంటెంట్

హైటెక్ సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి విద్యా సంబంధిత అంశాలతో ఏకలవ్య పేరుతో ఓటీటీ ప్రారంభమైంది. టైమ్, ఆహా గురు వంటి అగ్రశేణి బ్రాండ్లను ఏకం చేస్తూ విద్యలో విప్లవాత్మక మార్పుగా దీనికి రూపకల్పన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ మాదాపూర్‌లోని హోటల్ ఆవాసాలో దీన్ని ఆవిష్కరించారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీకి చెందిన ఏకలవ్య ఎడ్యుకేషనల్ సంస్థ రూపొందించిన ఈ ఓటీటీని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకవల్య చైర్మన్ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయి ఉత్తమ విద్యావంతులు రూపొందించిన కంటెంట్ ఇందులో ఉంటుందని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ కాన్సెప్ట్‌పై రూపొందించిన ఈ ఫ్లాట్‌ఫాం ఇప్పటి ఎడ్యుటెక్ కఠినమైన సమస్యలకు పరిష్కారం చూపనుందన్నారు. ప్రతి సబ్జెక్టుపై ఇందులో కంటెంట్ ఉంటుందని, విద్యార్థులు సులువుగా నేర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో అనిల్ దీపక్, డైరెక్టర్ సురేందర్ రెడ్డి, నాగేష్ పెండెం, అజయ్‌కుమార్ కొండపర్తి తదితరులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ఎదుట రైతులతో కలిసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రైతుపై కేసు

- నిరసన తెలిపిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు
- నిరసన తెలపడం రాజ్యాంగ హక్కు: కేటీఆర్
- రైతును వేధించడం దుర్మార్గం: కల్వకుంట్ల కవిత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రైతుపై కేసు నమోదైంది. ఈనెల 4న యూరియా కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్యాక్స్ గోదాం వద్దకు వెళ్లిన రైతు లక్ష్మణ్, అక్కడ భారీగా క్యూ ఉండడంతో అసహనం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో ఆయన సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం శుక్రవారం రైతు ఇంటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో ఠాణాకు చేరుకుని రైతుకు మద్దతుగా నిరసన తెలిపారు. యూరియా సరఫరా కావడం లేదని ఆవేశంలో మాట్లాడిన ఓ సాధారణ రైతుపై కేసు పెట్టడం అన్యాయమని వారు వాదించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎక్స్‌వేదికగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దేశానికే అన్నంపెట్టే రైతుపై అక్రమ కేసు బనాయించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. యూరియా దొరక్క కళ్ల ముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి పోలీసులను అతడి ఇంటిపైకి పంపించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. లక్ష్మణ్‌కు రక్షణగా బీఆర్ఎస్ పోరాడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిని నిలదీసిన రైతును వేధించడం దుర్మార్గమని కవిత మండిపడ్డారు.



టీఎస్ఈఏఈఏ నూతన అధ్యక్షుడు పవన్ కుమార్, కార్యవర్గం సభ్యులు

టీఎస్ఈఏఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

- ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పవన్ కుమార్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్ఈఏఈఏ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పవన్ కుమార్ నియమితులయ్యారు. రెండు రోజుల క్రితం జరిగిన అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి ఖైరతాబాద్‌లో ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు విద్యుత్ సంస్థలకు చెందిన సుమారు 2,500 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ) ఈ ఎన్నికల్లో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా టీఎస్ఈఏఈఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఆయన అన్నారు.

సూర్యాపేట ఆర్ అండ్ బీలో ఒకేసారి ఏడుగురిపై సస్పెన్షన్ వేటు

- విధి నిర్వహణ సమయంలో కార్యాలయంలో లేకపోవడంతో కలెక్టర్ చర్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట రోడ్లు మరియు భవనాల(ఆర్ అండ్ బీ) శాఖ ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) కార్యాలయానికి చెందిన ఏడుగురు ఉద్యోగులపై ఒకేసారి సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణ సమయంలో కార్యాలయం లేకుండా పోయిన వివిధ హోదాల పని చేస్తున్న ఉద్యోగులపై ఆ జిల్లా కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్.. సూర్యాపేట ఆర్ అండ్ బీ ఈఈ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఏడుగురు అధికారులు కార్యాలయంలో లేకపోవడాన్ని గమనించారు. సదరు ఉద్యోగులు ఉన్నతాధికారుల నుంచి అనుమతి కూడా తీసుకోలేదని తెలిసి వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు వీరిపై సస్పెన్షన్ కొనసాగుతుందని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఆర్ అండ్ బీలో సీనియారిటీ ప్రకారం ఇటీవల వరుసగా పదోన్నతులు ఇస్తున్నారు. ఇందులో భాగంగా జగిత్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) ఏ.కిషన్‌రావు, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ బి.లక్ష్మణ్, నల్లగొండ ఎస్ఈ బి.వెంకటేశ్వరరావు, నాణ్యతా విభాగం ఎస్ఈ ఎం.శ్రీనివాసరెడ్డికి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టార్గెట్ తెలంగాణ!

(మొదటిపేజీ తరువాయి)

విచారణను కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించడంతో బీఆర్ఎస్‌ను బలహీనపరిచేందుకు తగిన అవకాశం లభించిందని, బీఆర్ఎస్ బలహీనపడితే బీజేపీ పుంజుకునేందుకు పూర్తి అవకాశాలున్నాయని పార్టీ అగ్ర నేతలు యోచిస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలు పూర్తి కాగానే రాష్ట్ర కమిటీని నియమించి, తెలంగాణలో రాజకీయ కార్యాచరణను పూర్తిగా ఢిల్లీ కనుసన్నల్లో నిర్వహించాలని యోచిస్తున్నారు. పార్టీ ఎంపీలకు, ప్రజా ప్రతినిధులకు కీలక బాధ్యతలు అప్పజెప్పడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని పావులు కదుపుతున్నారు. అలాగే, ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టాలని, బీఆర్ఎస్‌లో ప్రజా బలం ఉన్న నాయకులను బీజేపీలోకి ఆహ్వానించాలని భావిస్తున్నారు. అంతేనా.. రాష్ట్రంలో బీజేపీ ఒకరిద్దరు నేతల కనుసన్నల్లోనే నడుస్తోందని, ఇతర పార్టీల నుంచి వచ్చిన ముఖ్యమైన నేతలను విస్మరిస్తున్నారని సమాచారం అందిన నేపథ్యంలో అన్ని వర్గాల నేతలకూ ప్రాతినిధ్యం కల్పించేలా రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయాలని ఢిల్లీ నేతలు యోచిస్తున్నారు. ఆ తర్వాత బీజేపీ రాజకీయ వ్యవహారాల కమిటీని కూడా ఏర్పాటు చేసి సమష్టి కార్యాచరణకు వీలు కల్పించాలని భావిస్తున్నట్లు ఓ సీనియర్ నేత తెలిపారు. దక్షిణాదిన తెలంగాణ తమకు ముఖ్యమైన రాష్ట్రమని, అధికారంలోకి వచ్చేందుకు ఇక్కడ తమకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. కాగా కర్ణాటకలో నవంబరులో బీజేపీకి అనుకూలంగా కీలక పరిణామాలు జరగవచ్చని ఆయన తెలిపారు.



గత పాలకుల
భూ దోపిడీని బయటపెట్టండి

మీపై పడిన మచ్చను తొలగించుకునేలా పని చేయండి.. వారి దోపిడీని ప్రశ్నిస్తారనే మీపై అవినీతి ముద్ర

- మిమ్మల్ని దోపిడీదారులుగా చిత్రీకరించారు
- మీ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన వారి భరతం పట్టండి
- సర్కారుకు, ప్రజలకు మధ్య వారధిగా నిలవండి
- గ్రామ పాలనాధికారులతో సీఎం రేవంత్
- 5000 మందికి హైటెక్స్‌లో నియామక పత్రాల అందజేత



కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): "ధరణి భూతాన్ని తెచ్చి భూములు కొల్లగొట్టాలని గతపాలకులు చూశారు. వాళ్ల దోపిడీకి మీరు అడ్డుగా ఉన్నారని భావించారు. అందుకే, మిమ్మల్ని దోషులుగా, దోపిడీదారులుగా చిత్రీకరించారు. ధరణి దరిద్రాన్ని వదిలించి.. మిమ్మల్ని దోపిడీదారులుగా చిత్రీకరించిన గత పాలకుల భరతం పట్టండి. వారు దోచుకున్న భూముల లెక్కలు బయటపెట్టండి" అని రెవెన్యూ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఐదు వేల మంది గ్రామ పాలనాధికారుల (జీపీవో)కు నియామక పత్రాలను అందించేందుకు శుక్రవారం హైటెక్స్‌లో కొలువుల పండగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన పదిమందికి సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ భూముల దోపిడీ లెక్కలు గ్రామ గ్రామాన బయటకు తెలుస్తాయని, తెలంగాణ సమాజం ప్రశ్నిస్తుందనే గత పాలకులు వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని, వారిని బలి పశువులను చేశారని మండిపడ్డారు. గతంలో భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు దిగంతాలకు తరిమారని గుర్తు చేశారు. "నేను పాదయాత్ర చేసే సమయంలో ఏ గ్రామానికి వెళ్లినా.. ఎవరిని కదిలించినా ధరణి భూతం పీడిస్తోందనే చెప్పారు. కొరివి దయ్యం నుంచి విముక్తి కల్పించండి అని అడిగారు. ధరణితో విసిగిపోయి ఇబ్రహీంపట్నంలో పెట్రోల్ పోసి ఓ అధికారిని తగులబెట్టారు. సిరిసిల్లలో ఓ మహిళ తన వద్ద డబ్బులు లేవంటూ తాళిబొట్టును కార్యాలయం తలుపుకు కట్టి వెళ్లింది. ధరణి అధికారుల వల్ల తలెత్తిన సమస్య కాదు. పాలకులు సృష్టించిన వైరస్. అందుకే, ప్రజాపాలనలో ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని చెప్పాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ధరణి మహమ్మారిని వదిలించి భూభారతి చట్టం తెచ్చాం" అని వివరించారు. తమ ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించిందని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేయాలనే 5 వేల మంది జీపీవోలను నియమిస్తున్నామని తెలిపారు. 1.56 కోట్ల ఎకరాల భూముల రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి.. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది.. ప్రజలకు సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. సాదాబైనామా వంటి సమస్యలతోపాటు భూ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.

రెండు, మూడు శాతం చెడ్డవాళ్లు ఉంటారు

ప్రతి ఉద్యోగి జాగ్రత్తగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి వ్యవస్థలోనూ రెండు మూడు శాతం చెడ్డవారు ఉంటారని, అంత మాత్రాన వ్యవస్థను తగులబెట్టుకుంటామా అని ప్రశ్నించారు. ఆనాడు రెవెన్యూ శాఖలో తప్పిదాలు జరిగి ఉండవచ్చని, వాటిని సరిదిద్దుకునేందుకు, చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వ్యవస్థనే రద్దు చేయడం వల్ల ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా అమలు సమయంలో గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది లేని లోటును గుర్తించామని, గ్రామాలకు వెళ్లి.. సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే అందరికీ వస్తుందని, దీనిని ఆత్మ గౌరవానికి సంబంధించిన సమస్యగా జీపీవోలు పనిచేయాలని చెప్పారు. మీపై పడిన ముద్రను తొలగించుకుని గత పాలకులు చేసిన ప్రచారాన్ని ప్రజలు మరిచిపోయేలా పనిచేయాలని హితవు పలికారు.

ప్రభుత్వానికి మచ్చ రాకుండా
పని చేయండి

- మంత్రి పొంగులేటి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. దొరల ప్రభుత్వం తెచ్చిన ధరణి అనే భయంకర భూతాన్ని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీని రూపకల్పన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డిని పలుమార్లు విసిగించి ఆయన సలహాలతో తీసుకొచ్చామని చెప్పారు. ఇకపై ప్రభుత్వానికి మాట, మచ్చ రాకుండా పని చేయాల్సిన బాధ్యత రెవెన్యూ ఉద్యోగులదేనని చెబుతూ.. ప్రజలకు ఉన్నత సేవలు అందిస్తామంటూ వారితో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మొత్తం దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పాలనాధికారులు, సర్వేయర్ల నియామకంతో భూ సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామన్నారు. 7000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఉగాదిలోగా భర్తీ చేస్తామని ప్రకటించారు. మూడు దశాబ్దాలుగా వివిధ ప్రాజెక్టులకు జరిగిన భూసేకరణలో ఇంకా రైతుల పేర్లు పహాణీల్లో ఉండిపోయాయని, ఈ సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. ఏటా డిసెంబర్ 31 నాటికి గ్రామాల వారీగా క్రయ విక్రయాల లెక్కలను వివరించేలా ప్రకటన జారీ చేస్తామని, దీని హార్డ్ కాపీ ప్రతి రెవెన్యూ గ్రామంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. గ్రామ పాలనాధికారుల నియామకాలు చేసినందుకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ అరవింద్ రెడ్డి, కార్యదర్శి గౌతమ్ కుమార్ సీఎంకు, ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి సీతక్క, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



కాళేశ్వరంపై సీఎంది దుష్ప్రచారం

- లక్ష కోట్లు వృథా అంటున్న సీఎం మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు ఎలా తీసుకెళ్తారు?
- పాలకుల ప్రతికూల ఆలోచనా ధోరణితో రాష్ట్రాభివృద్ధికి నష్టం: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రూ.లక్ష కోట్లు వృథా అయ్యాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం వృథా అయితే మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకెళ్తానని ఎలా అన్నారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. పాలకుల ప్రతికూల ఆలోచన ధోరణితో రాష్ట్రాభివృద్ధికి నష్టం కలుగుతోందని వాపోయారు. యూకే పర్యటనలో ఉన్న హరీశ్‌రావు శుక్రవారం అక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు మాట్లాడారు. కాళేశ్వరంతో రూ.లక్ష కోట్లు వృథా అంటున్న సీఎం.. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకెళ్తానని అన్నారని, ఇందుకోసం 7000 కోట్లతో టెండర్లు కూడా పిలిచారని హరీశ్ తెలిపారు. కాళేశ్వరం నీళ్లను మూసీకి ఎలా తీసుకువస్తారో రేవంత్ రెడ్డే చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం శంకుస్థాపన చేసిన గంధమల్ల ప్రాజెక్టుకు మల్లన్న సాగర్ నుంచే నీళ్లు రావాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, అందువల్లే మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల అంశాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రూ.400 కోట్ల వ్యయంతో బ్యారేజీ మరమ్మతులు పూర్తవుతాయని హరీశ్ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, ఎల్లంపల్లి, పెద్దవాగు ప్రాజెక్టులు వారి ప్రభుత్వంలోనే కూలాయన్న హరీశ్.. రైతుల ప్రయోజనాలు దెబ్బతినేలా రాజకీయాలు చేయడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సానుకూల దృక్పథం లేకపోవడంతో అభివృద్ధి ఆశాజనకంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అనేక రంగాల్లో మేటిగా నిలిచిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం గూగుల్ ప్రచారానికే పరిమితం కావడం దురదృష్టకరమని వాపోయారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ వల్ల రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టడంతో భూముల ధరలు పెరిగాయని అన్నారు.

స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం?

(మొదటిపేజీ తరువాయి)



బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేస్తూ పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్సులను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ రెండు ఆర్డినెన్సులూ జూలై 15న ఆమోదం కోసం గవర్నర్ కార్యాలయానికి చేరాయి. అయితే వాటిని పరిశీలన కోసం గవర్నర్ కేంద్ర హోం శాఖకు పంపారు. అటు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్సులపై నిర్ణయం వెలువడక పోవడం, ఎన్నికల నిర్వహణకు హైకోర్టు పెట్టిన సెప్టెంబరు 30 గడువూ ముంచుకువస్తుండడంతో.. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను ఆది, సోమవారాలు జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఆమోదించారు. మూడ్ ఆఫ్ ది హౌస్‌ను పరిగణనలోకి తీసుకుని రెండు బిల్లులనూ ఆమోదించాలంటూ వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. ఆ రెండు బిల్లులనూ గవర్నర్ న్యాయ సలహా కోసం పంపినట్లు చెబుతున్నారు. హైకోర్టు పెట్టిన గడువులోగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలంటే ఇప్పటికే గవర్నర్ ఈ రెండు బిల్లులపైనా నిర్ణయం తీసుకుని ఉండాలి. కనీసం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని హైకోర్టుకు విన్నవించాలన్నా.. గవర్నర్ తన సానుకూల నిర్ణయాన్ని ఈ నెల 20లోపు వెల్లడించాల్సి ఉంటుంది. ఎందుకంటే.. సవరణ చట్టాల ఆధారంగా ఉత్తర్వుల జారీ, రిజర్వేషన్ల ఖరారు, సిబ్బందికి శిక్షణ, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కనీసం పదిరోజుల సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్సుల్లో సవరించిన అంశాలతోనే రాష్ట్ర అసెంబ్లీ.. రెండు సవరణ బిల్లులనూ ఆమోదించింది. రెండు ఆర్డినెన్సులనే పరిశీలనకు కేంద్రానికి పంపిన గవర్నర్.. ఇప్పుడు అవే సవరణలతో తెచ్చిన రెండు బిల్లులను కూడా కేంద్ర ప్రభుత్వ పరిశీలనకే పంపే అవకాశం ఎక్కువగా ఉందని న్యాయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కారు.. దీనిపై న్యాయపోరాటం చేయాలన్న ఆలోచనా చేస్తోంది. రాష్ట్రపతి/గవర్నర్‌ల వద్దకు రాష్ట్రాలు పంపిన బిల్లులను మూడు నెలల్లోగా ఆమోదించాలంటూ సుప్రీం కోర్టు రూలింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి రాష్ట్రాల అభిప్రాయాలను సుప్రీం కోర్టు ప్రస్తుతం నమోదు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వాదనను ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వి, నిరంజన్‌రెడ్డి కోర్టు ముందుంచనున్నారు. ఆ సందర్భంగా.. గత 5 నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బీసీ బిల్లుల గురించి ప్రస్తావించనున్నారు. అలాగే గవర్నర్ ఆమోదం కోసం పంపిన రెండు ఆర్డినెన్సులూ 40 రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా పంపిన రెండు సవరణ బిల్లులపైనా గవర్నర్ నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెడితే.. ఎన్నికల నిర్వహణకు మరి కొంత గడువు ఇవ్వాలంటూ హైకోర్టును ప్రభుత్వం కోరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు

కవితను కాంగ్రెస్‌లోకి తీసుకోం

పైసలు, పవర్ కోసమే కవిత, కేటీఆర్ పంచాయితీ.. కాళేశ్వరం విచారణను పక్కదారి పట్టించేందుకే డ్రామా

- వచ్చే ఎన్నికలూ రేవంత్ నాయకత్వంలోనే
- నాకు మంత్రి పదవి ఇస్తామంటే వద్దన్నా
- మీడియాతో చిట్‌చాట్‌లో మహేష్‌కుమార్‌గౌడ్
- టీపీసీసీ చీఫ్‌గా నేటితో ఏడాది పూర్తి



హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కవితనే కాదని, అవినీతి మరకలున్న కేసీఆర్ కుటుంబం నుంచి ఎవరినీ చేర్చుకోబోమన్నారు. ఈ మేరకు ఏఐసీసీనుంచి ఆదేశాలూ ఉన్నాయని చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు కేసీఆర్ కుటుంబం ఈ డ్రామా చేస్తోందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా శనివారంతో ఏడాది కాలం పూర్తి చేసుకుంటున్న మహేష్‌కుమార్‌గౌడ్ సీఎల్పీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రాన్ని హరీశ్‌రావు, సంతోష్‌రావు ఎలా దోచుకున్నారో చెప్పి కవిత మంచిపని చేశారని ఆయన చెప్పారు. అయితే ఆమె ఇప్పుడు మాట్లాడుతున్న విషయాలపై అప్పుడే మాట్లాడి ఉంటే సెల్యూట్ చేసేవాళ్లమన్నారు. పైసలు, పవర్ కోసమే కవిత, కేటీఆర్‌ల పంచాయితీ జరుగుతోందన్నారు. సీబీఐలో అనేక లోసుగులు ఉన్నాయని, అయితే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై విచారణకు సీబీఐకి మించి మార్గం లేదన్నారు. సీబీఐ కాకుండా రాష్ట్ర దర్యాప్తు సంస్థలతోనే విచారణ చేయిస్తే బద్నాం చేసేవారన్నారు.

ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్‌ను కోరామని చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో బీసీ బిడ్డల నోటిదాకా వచ్చిన ముద్దను తినకుండా చేసింది కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లేనన్నారు. నిజామాబాద్ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించే మహత్తర అవకాశం తనకు దక్కిందన్నారు. వారం, పది రోజుల్లో పార్టీలోని అన్ని కమిటీలూ వేస్తామన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ వచ్చే నెలలో ఉంటుందన్నారు. అక్టోబరు నెలలో పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తలకు ఇన్సూరెన్సు కార్యక్రమాన్ని మొదలు పెడతామన్నారు. దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వం పోతుందని తాను అనుకోవట్లేదన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ గెలిచేది మా ప్రభుత్వమే

వచ్చే ఎన్నికల్లోనూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే వెళతామని, ప్రభుత్వాన్నీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తనకు మంత్రి పదవి ఇస్తామంటే వద్దని చెప్పానన్నారు. తనకు కులమంటే అభిమానమే కానీ.. కుల పిచ్చి లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బీసీలు కొన్ని రోజులు కులాన్ని పక్కన పెడితే మంచిదన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో కొంత గందరగోళం ఉందన్నారు. ఆయన అంశాన్ని ఏఐసీసీ చూసుకుంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షునిగా ఈ ఏడాది కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తనకు సహకరించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, పార్టీ అధ్యక్షునిగా తనకు మంచి కెమిస్ట్రీ ఉందన్నారు.



సీఎం రేవంత్‌తో బీఐజీ మెడికల్ కంపెనీ చైర్మన్, సీఈవో జార్జ్‌చాన్

రాష్ట్రంలో మరో కంపెనీ పెట్టుబడులు

- సీఎం రేవంత్‌తో జర్మనీ కంపెనీ ప్రతినిధుల భేటీ
- వైద్య పరికరాల తయారీ.. యూనిట్‌ను ప్రారంభించేందుకు ఆసక్తి

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మరో కంపెనీ ముందుకొచ్చింది. తెలంగాణలో వైద్య పరికరాల తయారీ యూనిట్‌ను ప్రారంభించేందుకు జర్మనీ దేశానికి చెందిన బీఈబీఐజీ మెడికల్ కంపెనీ ఆసక్తి కనబరుస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు ఆ కంపెనీ చైర్మన్, సీఈవో జార్జ్‌చాన్ ప్రతినిధి బృందం శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటుకు సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యూనిట్ ఏర్పాటుకు అనువైన స్థలం, ఇతర అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి నివేదికను అందించాలని సీఎం అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలతో పాటు క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే రేడియేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులకు ఆయన సూచించారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలుసుకున్న డెన్మార్క్ రాయబారి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

- బ్రూవరీలను విస్తరించండి
- డెన్మార్క్ రాయబారిని కోరిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో తెలంగాణ ఒకటి అని, రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని డెన్మార్క్ రాయబారి రాస్మస్ అబిల్డ్‌గార్డ్ క్రిస్టెన్‌సన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్రిస్టెన్‌సన్, మంత్రి ఉత్తమ్‌ను కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా క్రిస్టెన్‌సన్‌ను ఉత్తమ్ కోరారు. కార్ల్స్‌బర్గ్, ఇతర డానిష్ సంస్థలకు రాయితీతో భూమి, నీటిని అందించడానికి సిద్ధంగా ఉన్నామని, కొత్త బ్రూవరీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. వ్యవసాయం, ఐటీ, ఔషధాలు, పునరుత్పాదక ఇంధనం, ఆహార ప్రాసెసింగ్‌లు పెట్టుబడులకు బలమైన రంగాలని, క్లీన్ ఎనర్జీ నుంచి పాడిపరిశ్రమపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓఆర్ఆర్ బయట కొత్త పారిశ్రామిక, డేటా కారిడార్ జోన్‌లను ఏర్పాటు చేయనున్నామని, అతిపెద్ద రీజినల్ రింగ్‌రోడ్డులను వేయడానికి ప్రణాళికలు చేస్తున్నామని ఆయనకు మంత్రి చెప్పారు. ఇంధనం, ఫార్మా, పాడి పరిశ్రమలో పెట్టుబడులపై చర్చించారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.9 శాతమే అయినప్పటికీ జీడీపీలో 5శాతం వాటా కలిగి ఉందని.. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం దాదాపు 11 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని ఉత్తమ్ చెప్పారు. వచ్చే పదేళ్లలోపు తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్రం నుంచి అనేక దేశాలకు ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్నామన్నారు. దేశానికి వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ ఉందన్నారు. 120 కంటే ఎక్కువ దేశాలకు మందులు, వ్యాక్సిన్‌లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. డెన్మార్క్ రాయబారి స్పందిస్తూ క్లీన్ ఎనర్జీ, వ్యవసాయం, నీరు, ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతున్నామని, డెన్మార్క్ కంపెనీలు బెంగళూరుకు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయన్నారు. మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి పరిశీలన చేస్తున్నామన్నారు.

తెలంగాణలో 'ఖేలో ఇండియా గేమ్స్-2026' నిర్వహించండి

- కేంద్రమంత్రి మాండవీయాకు వాకిటి శ్రీహరి వినతి



కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): 'ఖేలో ఇండియా గేమ్స్- 2026' క్రీడలను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఖేలో ఇండియా 8వ ఎడిషన్‌కు రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరామని, గతంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే అంశంపై ఆయనను కలిసిన విషయాన్ని గుర్తు చేశామని శ్రీహరి అన్నారు. అలాగే, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో క్రీడా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించారని, త్వరలో మూడురోజుల పర్యటన కోసం రాష్ట్రానికి వస్తానని కేంద్రమంత్రి చెప్పినట్లు శ్రీహరి తెలిపారు.

ఎన్‌డీఎస్‌ఏకు మేడిగడ్డ రిపోర్టులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో ఏర్పడిన పగుళ్లు, మార్పులపై ఐదు రకాల నివేదికలను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కు తెలంగాణ నీటిపారుదల శాఖ సమర్పించింది. 2023 అక్టోబరు 21న కుంగిపోయిన ఏడో బ్లాక్‌కు సంబంధించిన ఈ నివేదికలను మే 1 నుంచి జూలై 15 వరకు సేకరించారు. వీటిలో 1డీ, 3డీ క్రాక్ మీటర్ మానిటరింగ్, పిజోమీటర్, మెకానికల్ స్కేల్ క్రాక్ మీటర్, ఆప్టికల్ టార్గెట్స్ మానిటరింగ్ రిపోర్టులు ఉన్నాయి. ఈ నివేదికల ఆధారంగా ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు ఏడో బ్లాక్‌లోని 11 పిల్లర్ల (పియర్లు) పగుళ్లను విశ్లేషించనున్నారు. గతంలో కూడా విచారణ జరిపిన ఎన్‌డీఎస్‌ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ బ్లాక్‌ను పూర్తిగా తొలగించి, కొత్తగా నిర్మించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశాయి.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.25 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ప్రభుత్వం రూ.25 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమానికి 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించిన ప్రభుత్వం అందులో భాగంగా మొదటి విడతగా రూ.25 కోట్లు విడుదల చేసింది. పేద బ్రాహ్మణుల గృహనిర్మాణం, వైద్యం, వ్యాపారం, పిల్లల ఉన్నత విద్య, వివాహం, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు ఈ నిధులను వినియోగించనున్నారు. నిధులు విడుదల చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి పరిషత్ వైస్ చైర్మన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెలకూ డ్రగ్స్

> పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయాలి. నేను కూడా వచ్చి పిల్లలతో కలిసి భోజనం చేస్తా. అప్పుడే పిల్లలకు అందించే భోజనం విషయంలో తప్పులు జరగకుండా ఉంటాయి



శిల్పకళావేదికలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తున్న సీఎం రేవంత్

> పేదలు చదువుకున్నప్పుడే రాష్ట్రం తలరాత మారుతుంది. వారి బాధ్యత టీచర్ల పైనే ఉంది. దేశ, తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది. దానిని మీ చేతుల్లో పెడుతున్నా. మీరు, నేను కలిసి బలమైన తెలంగాణను పునర్నిర్మిద్దాం
>
> \- సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

శుభాకాంక్షలు చెప్పి మాట్లాడారు. "గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్'ను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో గంజాయి మొక్క మొలిచినా భరతం పట్టేందుకే దీనిని తీసుకొచ్చాం. పిల్లల భవిష్యత్తు కోసమే ఈ వ్యవస్థలన్నీ! విద్య కోసమే ఏడాదికి రూ.40 వేల కోట్లను ఖర్చు పెడుతున్నాం. పిల్లల భవిష్యత్తే.. దేశ భవిష్యత్తు. దానిని ఉపాధ్యాయులు చేతుల్లో పెడుతున్నా" అని వ్యాఖ్యానించారు. దాదాపు 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులే ఉన్నారని, 11 వేల ప్రైవేటు స్కూళ్లలో మాత్రం 34 లక్షల మంది చదువుతున్నారని, దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. ప్రైవేటు టీచర్ల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాధికులని చెబుతూ.. ప్రభుత్వ బడుల పట్ల పిల్లల్లో విశ్వాసం కల్పించలేకపోవడమే ఇందుకు కారణమన్నారు. "ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యాశాఖలో సమస్యలు పేరుకుపోయాయి. పదేళ్లపాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు రాలేదు. బదిలీలు జరగలేదు. ఏడేళ్లపాటు టీచర్ల నియామకాలు జరగలేదు. 2017లో ఒక నోటిఫికేషన్ వచ్చింది. ఆ తర్వాత మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. ధనిక రాష్ట్రమని చెప్పిన గత పాలకులు డైట్, కాస్మెటిక్ చార్జీలను కూడా పెంచలేదు. వాటిని కూడా మేమే పెంచాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో శుభ్రతకు రూ.130 కోట్లు మంజూరు చేశాం. విద్యా కమిషన్ ఏర్పాటు చేశాం. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యను ప్రభుత్వ బడుల్లో అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. మా ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో 3 లక్షల మంది విద్యార్థులు ప్రవేశించారు" అని వివరించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల కంటే నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిన పూనుదామని పిలుపునిచ్చారు. ఏటా 200 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేయించనున్నట్లు తెలిపారు. గత పాలకులు మెరుగైన వసతులు కల్పించలేదని, సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. "గత ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు కొంతమంది ప్రైవేటు యూనివర్సిటీలు పెట్టుకున్నారు. విద్యను వ్యాపారంగా, లాభసాటి వనరుగా మార్చుకున్నారు. విద్యపై ఆధిపత్యాన్ని చెలాయించాలని ప్రయత్నించారు. వర్సిటీల్లో ప్రొఫెసర్ల వయసును పెంచే ఆలోచన కూడా చేయలేదు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా వర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చింది. కాకతీయ వర్సిటీ కాలగర్భంలో కలిసే పరిస్థితికి తెచ్చారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించడానికే విద్య శాఖను నా దగ్గరే ఉంచుకున్నాను" అని వివరించారు. గడిచిన పదేళ్లలో గురు పూజోత్సవం నిర్వహించారా!? చేస్తే ఆ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు అవసరమని చెప్పేందుకే తాను వచ్చానన్నారు.

పిల్లలతో మాటామంతీ.. ఉపాధ్యాయులతో సహపంక్తి

గురు పూజోత్సవం సందర్భంగా వేదిక దగ్గర విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్ సందర్శించారు. ఆ సమయంలో పిల్లలతో ఆసక్తిగా మాట్లాడారు. వారు తయారు చేసిన వాటి గురించి ప్రత్యేకంగా అడిగి మరీ తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



కేజ్రీవాల్ రెండోసారి సీఎం అయ్యారంటే విద్యాభివృద్దే కారణం

ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి, మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి అక్కడ ఆయన విద్యలో తీసుకొచ్చిన మార్పులే కారణమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ విషయంలో తనకు కొంత స్వార్థం ఉందని, ఉపాధ్యాయులు బాగా పనిచేస్తే తాను కూడా రెండోసారి సీఎం అయ్యే అవకాశం వస్తుందంటూ రేవంత్ నవ్వులు పూయించారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు తాను కూడా కష్టపడతానని, అందుకు తాను ఏం చేయాలో చెబితే కచ్చితంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఏటా 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణులై బయటకు వస్తున్నారని, వారికి తగిన ఉద్యోగాలు రావడం లేదని, ఈ సమస్యను అధిగమించడానికే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, సమీకృత గురుకులాలను ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పారు. ఐటీఐల్లో 1956 నాటి డీజిల్ మెకానిక్ పాఠాలనే ఇప్పటికీ బోధిస్తున్నారని, అందుకే, టాటా కంపెనీతో ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా వాటిని మార్చామని వివరించారు. చదువుతోనే కాకుండా క్రీడల్లోనూ భవిష్యత్తు ఉంటుందని, పిల్లలకు ఏ విభాగంలో ఆసక్తి ఉందో గుర్తించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుకునే సమయంలో తన టీచర్లు పాఠాలు చెప్పిన విధానంతోపాటు వారి దగ్గరి నుంచి నీతి, నిజాయితీ, సద్గుణాలు, సమయపాలన నేర్చుకున్నానని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా చెప్పారు. తాను ఇవ్వాళ కార్యదర్శి హోదాలో ఉండడానికి తనకు పాఠాలు చెప్పిన రవీంద్రన్ అనే టీచరే కారణమని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



కెమెరా ప్రదానం చేసిన మెమొంటో

శిల్పకళా వేదికలో గురు పూజోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కెమెరా అందరినీ ఆకర్షించింది. 'గురు పూజోత్సవం' మెమొంటోను సీఎం రేవంత్ అందించినట్టుగా దాని నుంచి ఫొటోలు రావడం విశేషం. వేదిక వద్ద ఓ కెమెరాను ఏర్పాటు చేశారు. దాని ఎదురుగా బహుమతి తీసుకుంటున్నట్టు నిలబడితే చాలు.. సెకన్లలోనే సీఎం చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్నట్టు ఫొటో వచ్చేస్తోంది. దాంతో, అక్కడికి వచ్చిన వారంతా ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపారు.



3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే లక్ష్యం


విద్యారంగంలో భారీగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు.. ఐఎస్‌బీ నిర్వాహకులు స్కిల్ వర్సిటీని సందర్శించాలి

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి
- ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి



మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జ్ఞాపిక ఇస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణ రైజింగ్- 2047'ను సాధించడం, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఆయన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. విద్యా రంగంలో ఎవరు ఊహించని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి ఉచితంగా అందించడానికి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాలను నిర్మిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణాలను ప్రారంభించామని వివరించారు. విద్యార్థులు బయటికి వెళ్లగానే ఉద్యోగం పొందేలా 'స్కిల్ యూనివర్సిటీ'లో సిలబస్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆ యూనివర్సిటీ ఇప్పటికే ప్రారంభమై, తొలి సంవత్సరంలోనే వందలాది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని, 2025 చివరి నాటికి దాని శాశ్వత క్యాంపస్ 'ఫ్యూచర్ సిటీ'లో ఏర్పడుతుందని తెలిపారు. ఐఎస్‌బీ నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం కోరారు. గురు పూజోత్సవం రోజు ఐఎస్‌బీలో ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను ప్రారంభించడం తన అదృష్టమన్నారు. ఇందుకు మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ అందించిన సహకారం ఒక విరాళం మాత్రమే కాదని, అది జ్ఞానం, నాయకత్వం, సమష్టి భవిష్యత్తుపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక అన్నారు. మోతీలాల్ ఓస్వాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్‌బీ వయస్సులో చిన్నదే అయినా, ఖ్యాతిలో విశిష్ట స్థానంలో నిలిచిందన్నారు. గతేడాది ఒక్క సంవత్సరంలోనే ఐఎస్‌బీ దాదాపు 200 ప్రోగ్రాముల ద్వారా 6,000 మందికి పైగా ప్రొఫెషనల్స్‌కు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ఐఎస్‌బీ భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు. ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ సెంటర్... దేశం గర్వపడేలా సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మోతీలాల్ ఓస్వాల్, ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా పాల్గొన్నారు.



నర్సింగ్‌లో జర్మన్, జపనీస్ పాఠాలు!

- రాష్ట్రంలోని 37 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో త్వరలో తరగతులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో త్వరలో జర్మన్, జపనీస్ భాషలను బోధించనున్నారు. బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు తరగతుల్లో జర్మన్, జపనీస్ పాఠాలు చెప్పి ఆయా భాషలను నేర్పించనున్నారు. విదేశాల్లో నర్సులకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో నర్సుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలు నేర్పించేందుకు హైదరాబాద్‌లోని ఇఫ్లూ(ది ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ)తో త్వరలో అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఈ ఒప్పందం జరిగితే రాష్ట్రంలోని 37 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేసి జర్మన్, జపనీస్ భాషలను బోధిస్తారు. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు ఫారిన్ లాంగ్వేజ్ సబ్జెక్టులుగా జర్మన్, జపనీస్ ఉంటాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. నిజానికి, భారతీయ నర్సులకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా అరబ్ తదితర దేశాల్లో భారతీయ నర్సులకు ఆకర్షణీయమైన వేతనాలు చెల్లిస్తారు. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే నర్సుల్లో కొందరు విదేశాలకు వెళ్లిపోతున్నారు. అయితే, విదేశాల్లో నర్సుగా పని చేయాలనుకునే వారు ఆయా దేశాల నర్సింగ్ కౌన్సిల్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులై రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. జపాన్, జర్మనీ విషయానికొస్తే బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన నర్సులకు తమ భాషపై ఆ దేశాలు రాత పరీక్ష నిర్వహిస్తాయి. ఈ నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు జపాన్, జర్మనీ భాషలను నేర్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. కాగా, ఒక్క కెనడాలో రాబోయే ఐదేళ్లలో 1.17 లక్షల మంది నర్సులు అవసరం అవుతారని ఓ అంచనా. ఇక యూకేలో 41000 మంది నర్సుల కొరత ఉన్నట్టు కొన్ని గణాంకాలు చెబుతున్నాయి.

విదేశాల్లో భారతీయ నర్సులకు ఇచ్చే సగటు వార్షిక వేతనాలు ఇలా

దేశం	సగటు వార్షిక వేతనం
అమెరికా	75,000-85000 డాలర్లు
డెన్మార్క్	83,888 డాలర్లు
స్విట్జర్లాండ్	90000-లక్ష డాలర్లు
లక్సెంబర్గ్	87000-90000 డాలర్లు
ఆస్ట్రేలియా	65000-95000 డాలర్లు
నార్వే	70000-80000 డాలర్లు
కెనడా	50,000-75,000 డాలర్లు
జర్మనీ	38,000-55,000 డాలర్లు

సీఎస్ కార్యాలయం అంధకారంలో ఉన్నట్లుంది!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అన్ని జిల్లాల కలెక్టర్లు, దేవాదాయ శాఖ కమిషనర్, వక్ఫ్ బోర్డు ఇతర సంస్థలు తమ పరిధిలోని నిషేధిత జాబితా భూముల వివరాలు సేకరించి, క్రోడీకరించి తగిన నమూనాలో పంపాలని ఈ నెల 1న ప్రభుత్వం మెమో జారీ చేసిందని చెప్పారు. వాదనలు విన్న జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం.. నిషేధిత భూముల వివరాల సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు సీఎస్ ప్రమాణపత్రం దాఖలు చేయలేదని, ప్రత్యక్షంగా హాజరు కావాలన్న ఆదేశాలను సైతం పాటించలేదని గుర్తుచేసింది. ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోరుతూ కనీసం అప్లికేషన్ దాఖలు చేయలేదని అసహనం వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రవర్తనను సీఎస్ కార్యాలయం నుంచి ఊహించలేదంది. సీఎస్ కార్యాలయం అంధకారంలో ఉన్నట్లు తెలుస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అఫిడవిట్ దాఖలు చేయడానికి సీఎస్ కార్యాలయానికి చివరి అవకాశంగా మరో వారం గడువు ఇస్తున్నామని.. దాఖలు చేయకపోతే సీఎస్ ప్రత్యక్షంగా తమ ఎదుట హాజరుకావాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.

తీర్పులు అమలు చేయకపోవడం వల్లే..

నిషేధిత జాబితాపై గతంలో హైకోర్టు పూర్తిస్థాయి ధర్మాసనం 'వింజమూరి రాజగోపాలాచారి' కేసులో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అలాగే హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం 'ఇన్వెక్టా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్' కేసులో సైతం ఒక తీర్పును వెలువరించింది. నిషేధిత జాబితా భూముల వివాదాలు పరిష్కరించడానికి ఒక కమిటీ లేదా ఫోరం ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలు ఇప్పటికీ అమలు కాకపోవడమే హైకోర్టు ఆగ్రహానికి కారణమైంది. గత తీర్పులు అమలు చేయకపోవడం వల్లే నిషేధిత జాబితా నుంచి తమ భూములు తొలగించాలంటూ హైకోర్టుకు భారీ ఎత్తున పిటిషన్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత తీర్పులు అమలు చేయాలని, నిషేధిత జాబితా భూముల వివరాలు సేకరించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీలపై యథాతథ స్థితి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల బదిలీలు, సంబంధిత విధానం అమలుపై హైకోర్టు యథాతథ స్థితిని విధించింది. బదిలీలపై ఉద్యోగుల అభ్యంతరాలు స్వీకరించాలనే హైకోర్టు గత ఉత్తర్వులను పట్టించుకోకుండా రాష్ట్ర స్థాయి కన్వీనర్ ఆగస్టు 22న 'పీఏసీఎస్ ఉద్యోగుల యూనిఫాం హెచ్‌ఆర్ పాలసీ- ట్రాన్స్‌ఫర్ పాలసీ ఇంప్లిమెంటేషన్'కు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారని.. వాటిని కొట్టేయాలని పేర్కొంటూ రాష్ట్ర వ్యవసాయ సహకార సొసైటీ ఉద్యోగుల సంఘం సహా పలువురు ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. గతంలో ఇదే హైకోర్టు బదిలీల పాలసీని కొట్టేసిందని, ఉద్యోగుల అభ్యంతరాలు స్వీకరించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఆ ఆదేశాలను పట్టించుకోకుండా బదిలీలు చేపట్టాలని ఆదేశిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్, చీఫ్ జనరల్ మేనేజర్, ఎండీ, పీఏసీఎస్ సెల్ కన్వీనర్, సీఈవో తదితరులకు నోటీసులు జారీచేసింది. బదిలీలపై యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని పేర్కొంటూ విచారణను అక్టోబరు 7కు వాయిదా వేసింది.


పద్మావతి ఆలయం వద్ద తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుచానూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తదితరులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.


తిరుమలలో కుటుంబసభ్యులతో రామకృష్ణారావు

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎస్

తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

» ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవుల్లో బలగాల కూంబింగ్

చర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావోయిస్టు హతమయ్యారు. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు కూబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ ఆపరేషన్ జరుగుతుండగా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందిగా, మరికొందరు మావోయిస్టులు తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఒక 303 రైఫిల్, 2 బీజీఎల్స్ లాంచర్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో చండీయాగం

» పాల్గొన్న కేసీఆర్ దంపతులు

గజ్వేల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌజ్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చండీయాగం నిర్వహించినట్లు తెలిసింది. ఈ యాగంలో కేసీఆర్, ఆయన సతీమణి శోభ పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడిన కేసీఆర్, ఆరోగ్యం కుదుటపడటంతో చండీయాగం నిర్వహించినట్లు తెలిసింది. కుటుంబంలో నెలకొన్న అశాంతి నేపథ్యంలో పలువురి సూచన మేరకు కేసీఆర్ యాగాన్ని జరిపినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నట్లు తెలిసింది.

ఆస్తి కోసం తండ్రిని చంపిన కసాయి కొడుకు

కల్వకుర్తి/ఉప్పునుంతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కన్న తండ్రి ప్రాణాలు తీశాడు ఓ కసాయి కొడుకు. వృద్ధాప్యంలో తండ్రికి తోడుగా ఉండాల్సిన కుమారుడే.. కొట్టి చంపి వాగులో వేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణంలో జరిగింది. వాసవీ నగర్ కాలనీకి చెందిన బాలయ్య(70) గురువారం తన పొలంలో పని చేసుకుంటుండగా.. అతని కుమారుడు బీరయ్య వచ్చి దాడికి దిగాడు. అనంతరం తండ్రిని తన బావమరిది సాయంతో కారు డిక్కీలో తీసుకెళ్లి డిండి చింతపల్లి బ్రిడ్జి వద్ద దుందుభి వాగులో పడేశాడు. తన అన్న బాలయ్య ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీపై తమ్ముడు మల్లయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ బి. నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి బృందం విచారణ చేపట్టి.. సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బీరయ్యను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే మూడు ఎకరాలు అమ్ముకున్న తండ్రి ఉన్న ఒక ఎకరా కూడా అమ్ముకుంటాడనే కోపంతో తండ్రిని చంపానని నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. బాలయ్య కోసం డ్రోన్ కెమెరా, గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం రాత్రి మృతదేహం లభ్యమైంది.

రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

» రాత్రి 8:58కి ప్రారంభమై అర్ధరాత్రి 2:25 గంటల వరకు

» 2022 తర్వాత ఎక్కువ సమయం కనిపించే అవకాశం

బెంగళూరు, సెప్టెంబరు 5: ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. 2022 తర్వాత భారత్ నుంచి అత్యంత ఎక్కువ సేపు కనిపించే సంపూర్ణ చంద్రగ్రహణంగా ఇది నిలవనుందని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే 2018 జూలై 27 తర్వాత భారత్‌లోని అన్ని ప్రాంతాల నుంచి సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని వీక్షించడం ఇదే మొదటిసారి కానుందని పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దివ్యా ఒబెరాయ్ చెప్పారు. మళ్లీ ఇలాంటి చంద్ర గ్రహణాన్ని చూడాలంటే 2028 డిసెంబరు 31 వరకూ వేచి చూడాలన్నారు. ఈ నెల 7, 8 తేదీల (ఆది, సోమవారం) మధ్య ఈ సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తుందని వెల్లడించారు. పబ్లిక్ ఔట్‌రీచ్, ఎడ్యుకేషన్ కమిటీ (పీవోఈసీ) విడుదల చేసిన ప్రకటన ప్రకారం... ఆదివారం రాత్రి 8.58 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమవుతుంది. రాత్రి 9.57 గంటల నుంచి పాక్షిక దశను గమనించవచ్చు. సంపూర్ణ గ్రహణ దశ రాత్రి 11.01 గంటలకు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇది అర్ధరాత్రి 12.23 గంటల వరకూ కొనసాగుతుంది. అంటే సంపూర్ణ గ్రహణ వ్యవధి దాదాపు 82 నిమిషాలు ఉంటుంది. 8వ తేదీ తెల్లవారుజామున 2.25 గంటలకు చంద్ర గ్రహణం ముగుస్తుంది.

పదేళ్ల బాలుడికి గుండె పోటు.. తల్లి ఒడిలోనే కన్నుమూత

కొల్హాపూర్: ఆటలాడుకునే పదేళ్ల బాలుడికి గుండెపోటు రావడం, అనంతరం తల్లి ఒడిలో ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా కోడోలి గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శ్రావణ్ గావడే అనే బాలుడు ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్నేహితులతో కలిసి ఆడుకున్నాడు. ఒంట్లో ఏదో ఇబ్బంది అనిపించడంతో ఇంటికి వెళ్లిపోయాడు. తల్లి ఒడిలో పడుకొని సేద తీరాడు. కొద్దిసేపటికే గుండె పోటు రావడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.

భక్తి.. కీర్తి.. సేవ!

గణనాథుడి లడ్డూ కోసం పోటాపోటీ వేలంపాటలు

» లక్షల నుంచి కోట్లకు చేరుతున్న లడ్డూ

» లడ్డూ పొందితే మంచి జరుగుతుందని కొందరిలో నమ్మకం

» స్థానికంగా గుర్తింపు, రాజకీయ పలుకుబడి కోసం మరికొందరి ఆరాటం

» పలుచోట్ల లడ్డూ వేలం సొమ్ముతో సేవా కార్యక్రమాలు

» వేలం ఉండని ఖైరతాబాద్ గణపతి లడ్డూ

హైదరాబాద్‌లో ఎక్కువ ధర పలికిన లడ్డూలు

ప్రాంతం	వేలం సొమ్ము
రిచ్‌మండ్ విల్లా (2025)	రూ. 2.3 కోట్లు
రిచ్‌మండ్ విల్లా (2024)	రూ. 1.87 కోట్లు
మైంహోం భుజ (2025)	రూ.51.07 లక్షలు
మైంహోం భుజ (2024)	రూ.29.00 లక్షలు
బాలాపూర్ (2024)	రూ.30.01 లక్షలు

(లడ్డూను చివరిరోజున వేలం వేస్తారు కాబట్టి.. శనివారం జరిగే నిమజ్జనానికి ముందు మరింత భారీ వేలంపాటలు జరిగే అవకాశం ఉంది)

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణేశుడి లడ్డూ అంటే ఇప్పుడు ఎంతో క్రేజ్.. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణేశుడి ప్రసాదాన్ని పొందేందుకు ఎంత ఖర్చయినా సరే అన్నట్టుగా భక్తులు పోటీపడుతున్నారు. వేలు, లక్షలే కాదు కోట్ల రూపాయల వరకు వేలం పాడి లడ్డూను సొంతం చేసుకుంటున్నారు. దీనిని చూసి అంతా నోరెళ్లబెడుతున్నారు. లడ్డూకు ఇంత పోటీ వెనుక భక్తితోపాటు గుర్తింపు కోసం ఆరాటం, సేవ చేయాలనే ఉదాత్త లక్ష్యం కూడా ఉండటం విశేషం.

మంచి జరుగుతుందన్న నమ్మకంతో..

వినాయక నవరాత్రుల సందర్భంగా గణేశుడికి ప్రసాదంగా పెట్టిన లడ్డూను చివరి రోజున భక్తులకు పంచేవారు. అక్కడక్కడా వేలంపాట నిర్వహించేవారు. అదీ స్వల్ప మొత్తాల్లోనే ఉండేది. కానీ కొన్నేళ్లుగా దాదాపు ప్రతిచోటా లడ్డూ వేలం వేస్తున్నారు. గణేశుడి లడ్డూను సొంతం చేసుకుంటే అదృష్టం వస్తుందని, మంచి జరుగుతుందనే నమ్మకంతో డిమాండ్ పెరిగింది. ఒకసారి వేలంలో లడ్డూ పొందినవారు తర్వాతి ఏడాది కూడా మళ్లీ వేలానికి వస్తుండటంతో వారికి మంచి జరిగి ఉంటుందనే అభిప్రాయంతో మిగతా వారూ పోటీపడుతున్నారని గణేశ మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.


శుక్రవారం మూసాపేట్ ప్రగతినగర్‌లో టీమ్8 యూత్ అసోసియేషన్ గణపతి లడ్డూను రూ.5.5 లక్షలకు కైవసం చేసుకున్న మనుకొండ శిరీష, ఆమె కుమార్తె

గుర్తింపు, రాజకీయ పలుకుబడి కూడా..

రియల్ ఎస్టేట్, మద్యం వ్యాపారులు, ఇతర వ్యాపారాల్లో బాగా సంపాదించినవారు కొందరు.. మంచి జరుగుతుందనే నమ్మకంతోపాటు గుర్తింపు కోసం కూడా గణపతి లడ్డూను పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ ధరకు వేలం పాడుతున్నారు. లక్షలు వెచ్చించి దక్కించుకుంటుండటంతో స్థానికుల్లో వారి పేరు చర్చనీయాంశంగా మారుతోంది. ఇలాంటి వ్యాపారుల్లో చాలా మంది ఏదో ఓ రాజకీయ పార్టీలో స్థానిక నేతలు మారుతున్నారు.

సేవా కార్యక్రమాలకు.. మరుసటి ఉత్సవాలకు..

పలుచోట్ల కాలనీలు, అపార్ట్‌మెంట్లలోని పెట్టిన గణేశ మండపాల్లో లడ్డూ వేలంతో వచ్చిన సొమ్మును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. హైదరాబాద్ బండ్లగూడలోని రిచ్‌మండ్ విల్లావాసులు గత ఐదేళ్లుగా లడ్డూ వేలం డబ్బును తమ టౌన్‌షిప్‌లో పని చేసే కూలీల పిల్లల చదువులకు, ఇతర సేవా కార్యక్రమాలకు అందిస్తున్నారు. రిచ్‌మండ్ విల్లా టౌన్‌షిప్‌లో గణేశుడి లడ్డూ ఈ ఏడాది ఏకంగా రూ.2.3 కోట్లకు తీసుకోవడం గమనార్హం. ఇక నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లోని పలు అపార్ట్‌మెంట్లలో లడ్డూ వేలం సొమ్మును ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారు. ఇప్పటివరకు లడ్డు వేలం ద్వారా వచ్చిన మొత్తం రూ.1.64 కోట్లతో బాలాపూర్‌లోని దేవాలయాలు, పాఠశాలల అభివృద్ధికి ఖర్చుచేసినట్లు బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు. కాగా, గణేశుడి లడ్డూ వేలం ద్వారా వచ్చిన సొమ్మును కొంతమంది నిర్వాహకులు మరుసటి ఏడాది జరిగే ఉత్సవాల కోసం వినియోగిస్తుంటారు.

ఖైరతాబాద్ గణేశ్ వద్ద భారీ లడ్డూ ఉండదు

దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఖైరతాబాద్ మహాగణపతి వద్ద ప్రస్తుతం భారీ లడ్డూ ప్రసాదం ఏమీ పెట్టడం లేదు. నిజానికి ఇటీవలి వరకు భారీ లడ్డూను గణపయ్య చేతిలో, వేదికపై ఉంచేవారు. దానిని వేలం వేయకుండా భక్తులకు పంపిణీ చేసేవారు. అయితే ఈ లడ్డూ ప్రసాదం కోసం భారీగా భక్తులు రావడం, తీవ్ర ఇబ్బంది తలెత్తుతుండటంతో పాటు కొందరికే ప్రసాదం పంపిణీ చేయడం బాగోలేదన్న ఆలోచనతో భారీ లడ్డూను పెట్టడాన్ని ఉత్సవ కమిటీ నిలిపివేసింది. ప్రస్తుతం వినాయకుడి చేతిలో కృత్రిమ లడ్డూను పెడుతున్నారు. భక్తులెవరైనా లడ్డూ తీసుకొస్తే గణేశుడి వద్ద పెట్టి పూజ చేసిన వెంటనే వారికి అందజేస్తున్నారు.



శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలపై లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ

» వ్యాపారిని రూ.60 కోట్ల మేర మోసగించినట్లు కేసు

» వ్యాపారం కోసం రుణం తీసుకొని సొంతానికి వాడుకున్నారని ఆరోపణ

ముంబయి, సెప్టెంబరు 5: బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రాలపై ముంబయి పోలీసులు లుక్అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. వారు విదేశాలకు పరారు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికార్లను సూచిస్తూ ఆర్థిక నేరాల విభాగం ఈ సర్క్యులర్ జారీ చేసింది. రుణం-పెట్టుబడి పేరుతో ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసగించారంటూ ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. దీనిపై విచారణ జరగాల్సి ఉన్నందున వారు విదేశాలకు పరారు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారి ప్రయాణాలపై కన్నేసి ఉంచాలని సూచించింది. లోటస్ క్యాపిటల్ ఫైనాన్స్ సర్వీసెస్ డైరెక్టర్ దీపక్ కొఠారీ (60) ఆ దంపతులపై ఫిర్యాదు చేశారు. బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లయిన రాజ్ కుంద్రా, శిల్పా శెట్టిలు తనను తొలుత రూ.75 కోట్లు రుణం అడిగారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి నెలా వాయిదాల రూపంలో అసలు, వడ్డీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వ్యాపారం కోసం ఇచ్చిన రుణాన్ని సొంత అవసరాల కోసం వాడుకున్నారని కొఠారీ ఆరోపించారు. 2017లో కంపెనీని దివాళా సంస్థగా ప్రకటించారని తెలిపారు. దాంతో కొఠారీ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టారు. దీనిపై శిల్ప, రాజ్‌ల న్యాయవాది ప్రకటన జారీ చేస్తూ ఇది సివిల్ కేసని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో 2024లోనే పరిష్కారమయిందని తెలిపారు.

గ్రిల్ చికెన్‌లో 'లెగ్ పీస్' వడ్డించని హోటల్‌కు జరిమానా



» 15 వేలు చెల్లించాలన్న వినియోగదారుల ఫోరం

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రిల్ చికెన్‌లో 'లెగ్ పీస్' లేకుండా వడ్డించిన ఓ హోటల్ యాజమాన్యానికి వినియోగదారుల ఫోరం రూ.10 వేల జరిమానా విధించింది. కేసు ఖర్చులకు మరో రూ.5వేలు కలిపి మొత్తం రూ.15వేలను వినియోగదారునికి చెల్లించాలని ఆదేశించింది. కోయంబత్తూరుకు చెందిన క్రిస్టోఫర్ ఎడిసన్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఉన్న ఓ బిర్యానీ హోటల్‌కు గత జనవరి 14న కలిసి వెళ్లాడు. తందూరి చికెన్, గ్రిల్ చికెన్ ఆర్డరు చేశాడు. గ్రిల్ చికెన్‌లో లెగ్‌పీస్ లేకపోవడంతో హోటల్ సిబ్బందిని ప్రశ్నించాడు. అయితే వారు అతడిని బెదిరించారు. కుటుంబ సభ్యుల ఎదుట జరిగిన ఈ బెదిరింపుతో తాను మానసిక క్షోభ అనుభవించానని అతడు ఫోరంలో ఆ వెంటనే ఫిర్యాదు చేశాడు. హోటల్ బిల్ రూ.1,196 అయిందని, ఆ మొత్తంతో పాటు తన మానసిక క్షోభకు నష్టపరిహారం ఇప్పించాలని అభ్యర్థించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఫోరం.. హోటల్ యాజమాన్యానికి రూ.10 వేల జరిమానా విధించింది. కేసు ఖర్చులకు మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు ఇవ్వాలని ఆదేశించింది.

హజ్రత్‌బల్ అభివృద్ధి పనుల శిలాఫలకంపై అశోక చిహ్నం

ఇస్లామిక్ ధర్మానికి విరుద్ధమని నిరసన

శ్రీనగర్: శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంపై అశోక చిహ్నం చెక్కించడం వివాదాస్పదమయింది. ముస్లిం ధర్మం విగ్రహారాధనకు వ్యతిరేకమని, అలాంటిది ముస్లిమత ప్రదేశం వద్ద దీన్ని ఎలా ఏర్పాటు చేస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. హజ్రత్‌బల్ దర్గాలో మహమ్మద్ ప్రవక్త జ్ఞాపక చిహ్నం ఉండడం విశేషం. అక్కడ జరిగిన అభివృద్ధి పనుల ఆవిష్కరణకు సంబంధించిన శిలాఫలకాన్ని జమ్మూ-కశ్మీర్ వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసింది. దానిపై జాతీయ చిహ్నమైన అశోక చిహ్నాన్ని చెక్కించింది. ఈ శిలాఫలకాన్ని వక్ఫ్ బోర్డు చైర్‌పర్సన్ దరక్షాన్ అంద్రాబీ ఆవిష్కరించారు. ముస్లింల మనోభావాలను గుర్తించకుండా వక్ఫ్ బోర్డు చైర్‌పర్సన్ ఆ చిహ్నాన్ని చెక్కించడం సిగ్గుచేటని పలువురు విమర్శించారు.

మియాపూర్ బస్ బాడీ వర్క్‌షాప్‌కు మంగళం!

» ఉప్పల్‌కు తరలించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం

» ఆ స్థలాన్ని ఆదాయ వనరుగా మార్చుకునే యోచన

హైదరాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో లాభాల బాటలో పయనిస్తున్న టీజీఎస్ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపైనా దృష్టిసారిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న బస్ బాడీ బిల్డింగ్ వర్క్‌షాప్‌ను ఎత్తివేయాలని సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. దీనిని ఉప్పల్‌కు తరలించి ఆ స్థలాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ కమిటీ గత నెల 19న బస్‌భవన్‌లో సమావేశమై పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. మియాపూర్ వర్క్‌షాప్‌ను ఉప్పల్‌కు తరలించే ప్రతిపాదనలపై ఆయా విభాగాల అధికారులు చర్చించారు. కమిటీ సభ్యులు శనివారంలోగా నివేదిక సమర్పించాలని గడువు విధించారు. సుమారు 20 ఏళ్ల నుంచి కొనసాగుతున్న మియాపూర్ వర్క్‌షాప్ ఆర్టీసీ బస్సుల బాడీకి సంబంధించిన నిర్మాణ పనుల్ని చేపడుతుంది. బస్ బాడీల తయారీ, మరమ్మతులు వంటివి ఇక్కడ చేస్తుంటారు. కీలకమైన ఈ వర్క్‌షాప్‌ను పూర్తిగా ఉప్పల్‌కు తరలించి ఈ స్థలాన్ని సంస్థకు ఆదాయ వనరుగా మార్చుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. ఉప్పల్, కరీంనగర్ యూనిట్లలో ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో అవసరంమేరకు మార్పులు, చేర్పులు చేయనున్నారు. మానవ వనరుల సద్వినియోగం, తయారీ యూనిట్లను కేంద్రీకరించడంలో భాగంగా యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉంటే.. కొన్నిరోజుల క్రితం హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న నిజాంకాలం నాటి గౌలిగూడ బస్టాండ్ స్థలాన్ని రూ.400 కోట్లకు తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారన్న అంశం తీవ్ర దుమారం రేపింది. ఈ విషయాన్ని యాజమాన్యం ఖండించలేదు. తాకట్టు పెడుతున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు మియాపూర్ వర్క్‌షాప్ స్థలం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి ఆదాయ వనరుగా మార్చుకునేందుకు పావులు కదుపుతుండటం సంస్థలో చర్చనీయాంశంగా మారింది. ఆదాయం కోసం ఇప్పటికే హైదరాబాద్, ఇతర జిల్లాల్లోని కొన్ని ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. మరికొన్ని స్థలాలనూ లీజుకిచ్చే ప్రయత్నాల్లో యాజమాన్యం ఉంది. కాగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో ఆక్యుపెన్సీ రేషియో 100% ఉందని చెబుతున్న యాజమాన్యం.. ఆదాయం కోసం ఆస్తులను లీజుకివ్వాలనుకోవడం సరికాదని కార్మికులు వాపోతున్నారు. సాధారణంగా 70% ఆక్యుపెన్సీ రేషియో ఉంటేనే సంస్థ నిర్వహణకు సరిపడ నిధులు ఉంటాయని, ఇప్పుడు 100% ఆక్యుపెన్సీ ఉండి, మహాలక్ష్మి పథకంతో రూ.800 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించినా ఇంకా కార్మికులకు బకాయిలు ఉండటం, ఆస్తుల లీజు నిర్ణయాలు ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఆభా యాప్‌తో తగ్గిన ప్రయాస

» ఓపీ మొదలు ల్యాబ్ రిపోర్టుల దాకా..

» రోగులకు అందే సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే

» ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరీక్షణకు స్వస్తి

» రోగి ఆరోగ్య చరిత్ర యాప్‌లో నిక్షిప్తం



మంగళ్‌హాట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్కారు ఆస్పత్రికి వెళితే ఓపీ కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పని లేదు. గతంలో మీకు ఏ సమస్య ఉంది, దానికి ఏ మందులు వాడుతున్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక వేళ ల్యాబ్‌లో ఏవైనా పరీక్షలు చేయించుకుంటే.. ఆ రిపోర్టుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. స్మార్ట్ ఫోన్‌లో ఆయుష్మాన్ భారత్ యాప్(ఆభా యాప్) ఇన్‌స్టాల్ చేసుకుని.. ఆస్పత్రిలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు.. చాలా పనులు యాప్‌లోనే అయిపోతాయి. పైగా రోగి ఆరోగ్య చరిత్ర మొత్తం ఒక్క ఐడీలో పొందపరచబడి ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారు సులభంగా వైద్య సేవలు పొందడానికి ఆభా యాప్ ఉపయోగపడుతోంది.

యాప్ ఇలా పనిచేస్తుంది..

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణ వ్యాప్తంగా 102 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆభా యాప్ ద్వారా రోగులకు సేవలందుతున్నాయి. రోగి ముందుగా తన సెల్ ఫోన్ నుంచి ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ వెంటనే క్షణాల్లో హెల్త్ కార్డు జారీ అవుతుంది. దీని ద్వారా ఆయుష్మాన్ భారత్ సేవలు అందులున్న ఏదైనా ప్రభుత్వ ఆస్పత్రికి వెళినపుడు ఓపీ చీటీ కోసం క్యూలైన్‌లో నిలబడాల్సిన అవసరం లేదు. ఓపీ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఆభా యాప్‌తో స్కాన్ చేస్తే.. వెంటనే ఓ నంబరు చూపిస్తుంది. ఆ నంబరును ఓపీ కౌంటర్‌లో చెప్పగానే రోగి పేరుతో ఓపీ చీటీ ఇస్తారు. అనంతరం డాక్టర్ వద్దకు వెళ్లాలి. ఒక వేళ ఏదైనా వైద్య పరీక్షలు చేయించుకుంటే.. ఆ రిపోర్టులను ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ అకౌంట్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో రిపోర్టుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. డాక్టర్‌ను కలిసి రోగి సెల్‌ఫోన్‌లోని రిపోర్టులను చూపించవచ్చు. లేదా వైద్యుల సెల్‌ఫోన్‌లో రోగి ఐడీ ఆధారంగా రిపోర్టులను పరిశీలించవచ్చు. దీని ద్వారా గంటల తరబడి వేచి ఉండే సమస్యకు స్వస్తి పలికినట్లైంది. అదే విధంగా డాక్టర్ రాసిన మందుల వివరాలు కూడా యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. తద్వారా రోగి ఏ మందులు వాడుతున్నాడన్న సమాచారం కూడా ఉంటుంది. అత్యవసర సమయంలో రోగి లేదా క్షతగాత్రులకు నిర్వహించిన పరీక్షలు, అందుకు సంబంధించిన రిపోర్టులు, చేసిన చికిత్స వివరాలను ఆభా యాప్‌లో తప్పనిసరిగా పొందుపరచాలని నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశించింది. దీంతో యాప్‌లో రోగి సమాచారం మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. ప్రాణాపాయ స్థితిలో రోగి ఆస్పత్రికి వచ్చినపుడు ఆభా ఐడీ ద్వారా రోగి ఆరోగ్య వివరాలను డాక్టర్లు తెలుసుకునే వీలుంది. వయసు పైబడిన వారి విషయంలో షుగర్, బీపీ ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. దీంతో రోగికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై వైద్యులు ఓ నిర్ణయానికి వస్తారు. డిజిటలైజేషన్ ద్వారా సమయం ఆదా కావడంతో పాటు రోగికి మెరుగైన వైద్యం అందించడంలో ఉపయుక్తంగా ఉంటుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలో ఉస్మానియా ఆస్పత్రి టాప్..

రాష్ట్ర వ్యాప్తంగా 102 ఆస్పత్రుల్లో ఆభా యాప్ ద్వారా డిజిటల్ సేవలను అందిస్తుండగా ఉస్మానియా ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచింది. ఆభా యాప్ ద్వారా ఇప్పటి వరకు 3.39 కోట్ల మంది కార్డులను పొందడంతో పాటు ఓపీ సేవల నిమిత్తం ఉపయోగించుకున్నారు. అదే విధంగా 2.77 కోట్ల ల్యాబ్ టెస్టులు నిర్వహించగా.. రిపోర్టులు ఆయా అకౌంట్లకు అనుసంధానమయ్యాయి. ఇందులో 17 లక్షల మంది వరకు ఉస్మానియా ఆస్పత్రిలో ఓపీ సేవలను పొందగా, 67 లక్షల వరకు ల్యాబ్ టెస్టులను నిర్వహించి రిపోర్టులను యాప్‌లో నిక్షిప్తం చేశారు.

జీఎస్టీ తగ్గినా.. ఆస్పత్రుల్లో రోగులకు ఊరట దక్కేనా?

» ఔషధాలపై జీఎస్టీ తగ్గడంతో దీర్ఘకాలిక రోగులకు తగ్గనున్న ఆర్థిక భారం

» అయితే, మెడికల్ యంత్రాలపై తగ్గిన జీఎస్టీని ప్రైవేటు ఆస్పత్రులు అమలు చేయడంపై అనుమానాలు

» వేరే ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చికిత్సల చార్జీలు తగ్గబోవంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా ప్రజలకు ఆస్పత్రుల ఖర్చులు, మందుల భారం తగ్గించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంది. ఔషధాలపై జీఎస్టీని తగ్గించడంతో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారికి ఆర్థిక భారం కొంత తగ్గనుంది. అదే సమయంలో ఆస్పత్రుల్లో అత్యవసర సమయాల్లో వాడే మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, టెస్ట్ స్ట్రిప్‌లపై ప్రస్తుతం ఉన్న 12% జీఎస్టీని కేంద్రం 5 శాతానికి తగ్గించింది. అయితే, ఆస్పత్రుల్లో నిత్యం వినియోగించే ఈ వస్తువులపై జీఎస్టీ భారం తగ్గినప్పటికీ... ఆ ఊరట రోగులకు లభిస్తుందా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక రోజు ఐసీయూలో ఉంటే సగటున రూ.30-రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ భారాన్ని 5 శాతానికి తగ్గించారు. ఆ మేరకు ఐసీయూలో ఉన్న రోగిపై బిల్లు భారం కూడా తగ్గాలి. కానీ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు మాత్రం ఇతరత్రా వ్యయాల దృష్ట్యా రోగులకు చార్జీలు పెద్దగా తగ్గబోవని చెప్తున్నారు. ఎవరైనా ఆస్పత్రికి వెళ్తే టెస్టులు చేయకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. డయాగ్నస్టిక్ కిట్లపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. ఆ మేరకు రోగులపై టెస్టులకయ్యే చార్జీలు తగ్గుతాయా అంటే కచ్చితంగా చెప్పలేమని వరంగల్‌కు చెందిన ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి ఎండీ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. మెజార్టీ ప్రైవేటు ఆస్పత్రులు మాత్రం రోగులపై చార్జీల భారంలో ఎటువంటి మార్పు ఉండబోదని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. మరోవైపు, ప్రస్తుతం ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్‌పై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెరుగుతోంది. దీంతో చిన్న పట్టణాల్లో కూడా హెల్త్ క్లబ్‌లు, ఫిట్‌నెస్ కేంద్రాలు వెలుస్తున్నాయి. వీటికి వెళ్లే వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. దీన్ని మరింత ప్రోత్సహించాలని మోదీ సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం హెల్త్ క్లబ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, యోగా సెంటర్లలో జీఎస్టీని 18శాతం నుంచి 5శాతానికి తగ్గించింది.

కేంద్రం ఇచ్చిన రిలీఫ్ రోగులకు అందాల్సిందే



ఆస్పత్రుల్లో వాడే యంత్రాలు, టెస్టింగ్ కిట్లు, మెడికల్ ఆక్సిజన్‌పై ప్రస్తుతం ఉన్న జీఎస్టీని 12% నుంచి 5 శాతానికి తగ్గించడం గొప్ప నిర్ణయంగా చెప్పాలి. దీంతో కొంతమేరకు రోగులపై భారం తగ్గుతుంది. ఈ ఊరట రోగులకు అందాల్సిందే. అయితే, ప్రైవేటు ఆస్పత్రులు వెంటనే దీన్ని అమలు చేయకపోవచ్చు. కానీ, రాబోయే రోజుల్లో ఆస్పత్రుల మధ్య పోటీ వల్ల అవే చార్జీలను తగ్గించే పరిస్థితులు ఏర్పడతాయి. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

- డాక్టర్ జీ.వెంకటేశ్వర్లు, ఎండీ, శ్రీరక్ష ఆస్పత్రి, ఖమ్మం

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.